www.truepointnews.com
ESTD 2024
PointNewsDaily
pointnewsdaily
ARN No: T/TG/2024/1040
Vol.I ISSUE 273
*Air Surcharge Extra Applicable

# పాయింట్

Published From : Hyderabad - Vijaywada - Delhi - Bengaluru
గురువారం 17, జూలై, 2025
పేజీలు :12



ఇరిగేషన్ మాజీ ఈఎన్సీ మురళీధర్‌రావుకు 14 రోజుల రిమాండ్ 2



2 ఉత్తమ్ కుమార్ రెడ్డి క్వాష్ పిటిషన్‌పై విచారణ వాయిదా




ఆదిలాబాద్‌లో ఉద్యోగాల పేరుతో మోసం: 500 మందిని ముంచిన డిజిటల్ మైక్రో ఫైనాన్స్ సంస్థ 2



## టాలీవుడ్ హీరో రవితేజ ఇంట్లో విషాదం

**టీపీఎన్, హైదరాబాద్:**

టాలీవుడ్ ప్రముఖ నటుడు రవితేజ ఇంట్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన తండ్రి రాజగోపాల్ రాజు (90) మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని రవితేజ నివాసంలో తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా వృద్ధాప్య సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హఠాన్మరణం కుటుంబాన్ని తీవ్ర విషాదంలో ముంచింది. రాజగోపాల్ రాజు స్వస్థలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేట. ఆయన గతంలో ఫార్మసిస్ట్‌గా సేవలందించారు. ఆయనకు ముగ్గురు కుమారులు. రవితేజ, రఘు, భరత్ రాజు. రవితేజ ప్రముఖ సినీనటుడు. రఘు, భరత్ రాజులు కూడా సినీ రంగంలో తమదైన ప్రయాణం చేశారు. భరత్ రాజు 2017లో సడెన్ హార్ట్ అటాక్ తో కన్నుమూశారు. తండ్రి మరణ వార్త తెలిసిన వెంటనే రవితేజ అభిమానులు, సినీ ప్రముఖులు ఆయన నివాసానికి చేరుకొని సంతాపం తెలియజేశారు.



# తెలుగు రాష్ట్రాల జలవివాదాలపై ఢిల్లీలో కీలక భేటీ
## ప్రత్యేక కమిటీ ఏర్పాటుకు నిర్ణయం

- **తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ఢిల్లీలో జలశక్తి శాఖ సమావేశం**
- **జలశక్తి శాఖ ముందు అజెండాలో 13 అంశాలు ప్రతిపాదించిన తెలంగాణ**
- **పాలమూరు-రంగారెడ్డి, డిండి, సమ్మక్కసాగర్ కు అనుమతులు ఇవ్వాలని ప్రతిపాదన**
- **ప్రాణహిత-చేవేళ్ల సహా కీలక ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలని ప్రతిపాదన**

**టీపీఎన్, ఢిల్లీ:**

2025 జూలై 16న ఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కీలక సమావేశం జరిగింది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, రెండు రాష్ట్రాల నీటి పారుదల మంత్రులు.. ఉత్తమ్ కుమార్ రెడ్డి, రామానాయుడు, సంబంధిత అధికారులు హాజరయ్యారు. ఈ భేటీ సుమారు గంటన్నర పాటు కొనసాగింది. ఈ సమావేశంలో తెలుగు రాష్ట్రాల మధ్య కొనసాగుతున్న కృష్ణా, గోదావరి జలాల వివాదాలపై విస్తృత చర్చ జరిగింది. తెలంగాణ ప్రభుత్వం 13 కీలక అంశాలను ప్రతిపాదించింది. ఏపీ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టును ప్రధాన ఎజెండాగా ప్రస్తావించింది. ఇరు రాష్ట్రాల వాదనలు కేంద్రానికి వినిపించాయి.

**తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన 13 కీలక అంశాలు:**

1. పాలమూరురంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాల కోసం తక్షణ అనుమతులు ఇవ్వాలి, 2. శ్రీశైలం నుంచి ఇతర బేసిన్‌లకు ఆంధ్రప్రదేశ్ తరలిస్తున్న నీటిని ఆపాలి, 3. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రారంభించిన ప్రాజెక్టులకు సహకరించేలా కృష్ణా ట్రిబ్యునల్‌లో మద్దతుగా ఏపీ వాదించాలి, 4. కృష్ణా జలాలను వేరే బేసిన్‌కు తరలించకుండా కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు చర్యలు తీసుకోవాలి. టెలిమెట్రీల ఏర్పాటుకు ఏపీ అంగీకరించాలి, 5. తుంగభద్ర బోర్డు ద్వారా నీటి తరలింపు అంశాన్ని చర్చించాలి, 6. రాయలసీమ ఎత్తిపోతల పథకం పైన ఎన్జీటీ ఆదేశాల అమలుకు కేంద్రం చొరవ చూపాలి, 7. శ్రీశైలం కుడి కాలువ ద్వారా అధిక నీటి తరలింపును నియంత్రించాలి, 8. హంద్రీనీవా, వెలిగొండ, గురు రాఘవేంద్ర ప్రాజెక్టులపై నియంత్రణ విధించాలి, 9. శ్రీశైలం డ్యాం భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలి, 10. శ్రీశైలం నుంచి నీటి తరలింపు వల్ల విద్యుత్ ఉత్పత్తికి ఇబ్బందులు కలుగుతాయని గుర్తించి, చర్యలు తీసుకోవాలి, 11. ఇచ్చంపల్లి ప్రాజెక్టుకు పోలవరం తరహాలో నిధులు మంజూరు చేయాలి. ఇచ్చంపల్లి-కావేరి లింక్‌కు అనుమతులు ఇవ్వాలి, 12. సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు తక్షణ అనుమతులు ఇవ్వాలి, 13. ప్రాణహితచెవెళ్ల ప్రాజెక్టును ఏఐబిపి కింద చేర్చి నిధులు మంజూరు చేయాలి, తుమ్మిడి హట్టి బ్యారేజ్ నిర్మాణానికి కేంద్రం మహారాష్ట్రతో చర్చలు జరిపి సహకరించాలి.

**సమావేశంలో తీసుకున్న ముఖ్య నిర్ణయాలు:**

తెలుగు రాష్ట్రాల మధ్య జలవివాదాల పరిష్కారం కోసం కేంద్ర ఆధ్వర్యంలో ఓ ప్రత్యేక కమిటీని జూలై 21లోపు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ కమిటీలో రాష్ట్ర, కేంద్ర, సాంకేతిక నిపుణులు సభ్యులుగా ఉంటారు. శ్రీశైలం ప్రాజెక్టు మరమ్మత్తుల పనులను వెంటనే ప్రారంభించాలని ఇరు రాష్ట్రాల సీఎంలు అంగీకరించారు. గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డును హైదరాబాద్‌లో కొనసాగించాలని, కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డును అమరావతిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రిజర్వాయర్ల వద్ద టెలిమెట్రీ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని ఇరు రాష్ట్రాల సీఎంలు అంగీకరించారు. శ్రీశైలం ప్లంజ్ పూల్‌ను మూసేయాలని నిర్ణయం తీసుకున్నారు. అవసరమైతే మరోసారి సీఎంల స్థాయిలో సమావేశం నిర్వహించాలని వెల్లడించారు.

# పరిశ్రమల స్థాపనకు తెలంగాణ అనుకూలం: డిప్యూటీ సీఎం భట్టి

**టీపీఎన్, హైదరాబాద్:**

తెలంగాణ పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన వాతావరణం కలిగిన ప్రాంతమని డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. బుధవారం హైదరాబాదులోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ఫ్రాన్స్ కాన్సల్ జనరల్ మార్క్ లెమీ నేతృత్వంలోని బృందం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసింది. రాష్ట్రంలోని పెట్టుబడి అవకాశాలు, పారిశ్రామికాభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడిన డిప్యూటీ సీఎం... తెలంగాణలో టెక్నాలజీ, హైఎండ్ మాన్యుఫాక్చరింగ్, పునరుత్పాదక ఇంధన రంగాల్లో అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని తెలిపారు. రాష్ట్రానికి కావలసిన మౌలిక సదుపాయాలు, నైపుణ్యాలు ఉన్న యువశక్తి, విధాన పరమైన స్పష్టత వంటి అంశాలు పరిశ్రమలకు అనుకూలంగా నిలుస్తున్నాయని వివరించారు. రాష్ట్రంలోని వనరులు, పరిశ్రమలకు అనువైన ప్రాంతాలను స్వయంగా పరిశీలించి, అధ్యయనం చేయాల్సిందిగా ఫ్రెంచ్ బృందాన్ని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం పూర్తిస్థాయి సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు భట్టి విక్రమార్క భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్కో సీఎండీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# మలక్‌పేట కాల్పుల కేసులో వెలుగులోకి కొత్త విషయాలు ....!

- **మలక్‌పేట కాల్పుల కేసుపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం**
- **విచారణలో వివాహేతర సంబంధం కోణం వెలుగులోకి**
- **తొలుత భూ తగాదాలు, ఆర్థిక లావాదేవీలు కారణమని అనుమానాలు**
- **చందుపై 8 రౌండ్లు కాల్పులు.. శరీరంలోకి 5 బుల్లెట్లు**
- **తొమ్మిది మందిని నిందితులుగా గుర్తించిన పోలీసులు**
- **3 బుల్లెట్లు, హత్యకు ఉపయోగించిన కారు స్వాధీనం**
- **నలుగురు నిందితులు అరెస్ట్.. మిగిలిన ఐదుగురి కోసం గాలింపు**

**టీపీఎన్, కృష్ణ కుమార్, స్పెషల్ డెస్క్:**






మలక్‌పేటలో జరిగిన కాల్పుల కేసుపై పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఇప్పటికే లొంగిపోయిన నిందితుల నుంచి తీసుకున్న వాంగ్మూలాల ఆధారంగా అసలు కారణం ఏమై ఉంటుందన్న దానిపై విచారణ సాగుతోంది. తొలుత భూ తగాదాలు హత్యకు కారణమై ఉండొచ్చని భావించిన పోలీసులు, ఆ తర్వాత ఆర్థిక లావాదేవీలు కేంద్ర బిందువుగా దర్యాప్తు కొనసాగించారు. అయితే లొంగిపోయిన నిందితులను విడివిడిగా విచారించగా, చందు రాథోడ్ మరియు అతని స్నేహితుడు రాజేష్ మధ్య వివాహేతర సంబంధం ఆధారంగా గొడవలు ఉన్నాయని సమాచారం బయటకు వచ్చింది. ఈ విషయాన్ని అధికారులు గోప్యంగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో మొత్తం తొమ్మిది మంది నిందితులు ఉండగా, వారిలో నలుగురు కాల్పులు జరిపినట్టు పోలీసులు గుర్తించారు. మిగిలిన ఐదుగురు వారికి సహకరించినట్టు అనుమానం. చందుపై ఎనిమిది రౌండ్ల కాల్పులు జరిగాయి. ఇందులో ఐదు బుల్లెట్లు అతని శరీరంలోకి దూసుకెళ్లాయి. ఘటనా స్థలిలో మిగిలిన మూడు బుల్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఉపయోగించిన కారును సైతం సీజ్ చేశారు. ప్రస్తుతం నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేయగా, మిగిలిన ఐదుగురి కోసం గాలింపు కొనసాగుతోంది. ఈ దిశగా నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట ప్రాంతానికి చెందిన అనేక మంది వ్యక్తులను పోలీసులు విచారిస్తున్నారు. ఘటన జరిగిన సమయంలోనే టాస్క్ ఫోర్స్, లా అండ్ ఆర్డర్ పోలీసుల బృందాలు రంగంలోకి దిగాయి. అధికారుల ఆదేశాలతో మరో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. శాలివాహన నగర్ పార్క్ పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరా ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. హత్యకు గల ఖచ్చితమైన కారణాలు వెలుగు చూడాలంటే గతంలో చందుతో కలిసి నిందితులు చేసిన భూ సెటిల్మెంట్లు, ఆర్థిక లావాదేవీలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పోలీసులు భావిస్తున్నారు. క్లూస్ టీమ్ నివేదిక, పోస్టుమార్టం రిపోర్టు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, కుటుంబ సభ్యుల నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా దర్యాప్తు కొనసాగుతోంది.




# బనకచర్లపై చర్చ జరగలేదన్న సీఎం రేవంత్.. హరీష్‌రావు ఘాటు విమర్శలు

సీఎం రేవంత్ రెడ్డి మరోసారి ప్రజలను తప్పుదారి పట్టించారని బీఆర్ఎస్ మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు ఫైర్ అయ్యారు. ఢిల్లీలో జరిగిన తెలుగు రాష్ట్రాల సీఎంల సమావేశం తర్వాత రేవంత్ చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా స్పందించారు. బనకచర్ల ప్రాజెక్టుపై చర్చే జరగలేదని రేవంత్ అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు. నిజానికి ఆ భేటీలో మొదటగా చర్చించిన అంశమే బనకచర్ల అని తేల్చి చెప్పారు. ఉత్తమ్‌రేవంత్‌ల మీడియా సమావేశానికి ముందే ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు బనకచర్లపై కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారని అన్నారు. జనాలముందు నిజాలు దాచిపెట్టి అబద్ధాలు చెప్పే అధికారం సీఎం రేవంత్‌కి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఇలా దారి తప్పించే మాటలు మాట్లాడటం తగదన్నారు. బాబుకు శిష్యుడిలా వ్యవహరిస్తూ, కమిటీ ఏం చెబితే అదే చేస్తానని ముందే అంగీకరించడం తెలంగాణపై మోసం అని విరుచుకుపడ్డారు. చంద్రబాబు చేతిలో ఉన్న కేంద్రం ఏపీకి అనుకూలంగా కమిటీ నివేదిక ఇస్తే, రేవంత్ సంతకం చేయడం ఏంటని నిలదీశారు. బనకచర్లపై ఇప్పటికే కేంద్ర సంస్థలు అభ్యంతరాలు తెలియజేశాయని అన్నారు. అలాంటి అంశంపై ఏ విచారణలోనైనా ముందుగానే అంగీకారం తెలిపే అవసరం రేవంత్‌కు ఏముందో చెప్పాలని డిమాండ్ చేశారు. భేటీకి వెళ్లనని చెప్పిన వ్యక్తి రాత్రికి రాత్రి ఢిల్లీకి పరుగులు తీసి వెళ్లడం వెనుక ఎలాంటి ఆజ్ఞలు పని చేశాయో రాష్ట్ర ప్రజలు తెలుసుకోవాలని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అని చెప్పుకుంటూనే పాలన అంతా చంద్రబాబు హస్తాల్లో ఉందన్నట్టుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పీపీటీ సమావేశంలో తెలంగాణ హక్కులపై స్పష్టత ఇవ్వకుండా బాబుపై పొగడ్తలు, కేసీఆర్‌ను విమర్శించడం దారుణమన్నారు. టెలిమెట్రీ వ్యవస్థ తాము అధికారంలో ఉన్నప్పుడే అమలు చేశామని గుర్తుచేశారు. ఏడాదిన్నర పాలనలో కాంగ్రెస్ చేసింది కేసీఆర్‌ను తిట్టడమే తప్ప.... రాష్ట్రానికి ఉపయోగపడే ఒక్క పని కూడా చూపించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు అన్యాయం జరిగితే బీఆర్ఎస్ చూస్తూ ఉరుకోదని హరీష్‌రావు హెచ్చరించారు.




# మాజీ ఐఏఎస్ అధికారి ఆర్‌పీ సింగ్ అరెస్ట్.. భూ వివాదం కేసులో సీసీఎస్ విచారణ....!

- **భూ వివాదంలో చిక్కుకున్న మాజీ ఐఏఎస్ అధికారి ఆర్‌పీ సింగ్**
- **వివాదాస్పదంగా మారిన ఖాజాగూడ సర్వే నం.19లో 10.32 గుంటల భూమి**
- **ఆ భూమిపై ఆర్‌పీ సింగ్, ఆయన భార్య హర్వీందర్ సింగ్ హక్కును క్లెయిమ్**
- **కూతురికి గిఫ్ట్ ఇచ్చిన ల్యాండ్‌ను డెవలప్మెంట్‌కి ఇచ్చారని ఆరోపణలు**
- **అగ్రిమెంట్ క్యాన్సల్ చేసి మోసం చేశారని ఫిర్యాదు**
- **ఐ టవర్ నిర్మాణ సంస్థకు కమర్షియల్ కాంప్లెక్స్ కోసం భూమి ఇచ్చినట్లు ఒప్పందం**
- **బ్యాంక్ లోన్ కోసం చేసిన ప్రయత్నంలో వెలుగులోకి భూ వివాదం**
- **కేసు లా అండ్ ఆర్డర్ స్టేషన్ నుంచి సీసీఎస్‌కి బదిలీ**

**టీపీఎన్, కృష్ణ కుమార్, స్పెషల్ డెస్క్:**

మాజీ ఐఏఎస్ అధికారి ఆర్‌పీ సింగ్ ప్రస్తుతం భూ వివాదంలో చిక్కుకుపోయారు. హైదరాబాద్‌లోని సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) అధికారులు ఆయనను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా, రాయదుర్గం పరిధిలోని ఖాజాగూడ సర్వే నెంబర్ 19లో ఉన్న 10.32 గుంటల భూమి గురించి ఆరా తీస్తున్నారు. ఈ భూమిపై ఆర్‌పీ సింగ్, ఆయన భార్య హర్వీందర్ సింగ్ తమకే హక్కుందని క్లెయిమ్ చేశారు. అనంతరం, ఈ భూమిని ఐ టవర్ నిర్మాణ సంస్థకు కమర్షియల్ కాంప్లెక్స్ అభివృద్ధి కోసం అప్పగించారు. సంస్థ రికార్డుల ప్రకారం, మొత్తం 3 ఎకరాల 24 గుంటల భూమిని గిఫ్ట్ డీడ్ రూపంలో ఇస్తూ ఒప్పందం చేశారు. అయితే.... ఆ గిఫ్ట్ డీడ్‌ను ఆర్‌పీ సింగ్ భార్య హర్వీందర్ కౌర్ తరువాత క్యాన్సిల్ చేశారు. తమ కూతురు అమెరికాలో ఉందని, ఆమెకు సమాచారం లేకుండా భూమి ఇచ్చినట్లు గుర్తించి డీడ్‌ను రద్దు చేసినట్లు చెప్పారు. ఈ విషయాన్ని ల్యాండ్ డెవలప్ చేసిన ఐ టవర్ సంస్థకు తెలియజేయకుండా ముందే భూమిని డెవలప్ చేయమని అనుమతించినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై 2023లో సంస్థ రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆర్‌పీ సింగ్ పాత్రపై అనుమానాలు వచ్చాయి. పోలీసుల ప్రాథమిక దర్యాప్తు అనంతరం కేసును లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ నుండి సీసీఎస్‌కు బదిలీ చేశారు. ఈ క్రమంలో, ఐ టవర్ సంస్థ బ్యాంకు నుంచి లోన్ తీసుకోవడానికి ప్రయత్నించగా, బ్యాంక్ అధికారులు భూమిపై స్పష్టత లేకపోవడంతో లోన్ నిలిపివేశారు. అప్పటికే ఐ టవర్ నిర్మించిన కమర్షియల్ కాంప్లెక్స్‌లో 700 మంది కొనుగోలుదారులు ఫ్లాట్లు కొనుగోలు చేశారు. కానీ లోన్ రాక, నిర్మాణం ఆగిపోవడం వల్ల వారు తీవ్రంగా మోసపోయారు. ప్రస్తుతం ఈ భూమిపై యాజమాన్య హక్కుల స్పష్టత లేకపోవడంతో కస్టమర్లు గందరగోళానికి గురవుతున్నారు. ఇప్పటికే చాలా మంది లక్షల రూపాయలు చెల్లించారు. తమకు ఫ్లాట్లు వస్తాయా లేక మోసపోయామా అన్న భయం వారిని వెంటాడుతోంది. మోసం, నమ్మకద్రోహం వంటి సెక్షన్ల కింద సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేసి, మాజీ ఐఏఎస్ అధికారి ఆర్‌పీ సింగ్‌ను విచారిస్తున్నారు. మరిన్ని ఆధారాల వెలుగులోకి రావాల్సి ఉంది. బాధితులు తమ హక్కులను రక్షించుకోవాలంటూ ప్రభుత్వాన్ని, పోలీసులను ఆశ్రయిస్తున్నారు.



# మేడిగడ్డ బరాజ్‌పై సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్

**టీపీఎన్, తెలంగాణ:**

రాష్ట్రంలో మళ్లీ రాజకీయ మాటల యుద్ధం మొదలైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన దళిత బంధు సాధన సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి మేడిగడ్డ బరాజ్ కూలిపోయిందంటూ చెప్పిన మాటలకు సరైన బహిరంగ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. ''దమ్ముంటే మేడిగడ్డ బ్యారేజ్‌పై బహిరంగ చర్చ పెట్టండి. మేము సిద్ధంగా ఉన్నాం. కానీ రేవంత్ రెడ్డి చర్చకు రావాలని పిలిస్తే పారిపోయాడు. ఇదే నిజం. చర్చకు రా అన్నాం, రాలేదు. మరొకసారి చెబుతున్న.... మేడిగడ్డ మీద కాకపోతే నాగార్జునసాగర్ కట్ట మీదైనా చర్చకు వస్తావా?'' అని అన్నారు. ''రెండు నదీ ప్రాజెక్టుల మధ్య తేడా కూడా తెలియని వ్యక్తి ముఖ్యమంత్రి అయ్యాడు. కాళేశ్వరాన్ని 'కూలేశ్వరం' అంటున్నాడంటే ఇతని తెలివి ఏ రేంజులో ఉందో చూస్తే సరిపోతుంది. ఇప్పటికీ మా సీనియర్ నేత జగదీశ్‌రెడ్డి మేడిగడ్డ బరాజ్ వద్దకు వెళ్లి పరిశీలించారు. అనంతరం చర్చకు సిద్ధమని ప్రకటించారు. అయినా ముఖ్యమంత్రి నుంచి స్పందన లేదు. ఈసారి దమ్ముంటే రా చర్చించుకుందాం'' అని మరోసారి రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. 'ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నాడు. నన్ను కోసుకు తింటారా? ఏం పీక్కుంటారో పీక్కోండి' అంటూ రాష్ట్ర ప్రజల్ని అవమానిస్తున్నారు. ఇది ఎలాంటి భాష? ఇది ముఖ్యమంత్రికి తగిన మాటా?'' అని ఫైర్ అయ్యారు. ''బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం రచించినప్పుడు రేవంత్‌లాంటి దొంగలు పదవుల్లోకి వస్తారని ఊహించలేకపోయారు. లేకపోతే ఐదు సంవత్సరాలపాటు పదవిలో ఉండాల్సిన అవసరం లేకుండా 'రీకాల్' చేసే చట్టాన్ని కూడా తెచ్చేవారు. కానీ ఇలాంటివాళ్లకోసం ఇప్పుడు ప్రజలే బుద్ధి చెబుతారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు 'ఏం పీక్కుంటారో' చూపిస్తారు. తిట్లు రాజకీయాల్లో మాకు ఇష్టం లేదు. కానీ రేవంత్‌కు ఆయన భాషలోనే మాట్లాడితే అర్థమవుతుంది. కుక్క కాటుకు చెప్పుదెబ్బ అన్నట్లు మాట్లాడాల్సి వస్తోంది'' అని కేటీఆర్ విమర్శల దాడి చేశారు.

# ఆదిలాబాద్‌లో ఉద్యోగాల పేరుతో మోసం

- **డిజిటల్ మైక్రో ఫైనాన్స్ పేరుతో ప్రైవేట్ సంస్థ మాయాజాలం**
- **ఉట్నూర్, జైనూర్ బ్రాంచ్‌లలో 500 మందికి ఉద్యోగాల ఎంపిక పేరుతో వసూళ్లు**
- **ఒక్కో అభ్యర్థి నుంచి రూ.20,000 చొప్పన డిపాజిట్**
- **ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో పోలీసులను ఆశ్రయించిన బాధితులు**



**టీపీఎన్, తెలంగాణ:**

ఉద్యోగాల పేరిట నిరుద్యోగులను మోసగించిన ఘటన ఆదిలాబాద్ జిల్లాలో వెలుగులోకి వచ్చింది. డిజిటల్ మైక్రో ఫైనాన్స్ అనే పేరుతో ఓ ప్రైవేట్ సంస్థ ఆదిలాబాద్‌లోని ఉట్నూర్, జైనూర్ ప్రాంతాల్లో బ్రాంచ్‌లు ఏర్పాటు చేసి, 300 మందికి పైగా అభ్యర్థులను ఉద్యోగానికి ఎంపిక చేసినట్లు ప్రకటించింది. ఎంపిక కావాలంటే విధిగా డిపాజిట్ అవసరం అంటూ ఒక్కో అభ్యర్థి నుంచి రూ.20,000 చొప్పున వసూలు చేశారు. అయితే.... ఉద్యోగాలు ఇవ్వకపోవడం, వేతనాల గురించి అడిగినా సరైన సమాధానం లేకపోవడంతో బాధితులు ఆందోళనకు దిగారు. రెండు నెలలుగా తిరుగుతున్నా స్పందన లేకపోవడంతో తాము మోసపోయామని గ్రహించారు. సంస్థను కృష్ణ అనే వ్యక్తి నడిపిస్తున్నట్లు సమాచారం. చివరికి బాధితులు డబ్బులు తిరిగి ఇవ్వాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బాధితుల నుంచి వాంగ్మూలాలు తీసుకుంటున్నారు. మోసాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు.



# ఉత్తమ్ కుమార్ రెడ్డి క్వాష్ పిటిషన్‌పై విచారణ వాయిదా

**టీపీఎన్, హైదరాబాద్:**

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్లపై విచారణను తెలంగాణ హైకోర్టు వాయిదా వేసింది. మంగళవారం న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ ఈ పిటిషన్లపై విచారణ జరిపారు. ఇరు పక్షాల వాదనలు విన్న అనంతరం, రాష్ట్ర ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించే పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్ రావుకు కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేశారు. అనంతరం ఈ కేసును జూలై 18వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ లక్ష్మణ్ ప్రకటించారు. గత సాధారణ ఎన్నికల సమయంలో, సూర్యాపేట జిల్లా నేరేడుచెర్ల, మఠంపల్లి పోలీస్ స్టేషన్లలో ఉత్తమ్ కుమార్ రెడ్డిపై కేసులు నమోదయ్యాయి. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన అభియోగాలతో కేసులు నమోదయ్యాయి. ఈ కేసులు వాస్తవాలకు విరుద్ధంగా, దుష్ప్రచారానికి పాల్పడే విధంగా ఉన్నాయని వాటిని కొట్టి వేయాలని కోరుతూ ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇటీవల హైకోర్టును ఆశ్రయించారు.

# కిల్లర్ వైఫ్స్: భర్తలకు ప్రాణసంకటం....!

- **దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న భర్తల హత్యలు**
- **62మంది పతుల హత్యలతో యూపీ నెంబర్ వన్**
- **తెలుగు రాష్ట్రాల్లో సైతం వెలుగు చూస్తున్న వైనం**
- **పక్కా ప్రణాళికలతో భర్తలను పాడెక్కిస్తున్న భార్యలు**

**టీపీఎన్, కృష్ణ కుమార్, స్పెషల్ డెస్క్:**



ఇల్లాలే ఇంటికి దీపం అంటారు మన పెద్దలు. కానీ ఇప్పుడు ఆ ఇల్లాలే తన ఇంటి దీపాన్ని ఆర్పేస్తోంది. ప్రియుడి మోజులో పడి తాళికట్టిన భర్తను కాటికి సాగనంపుతోంది. పెళ్లై పట్టుమని రెండు రోజులు కూడా గడవక ముందే భర్తకు మరణశాసనం రాస్తోంది. హనీమూన్ అంటున్నారు.. శుభం కార్డ్ వేస్తున్నారు. ఇది వరకు ప్రతి మగాడి విజయం వెనుక ఓ ఆడది ఉండేది. ప్రస్తుత కాలంలో ప్రతి మగాడి మరణం వెనుక కిలేడీ ఉంటోంది. ఇందుకు నిదర్శనం ప్రస్తుతం దేశంలో జరుగుతున్న ఘటనలే నిదర్శనం. ప్రియుళ్లను మర్చిపోలేకే భార్యలు ఈ ఘాతుకాలకు పాల్పడుతున్నారు. ప్రేమించిన వారిని మర్చిపోలేక కొన్ని రోజులకే భర్తలకు విడాకులిస్తున్నవాళ్లూ అధికంగానే ఉంటున్నారు. అయితే కొందరు మాత్రం ఏకంగా భర్తలకే స్పాట్ పెట్టేస్తున్నారు. దీంతో పెళ్లంటేనే యువత భయంతో పారిపోతోంది. పెళ్లంటే నూరేళ్ల పంట అని అనేవాళ్లు. కానీ ఇప్పుడు పెళ్లంటే మూడు రోజుల ముచ్చటగా మారిపోయింది. సెలబ్రిటీల దగ్గరి నుంచి సామాన్యుల వరకూ విడాకులు తీసుకుంటున్నారు. గతంలో పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్లు అధికంగా ఉండేవి. ఇప్పుడు లవ్ మ్యారేజెస్ ఎక్కువై పోయాయి. దీంతో విడాకులు, మరణాలు కూడా ఆ రేంజ్ లోనే పెరుగుతున్నాయి. తాజాగా జాతీయ నేర గణాంకాల రికార్డ్ ప్రకారం భార్య చేతిలో చనిపోయిన భర్తల మరణాల్లో ఉత్తర్ ప్రదేశ్ తొలి స్థానంలో ఉంది. ఆరాష్ట్రంలో గతేడాది 62 మంది భర్తలు.. భార్యల చేతిలో మరణించారు. ప్రస్తుతం ఆ సంఖ్య పెరిగినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత బీహార్ లో 42, రాజస్థాన్ లో 25, మధ్య ప్రదేశ్ లో 22, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లలో పదుల సంఖ్యలో భర్తలు మరణాలకు భార్యలు కారణమయ్యారు.

యూపీలోని మీరట్ లో సౌరభ్ కుమార్ ను తన భార్య ముస్కాన్.. లవర్ సాయంతో లేపేసింది. ఆ తర్వాత భర్త డెడ్ బాడీని ముక్కలుగా నరికి డ్రమ్ములో వేసి సిమెంట్ తో కప్పేసింది. మేఘాలయా మర్డర్ కేసు దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆ తర్వాత అమీన్ పూర్ లోనూ ఇలాంటి ఘటనే జరిగింది. తెలంగాణలో జరిగిన తేజేశ్వర్ హత్య కేసు వ్యవహారం కూడా దేశ వ్యాప్తంగా హాట్ టాపిక్ గా మారింది. ఇలా నిత్యం కిల్లర్ వైఫ్ ల వార్తలు నిత్యం పేపర్లు, టీవీలు, సోషల్ మీడియాలో వస్తూనే ఉన్నాయి. ఒకప్పుడు అమ్మాయిని ఒక అబ్బాయి చేతిలో పెట్టాలి అంటే ఆ అబ్బాయికి చెడు అలవాట్లు ఉన్నాయా అని చూసుకే వారు. కుటుంబ సభ్యులు ఎలాంటి వారు అంటూ చుట్టుపక్కల వారిని వాకబు చేసే వారు. ఇప్పుడు అమ్మాయి పరిస్థితిపై పిల్లాడి కుటుంబ సభ్యులు సమాచారం సేకరించే పరిస్థితి ఏర్పడిందని అబ్బాయిల పేరెంట్స్ అంటున్నారు. జ్యోతిష్యుడి దగ్గరికి వెళ్లి మరీ తమ కుమారుడి ఆయుష్షు గురించి పూర్తిగా తెలుసుకొని అర్ధాంతరంగా మరణం లేదని తెలుసుకున్నాకే పెళ్లికి సిద్ధం అవ్వాల్సి వస్తోందని చెబుతున్నారు. వినడానికి విడ్డురంగా ఉన్న ప్రస్తుతం ఇదే ట్రెండ్ నడుస్తోంది. ఏమైనా పెళ్లి చూపులకు వెళ్లే ముందు అమ్మాయి ఎవరినైనా ప్రేమించిందా, ముందుగా కనుక్కుని ఏడడుగులు వేయడం మంచిది లేదంటే.. మరో రోజు పేపర్ల న్యూస్ లా మారే అవకాశం లేకపోలేదు.

# మహిళలను కోటీశ్వరులుగా చేసే లక్ష్యంతో ఇందిరా మహిళా శక్తి: మంత్రులు

**టీపీఎన్, సంగారెడ్డి:**



స్వయం సహాయక సంఘాల మహిళలను ఆర్థికంగా స్వావలంబులుగా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్‌రెడ్డి తీసుకొచ్చిన "ఇందిరా మహిళా శక్తి" పథకం రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తోంది. ఈ కార్యక్రమాన్ని బుధవారం సంగారెడ్డిలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు .ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆశయమని చెప్పారు. ఇందిరమ్మ హౌసింగ్ ద్వారా ఒక్కో నియోజకవర్గానికి ఇండ్లు మంజూరు చేస్తున్నామని, సంగారెడ్డి నియోజకవర్గానికి ఇప్పటికే 3,500 ఇండ్లు మంజూరు చేశామని తెలిపారు. టీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో పది సంవత్సరాల పాటు రెండు పడకగదుల ఇళ్ల పేరిట ప్రజలను మోసం చేశారని, కానీ ఒక్కరికి కూడా ఇండ్లను ఇవ్వలేదని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక రేషన్ కార్డుల మంజూరు చేపట్టామన్నారు. గత ప్రభుత్వం ఒక రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం సంగారెడ్డికి 13 వేల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసిందని తెలిపారు. త్వరలో లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని వెల్లడించారు.మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. మహిళల ఆర్థిక అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ఎప్పటి నుంచో కృషి చేస్తోందన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రారంభమైన మహిళా సంఘాల ప్రోత్సాహక కార్యక్రమాలను ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి మరింత విస్తృతంగా అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని 23 వేలకు పైగా స్వయం సహాయక సంఘాలకు రూ.30 కోట్ల వడ్డీ లేని రుణాలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో మహిళా సంఘాల ద్వారా పెద్ద పౌల్ట్రీ పరిశ్రమ ఏర్పాటు కోసం మండల సమైక్యాలకు స్థలాలను కేటాయించనున్నట్లు చెప్పారు. జాతీయ రహదారుల వెంట రెండు ఎకరాల స్థలాల్లో పెట్రోల్ బంకులు ఏర్పాటు చేసి, మహిళలే నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

# రోడ్డు ప్రమాద బాధితుడికి మంత్రి శ్రీధర్‌బాబు అండ

**టీపీఎన్, తెలంగాణ:**

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మానవత్వం చాటుకున్నారు. మంగళవారం రాత్రి అధికారిక కార్యక్రమాలను ముగించుకొని వస్తుండగా... కేబుల్ బ్రిడ్జి సమీపంలో రోడ్డు పక్కన తీవ్ర గాయాలతో పడి ఉన్న ఓ యువకుడిని చూసి చలించిపోయారు. వెంటనే తన వాహనాన్ని ఆపి కిందకు దిగిన మంత్రి.... బాధితుడికి ధైర్యం చెప్పారు. "దిగులు చెందొద్దు... నేను అండగా ఉంటా" అని భరోసానిచ్చారు. స్వయంగా దగ్గరుండి బాధితుడిని ఆటోలో నిమ్స్ ఆసుపత్రికి పంపించారు. స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. బాధితుడితో పాటు ఓ కానిస్టేబుల్‌ను పంపించారు. ఇంకా ఏదైనా అవసరమైతే ఫోన్ చేయాలంటూ తన వ్యక్తిగత సహాయకుడి ఫోన్ నంబర్‌ను కూడా బాధితుడికి ఇచ్చారు. నిమ్స్‌కి చేరిన వెంటనే వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి మెరుగైన చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



# ఇరిగేషన్ మాజీ ఈఎన్సీ మురళీధర్‌రావుకు 14 రోజుల రిమాండ్

**టీపీఎన్, కృష్ణ కుమార్, స్పెషల్ డెస్క్:**



ఇరిగేషన్ శాఖ మాజీ ప్రధాన ఇంజనీర్ (ఈఎన్సీ) మురళీధర్‌రావుకు కోర్టు రిమాండ్ విధించింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ చేతికి చిక్కారు. ఆయనను అరెస్టు చేసిన అధికారులు కోర్టులో హాజరుపరగా.... కోర్టు 14 రోజుల పాటు జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నీటిపారుదల శాఖలో కీలక పదవుల్లో పనిచేసిన మురళీధర్‌రావు, ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టు పనుల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. ప్రాజెక్టు కట్టడానికి సంబంధించిన పలు అంశాల్లో అవకతవకలపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఆయనపై ఏసీబీ దృష్టిసారించింది. తాజాగా ఏసీబీ అధికారులు మురళీధర్‌రావు నివాసంతో పాటు ఆయన కుమారుడు అభిషేక్‌రావు ఇంటి సహా ఆయా కంపెనీల్లో సోదాలు నిర్వహించారు. ఈ దర్యాప్తులో భారీ స్థాయిలో ఆస్తులు బయటపడ్డాయి. మురళీధర్‌రావు వద్ద రూ. కోటి విలువైన చిట్స్, రూ.60 లక్షల బ్యాంక్ బ్యాలెన్స్, రూ.10 లక్షల విలువైన బంగారం, రెండు ఖరీదైన కార్లు, రెండు బైకులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. భూసంపత్తుల విషయంలోనూ ఆయన పేరుతో, బినామీల పేరుతో అనేక స్థలాలు ఉన్నట్టు ఏసీబీ గుర్తించింది. సిద్దిపేట జిల్లా గోపాల్‌పూర్‌లో 3.39 ఎకరాల భూమి, కీసరలో 30 గుంటల భూమి, రాచకొండలో 300 గజాల ప్లాట్, కరీంనగర్‌లో 6 ఓపెన్ ప్లాట్లు, ఘట్‌కేసర్‌లో 300 గజాల ప్లాట్, హయత్‌నగర్‌లో 1201 గజాలు, 1050 గజాల రెండు ప్లాట్లు, వరంగల్ శాయంపేటలో 234 గుంటల భూమి, హన్మకొండలో 303 గజాల ప్లాట్, ప్రజ్ఞాపూర్‌లో 10 గుంటల భూమి, 60 గజాల ప్లాట్ ఉన్నట్లు అధికారుల సోదాల్లో వెల్లడైంది. కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టుల పేరిట తీసుకున్న భారీ సబ్ కాంట్రాక్టులను తన కుమారుడి బినామీ కంపెనీలకు మురళీధర్‌రావు కట్టబెట్టినట్లు అధికారులు తేల్చారు. వర్క్ ఆర్డర్లను ఎవరికి ఎలా ఇవ్వాలన్న దానిపై పూర్తిగా ప్రభావం చూపినట్లు సమాచారం. ముఖ్యంగా హర్ష్ కన్‌స్ట్రక్షన్ అనే సంస్థలో నిధుల మళ్లింపుపై అధికారులు అనుమానాలు వ్యక్తం చేశారు. కాళేశ్వరం నిధులను అభిషేక్‌రావు ఆధ్వర్యంలోని కంపెనీకి మురళీధర్‌రావు మళ్లించారని ఆరోపిస్తున్నారు. ఈయన ENCగా పని చేసిన కాలంలో మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంపై కూడా అనేక ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. బ్యారేజీ కుంగుబాటుపై ప్రస్తుతం జరుగుతున్న విచారణలోనూ ఆయన కీలకంగా హాజరవ్వాల్సి ఉంటుంది. ఏసీబీ ఇప్పటివరకు ఆయన ఆస్తులకు సంబంధించిన దాదాపు 10 చోట్ల సోదాలు నిర్వహించింది. త్వరలో బ్యాంక్ లాకర్లను తెరిచి అందులో బంగారం లెక్కించే ప్రక్రియ ప్రారంభం కానుంది. కేసు తీవ్రతను బట్టి చూస్తే, ఇది కేవలం ఆరంభం మాత్రమేనన్న అభిప్రాయం అధికారులు వ్యక్తం చేస్తున్నారు.



| Abstract on Number of ZPPs, MPPs, ZPTCs and MPTCs | | | | | |
|---|---|---|---|---|---|
| S.No | Name of the Distirct | No. of ZPPs | No. of ZPTCs | No. of MPPs | No of MPTCs |
| 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| 1 | Adilabad | 1 | 20 | 20 | 166 |
| 2 | Badradri Kothagudam | 1 | 22 | 22 | 233 |
| 3 | Hanumakonda | 1 | 12 | 12 | 129 |
| 4 | Jagitial | 1 | 20 | 20 | 216 |
| 5 | Jangaon | 1 | 12 | 12 | 134 |
| 6 | Jayashankar Bhupalapally | 1 | 12 | 12 | 109 |
| 7 | Jogulamba Gadwal | 1 | 13 | 13 | 142 |
| 8 | Kamareddy | 1 | 25 | 25 | 233 |
| 9 | Karimnagar | 1 | 15 | 15 | 170 |
| 10 | Khammam | 1 | 20 | 20 | 283 |
| 11 | Kumurambheem Asifabad | 1 | 15 | 15 | 127 |
| 12 | Mahabubabad | 1 | 18 | 18 | 193 |
| 13 | Mahabubnagar | 1 | 16 | 16 | 175 |
| 14 | Mancherial | 1 | 16 | 16 | 129 |
| 15 | Medak | 1 | 21 | 21 | 190 |
| 16 | Mulugu | 1 | 10 | 10 | 83 |
| 17 | Nagarkurnool | 1 | 20 | 20 | 214 |
| 18 | Nalgonda | 1 | 33 | 33 | 353 |
| 19 | Narayanapet | 1 | 13 | 13 | 136 |
| 20 | Nirmal | 1 | 18 | 18 | 157 |
| 21 | Nizamabad | 1 | 31 | 31 | 307 |
| 22 | Peddapalli | 1 | 13 | 13 | 137 |
| 23 | Rajanna Sircilla | 1 | 12 | 12 | 123 |
| 24 | Ranga Reddy | 1 | 21 | 21 | 230 |
| 25 | Sangareddy | 1 | 26 | 26 | 271 |
| 26 | Siddipet | 1 | 26 | 26 | 230 |
| 27 | Suryapet | 1 | 23 | 23 | 235 |
| 28 | Vikarabad | 1 | 20 | 20 | 227 |
| 29 | Wanaparthy | 1 | 15 | 15 | 133 |
| 30 | Warangal | 1 | 11 | 11 | 130 |
| 31 | Yadadri Bhuvanagiri | 1 | 17 | 17 | 178 |
| | Grand Total | 31 | 566 | 566 | 5773 |

# స్థానిక ఎన్నికలకు రంగం సిద్ధం.. జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు ఖరారు

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి కీలక ప్రకటన విడుదల చేసింది. జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ స్థానాల సంఖ్యను ఖరారు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో మొత్తం 31 జడ్పీ స్థానాలు, 566 ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు.. 5,773 ఎంపీటీసీ స్థానాలు ఉన్నట్లు తెలిపింది. 12,778 గ్రామ పంచాయతీలు, 1.12 లక్షల వార్డులు ఉన్నట్లు పేర్కొంది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడనున్న నేపథ్యంలో ప్రభుత్వం జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ స్థానాలను ఖరారు చేస్తూ ప్రకటన చేసింది. స్థానిక సంస్థల ప్రాతినిధ్య వ్యవస్థలో ఈసారి సామాజిక న్యాయం పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించనున్నట్లు సమాచారం. త్వరలో వెలువడనున్న ఎన్నికల షెడ్యూల్‌తో రాష్ట్రంలో స్థానిక రాజకీయ వేడి మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది.



# మైనంపల్లి నివాసంలో మంత్రి శ్రీధర్‌బాబు సమావేశం

**టీపీఎన్, కుత్బుల్లాపూర్:**

దూలపల్లి నుంచి కొంపల్లి వరకు బహదూర్‌పల్లి మీదుగా నిర్మిస్తున్న 100 అడుగుల రోడ్ విస్తరణ పనుల్లో తమ ఇళ్లు, వ్యాపారాలు కోల్పోతున్నామంటూ దూలపల్లి వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మైనంపల్లి నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బాధిత కుటుంబాలను కలిసి మాట్లాడారు. పట్టణాభివృద్ధిలో భాగంగా చేపట్టిన రోడ్డు విస్తరణ పనులకు ప్రజల సహకారం అవసరమని మంత్రి పిలుపునిచ్చారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. భూములు కోల్పోయిన వారికి న్యాయం జరిగేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి పరిహారం కోసం నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో మంత్రితో పాటు మైనంపల్లి హన్మంతరావు, కొలన్ హనుమంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, భూపతి రెడ్డి, కొంపల్లి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, దుండిగల్ ఎమ్మార్వో మతిన్, భూములు కోల్పోతున్న దూలపల్లి వాసులు పాల్గొన్నారు.



# బీసీ మహిళలకు సబ్‌కోటా కల్పించాలి: ఆర్ కృష్ణయ్య

- **విద్య, ఉపాధి, పారిశ్రామిక రంగాల్లో కూడా రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్**

**టీపీఎన్, హైదరాబాద్:**

రాజకీయాల్లో మాత్రమే కాకుండా, విద్య, ఉపాధి, పారిశ్రామిక రంగాల్లో కూడా మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్లు విస్తృతంగా అమలవ్వాలంటే బీసీ మహిళలకు సబ్‌కోటా తప్పనిసరిగా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందువల్లే మహిళా బిల్లుకు పూర్తి సార్థకత చేకూరుతుందని స్పష్టం చేశారు. కాచిగూడలో బీసీ మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి శ్రావణి ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలకు న్యాయం చేయగల నాయకుడు ప్రధాని నరేంద్రమోదీ మాత్రమే అని అన్నారు. . గతంలో ఎన్నడూ లేని విధంగా దేశవ్యాప్తంగా కులగణన చేపట్టనుండటం అందుకు నిదర్శనం అని కొనియాడారు. బీసీ మహిళలకు ప్రత్యేక సబ్‌కోటా కల్పించేందుకు తాను ప్రధాని మోదీతో చర్చించి.... తగిన ప్రయత్నాలు చేస్తానని హామీ ఇచ్చారు. బీసీ సమాజాన్ని అన్ని రంగాల్లో ఎదిగేలా చేయడం తమ ప్రధాన లక్ష్యమని కృష్ణయ్య చెప్పారు.



# జల వివాదాల పరిష్కారానికి తొలి అడుగు..

## కమిటీ ఏర్పాటు, శ్రీశైలం మరమ్మతులకు ఏపీ గ్రీన్‌సిగ్నల్

**టీపీఎన్, ఢిల్లీ:**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య నెలకొన్న జలవివాదాల శాశ్వత పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఢిల్లీలో జలశక్తి కార్యాలయంలో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ ఆధ్వర్యంలో జరిగిన రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల, నీటి పారుదల శాఖ మంత్రుల, ఉన్నతాధికారుల సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి సమగ్రంగా వివరాలు వెల్లడించారు. ఈ సమావేశంలో గోదావరి, కృష్ణా నదులపై నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు, ప్రతిపాదిత ప్రాజెక్టులు, ప్రస్తుతం సాగుతున్న ప్రాజెక్టులపై చర్చించామని తెలిపారు. ఈ అంశాల పరిశీలనకు రెండు రాష్ట్రాల ఇంజినీర్లు, జలశక్తి అధికారులు, సాంకేతిక నిపుణులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. నదుల జలాల వినియోగంపై స్పష్టత కోసం టెలిమెట్రీ యంత్రాల ఏర్పాటు అంశాన్ని తెలంగాణ ప్రతిపాదించగా, ఆంధ్రప్రదేశ్ దీనికి అంగీకరించిందని తెలిపారు.శ్రీశైలం ప్రాజెక్టు భద్రతపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (NDSA) సూచనల మేరకు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరంపై చర్చించామన్నారు. ఆ మరమ్మతులకు ఏపీ అంగీకరించిందని సీఎం తెలిపారు. ఇది తెలంగాణకు గణనీయమైన విజయమని అన్నారు. అలాగే, గోదావరి నది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని తెలంగాణలో, కృష్ణా నది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించామని చెప్పారు. పునర్విభజన చట్టం ప్రకారం అపెక్స్ కమిటీ సూచనలతోనే ఈ తీర్మానం తీసుకున్నామని వివరించారు.కేసీఆర్ పాలనలో జరిగిన అన్యాయాలను సరిచేయడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పటికీ ఒకటే ఒక్క సమస్యను కూడా పరిష్కరించలేదని విమర్శించారు. రాష్ట్రాల మధ్య విభేదాలు పెరగాలని కోరుకునే వ్యక్తులను చూసి జాలిపడటం తప్ప, మరొకటి చేయలేమని అన్నారు. తాము బీఆర్ఎస్‌కు కాదు, తెలంగాణ ప్రజలకు జవాబుదారీగా పనిచేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తోపాటు తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీలు మల్లు రవి, అభిషేక్ మను సింఘ్వీ, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కుందూరు రఘువీర్‌రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, కడియం కావ్య, సురేష్ షెట్కర్, గడ్డం వంశీకృష్ణ, పోరిక బలరాం నాయిక్ పాల్గొన్నారు.




# ప్రజల్లోకి ప్రభుత్వ వైఫల్యాలు తీసుకెళ్లాలి: బీజేపీ చీఫ్ రాంచందర్‌రావు

**టీపీఎన్, గుర్రం శ్రీకాంత్:**

తెలంగాణలో బూత్ స్థాయిలో గెలుపే విజయానికి నాంది కావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు అన్నారు. ఘట్కేసర్ డివిజన్‌లో నిర్వహించిన మండల అధ్యక్షుల కార్యశాల ముగింపు సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రతి కార్యకర్త "గెలుపు బూత్‌లోనే జన్మిస్తుంది" అన్న ధోరణితో పని చేయాలన్నారు. కార్యకర్తలే పార్టీ ప్రాణమని వారిని గుర్తించి గౌరవించి, ప్రోత్సహించాల్సిన బాధ్యత నాయకులదని చెప్పారు. ప్రజల్లోకి చేరాలంటే స్థానిక సమస్యలను గుర్తించడమే కాకుండా, ప్రభుత్వ వైఫల్యాలను బహిర్గతం చేయాలని సూచించారు. ఒక్కో బూత్‌ను గెలిపిస్తే ఒక్కో నియోజకవర్గం మనదవుతుందన్న ధీమాతో పనిచేయాలని పిలుపునిచ్చారు. "ఒక్కో నియోజకవర్గం మనదైతే, తెలంగాణను కూడా మనదిగా మార్చవచ్చు," అని ఆయన వెల్లడించారు.దేశవ్యాప్తంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాలనలో పేదల అభివృద్ధి లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. జనధన్ యోజన కింద 80 కోట్ల మందికి బ్యాంక్ ఖాతాలు అందించామని, ఆ ఖాతాల ద్వారానే ప్రతి పథకం నేరుగా లబ్ధిదారులకు చేరుతున్నదని వివరించారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా దళారుల అవినీతి పూర్తిగా తొలగిపోయిందన్నారు. యూపీఏ పాలనలో భారీ కుంభకోణాలు జరిగాయని, ప్రజాసంక్షేమం కుంటుపడిందని విమర్శించారు. ప్రస్తుతం మోదీ పాలనలో అటల్ పెన్షన్ యోజన, సురక్ష బీమా యోజన, జీవన్ జ్యోతి బీమా యోజనల ద్వారా పేదలకు బీమా భద్రత కలుగుతోందన్నారు. ఈ పథకాల ద్వారా తెలంగాణలోనే 48 లక్షల మందికి లబ్ధి కలిగిందని తెలిపారు. కోటి 50 లక్షల మందికి పైగా కుటుంబ సభ్యులకు ఈ పథకాల ప్రయోజనం లభించిందని చెప్పారు. ప్రధానమంత్రి ముద్ర యోజన కింద లక్షలాది మంది యువత స్వయం ఉపాధికి ఉపకరిస్తున్నారని చెప్పారు. తక్కువ వడ్డీతో రుణాలు అందించి చిన్న, మధ్య తరహా వ్యాపారాలకు ప్రోత్సాహం కల్పించామని వివరించారు. ఈ పథకాల వల్ల యువత ఆర్థికంగా స్వావలంబులవుతున్నారని రాంచందర్‌రావు స్పష్టం చేశారు.



# పెద్దపల్లిలో ఘనంగా ఇందిరా మహిళా శక్తి ఉత్సవాలు

**టీపీఎన్, పెద్దపల్లి:**

నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు "ఇందిరా మహిళా శక్తి" ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క పాల్గొని మహిళా సంఘాల అభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. వివిధ మహిళా సంఘాలకు మంత్రులు చెక్కులను పంపిణీ చేశారు. మహిళా సంఘాలచే నడిపించబోయే ఆర్టీసీ కొత్త అద్దె బస్సులను ప్రారంభించారు. మొదటి నెల బస్సుల అద్దెకు రూ.3.47 లక్షల చెక్కును అందించారు. అలాగే రూ.4.94 కోట్ల వడ్డీ రాయితీ చెక్కు కూడా మంత్రుల చేతుల మీదుగా మహిళా సంఘాలకు అందింది. ప్రమాద బీమా, లోన్ బీమా కింద సుమారు కోటి రూపాయల చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. "కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారు," అని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన అనతి కాలంలోనే ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేశామన్నారు. ఇప్పుడు ఆ ఉచిత ప్రయాణమే మహిళలను బస్సుల యజమానులుగా చేసే దిశగా మలిచినట్లు చెప్పారు. ఐకేపీ కేంద్రాల నిర్వహణతో వేలాది మంది మహిళలు కోట్లు సంపాదిస్తున్నారని, పెద్దపల్లిలోని ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్ల నుంచే ప్రభుత్వ ఆసుపత్రులకు భోజనం సరఫరా జరుగుతోందని తెలిపారు. మహిళలు ఆదానీ, అంబానీలతో పోటీగా సోలార్ ప్లాంట్లు నెలకొల్పేందుకు సిద్ధమవుతున్నట్లు చెప్పారు. రైస్ మిల్లులు, గోదాములు మహిళలకు అప్పగించాలన్న దిశగా ముఖ్యమంత్రి ఆలోచిస్తున్నట్లు వెల్లడించారు.



# చేవెళ్లలో బీఆర్ఎస్ ఆత్మీయ సమావేశం

**టీపీఎన్, చేవెళ్ల:**

రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలోని జన్వాడ గ్రామంలో బుధవారం బీఆర్ఎస్ పార్టీ మండల, మునిసిపల్ స్థాయి కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. మండల పార్టీ అధ్యక్షుడు గండి చెర్ల గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కార్యకర్తలే పునాది అని అన్నారు. ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటానని చెప్పారు. వారి వ్యక్తిగత సమస్యలతో పాటు స్థానిక సమస్యల పరిష్కారానికి కూడా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. "మీ సమస్యే నా సమస్య. మీరు చెబితే నేను స్పందించకుండా ఉండే ప్రసక్తే లేదు" అని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ పాలన పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని ఆరోపించారు. మళ్లీ కేసీఆర్ నేతృత్వంలోని పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అభిప్రాయపడ్డారు. ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని సూచించారు. త్వరలోనే మండలంలోని అన్ని పార్టీ కార్యాలయాల ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలని చెప్పారు. నాయకత్వం అభివృద్ధి చెందాలంటే ప్రతిపక్షంలో ఉన్నప్పుడే అవకాశాలు వస్తాయని అన్నారు. "పాలకులు మంచి వారు అయితే ప్రకృతి కూడా అనుకూలిస్తుంది. వైఎస్సార్, కేసీఆర్ హయాంలో వర్షాలు కురిసి చెరువులు మత్తడులు దుంకి తెలంగాణ సస్యశ్యామలం అయింది. ప్రస్తుతం వర్షాలు తగ్గిన కారణం పాలన వైఫల్యమే" అని విమర్శించారు. స్థానిక ఎన్నికల విషయంలో ఓటమి భయంతో ప్రభుత్వం వెనుకంజ వేస్తుందని, కోర్టు ఆదేశాలతో మాత్రమే ప్రస్తుతం సిద్ధమవుతోందని విమర్శించారు. శంకర్‌పల్లి మండలంలో గులాబీ జెండా ఎగురవేయాలని, సోషల్ మీడియా వేదికగా బీఆర్ఎస్ ప్రతిష్టతను పెంచేందుకు కార్యకర్తలు చురుకుగా ఉండాలని పిలుపునిచ్చారు. మండల సమన్వయ కమిటీని ఏర్పాటు చేసి, గ్రామాలపై గ్రామాలుగా పర్యటించి పార్టీ విజయానికి మార్గం వేయాలని సూచించారు. సమావేశంలో పలువురు సీనియర్ నాయకులు, బూత్ కమిటీ సభ్యులు, పార్టీ యువజన విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యకర్తలు తమ ప్రాంతాల్లో ఎదురవుతున్న ప్రజా సమస్యలు, వాటి పరిష్కారంలో ఉన్న ఇబ్బందులను ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి వివరించారు.

# ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కి గ్రీన్ సిగ్నల్: దసరాకి అందుబాటులోకి....!

- ఉప్పల్ ప్రజల నిరీక్షణకు ఎట్టకేలకు ముగింపు
- ఉప్పల్ నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పై మంత్రి ప్రకటన
- దసరా నాటికి అందుబాటులోకి తేవాలని కోమటిరెడ్డి ఆదేశాలు
- కారిడార్ పనులు పూర్తి అయితే ట్రాఫిక్ సమస్యలకు చెక్

**టీపీఎన్, కృష్ణ కుమార్, స్పెషల్ డెస్క్:**



హైదరాబాద్ నగరానికి తూర్పు ద్వారంగా నిలిచే ఉప్పల్ ప్రాంతానికి గుడ్‌న్యూస్. ఏడేళ్లుగా ఎదురుచూస్తున్న ప్రజల నిరీక్షణకు ఎట్టకేలకు తెరపడింది. ఉప్పల్‌నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పనులు త్వరలో పూర్తి చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి తో కలిసి కారిడార్ పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ ఏడాది దసరా నాటికి కారిడార్‌ను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కొన్ని అనివార్య కారణాల వల్ల పనులు ఆలస్యం అయినప్పటికీ, ఇప్పుడు వేగంగా నిర్మాణం పూర్తిచేస్తామని తెలిపారు. ఈ విషయంలో ఎవరినీ నిందించాల్సిన అవసరం లేదని వెల్లడించారు. ఉప్పల్ నుంచి నారపల్లి వరకు నిర్మించనున్న ఈ ఆరులైన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వంలోని జాతీయ రహదారి ప్రాధికార సంస్థ (NHAI) ఆధ్వర్యం లో ముందుకెళ్తోంది. రూ. 626.76 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 330 కోట్ల నుంచి రూ. 768 కోట్ల వరకు ఖర్చు చేయనుంది.

2017లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు మొదట గాయత్రీ సంస్థకు అప్పగించగా, నిర్మాణ జాప్యం, భూసేకరణ, విద్యుత్, నీటి లైన్ల మార్పిడి వంటి సమస్యల కారణంగా ఆ సంస్థను మార్చి మరో కంపెనీకి బాధ్యతలు అప్పగించారు. దీంతో పనులు మళ్లీ ప్రారంభమయ్యాయి. అయితే ఈ జాప్యం వాహనదారులపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. ముఖ్యంగా ఉప్పల్ చౌరస్తాలో నిత్యం ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతూ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీని ప్రధాన ఉద్దేశ్యం ఉప్పల్ చౌరస్తాలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడం, ఘట్‌కేసర్, యాదాద్రి, వరంగల్ జిల్లాల వైపు వెళ్లే వాహనదారులకు సులభమైన, వేగవంతమైన ప్రయాణాన్ని అందించడం. ఈ కారిడార్ పూర్తయితే ఉప్పల్, నారపల్లి, ఘట్‌కేసర్, యాదాద్రి, వరంగల్ వైపు వెళ్లే వాహనదారులకు ప్రయోజనం చేకూరుతుంది. జాతీయ రహదారి 163పై రాకపోకలు సులభతరంగా మారి, నగర ట్రాఫిక్ భారాన్ని తగ్గించనుంది



# ఆరురోజుల సీఐడీ కస్టడీకి HCA నిందితులు




హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (HCA) ఫోర్జరీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మల్కాజిగిరి కోర్టు బుధవారం హెచ్సీఏ అధ్యక్షుడు ఏ.జగన్‌మోహన్‌రావు, జెఎస్ శ్రీనివాసరావు, సీఈఓ సునీల్ కాంతే, శ్రీచక్ర క్రికెట్ క్లబ్ ప్రధాన కార్యదర్శి రాజేంద్ర యాదవ్, అధ్యక్షురాలు జి.కవితలకు ఆరు రోజులపాటు సీఐడి కస్టడీకి అనుమతి మంజూరు చేసింది. ఈ కేసులో నిందితులను సీఐడి ఇప్పటికే అరెస్ట్ చేసి, కోర్టులో హాజరు పరిచింది. విచారణ అనంతరం మల్కాజిగిరి కోర్టు వారిని 14 రోజులు రిమాండ్ విధించింది. చర్లపల్లి జైలులో వీరిని సీఐడీ అధికారులు కస్టడీలోకి తీసుకొని ఆరు రోజులపాటు విచారణ చేపట్టనున్నారు. తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ధర్మం గురువారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సీఐడి కేసు నమోదు చేసింది. గతంలో గౌలిపుర క్రికెట్ క్లబ్ (జిసిసి)గా ఉండే శ్రీచక్ర క్రికెట్ క్లబ్‌కు సంబంధించిన పత్రాల్లో జిసిసి మాజీ అధ్యక్షుడు సి.కృష్ణ యాదవ్ సంతకాల్ని నకిలీ చేయడంతో పాటు, వాటిని అసలైనవిగా చూపించారని ఆరోపణలు ఉన్నాయి. ఈ నకిలీ పత్రాలను హక్కుల దుర్వినియోగం, ఎన్నికల అర్హత పొందేందుకు ఉపయోగించినట్టు అధికారులు తెలిపారు. వాటి ఆధారంగానే జగన్‌మోహన్‌రావు హెచ్సీఏ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారని సీఐడి అదనపు డీజీపీ చారు సిన్హా వెల్లడించారు. అరెస్ట్ చేసిన తరువాత పూర్తి స్థాయిలో విచారణ జరపలేక పోయామని, కేసులో మరిన్ని ఆధారాలు సేకరించాల్సి ఉందని సీఐడి అధికారులు నిందితులను కస్టడీ కోరుతూ కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారించిన కోర్టు ఆరు రోజుల పాటు సీఐడి కస్టడీకి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.




## హరితహైదరాబాద్‌కు ప్రతి ఒక్కరి సహకారం అవసరం: మేయర్ గద్వాల విజయలక్ష్మి

**టీపీఎన్, హైదరాబాద్:**

గ్రేటర్ హైదరాబాద్‌ను క్లీన్, గ్రీన్ సిటిగా తీర్చిదిద్దేందుకు నగరపాలక సంస్థ ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని మేయర్ గద్వాల విజయలక్ష్మి తెలిపారు. ఈ లక్ష్య సాధనకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఆమె కోరారు. బుధవారం కూకట్‌పల్లి జోన్ పరిధిలోని షిరిడి హిల్స్ కాలనీలో మేయర్ గద్వాల విజయలక్ష్మి, కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ వన మహోత్సవాన్ని ప్రారంభించారు. మొక్కలు నాటడంతో పాటు వాటి నీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన బోరు మోటార్‌ను మేయర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గద్వాల విజయలక్ష్మి మాట్లాడుతూ.. "ఈ సంవత్సరం వన మహోత్సవంలో భాగంగా 25 లక్షల మొక్కల నాటే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా భాగస్వామ్యంతో ఈ సీజన్ అంతటా మొక్కలు నాటే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం. ప్రతి ఇంటికీ మొక్కలు పంపిణీ చేసి అందరినీ ఈ ఉద్యమంలో భాగస్వాములుగా చేసుకుంటాం," అని అన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ కూడా అత్యంత కీలకమని ఆమె స్పష్టం చేశారు. "ఏక్ ఫేడ్... మాకే నామ్" నినాదంతో ప్రతి ఒక్క పౌరుడు తమ తల్లి పేరుతో ఒక్కో మొక్క నాటాలని సూచించారు. అలాగే మొక్కల సంరక్షణలో భాగస్వాములవ్వాలన్నారు. ఇది మన పిల్లల భవిష్యత్తుకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడంలో కీలకమవుతుందని చెప్పారు. కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ మాట్లాడుతూ.. ఆకుపచ్చ హైదరాబాద్ లక్ష్యంగా వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వార్డులవారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని, ప్రభుత్వం నిర్దేశించిన టార్గెట్‌ను నెరవేర్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. మొక్కల సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు "గో గ్రీన్" అంటూ నినాదాలు చేశారు.

## మహాత్మ జ్యోతి పూలే కళాశాల ప్రిన్సిపాల్ షీలా సస్పెండ్

**టీపీఎన్, శామీర్‌పేట్:**



తుర్కపల్లిలోని మహాత్మ జ్యోతిబా పూలే డిగ్రీ కళాశాలలో ఏర్పడిన వసతుల కొరతపై విద్యార్థులు ఇటీవల ఆందోళనకు చేశారు. సోమవారం విద్యార్థులు ధర్నా చేపట్టగా, మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి కళాశాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. విద్యార్థులకు కనీస వసతులు కల్పించడంలో ప్రిన్సిపాల్ షీలా నిర్లక్ష్యంగా వ్యవహరించారని అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బుధవారం ఆమెను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అధికారుల పరిశీలనలో తాగునీరు, టాయిలెట్లు, ఫర్నిచర్ వంటి మౌలిక వసతుల లోపాలు స్పష్టంగా బయటపడ్డాయని తెలిపారు. విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో ప్రభుత్వం తక్షణ చర్యగా ఈ నిర్ణయం తీసుకుంది.

## మాగంటి ఆశలను నెరవేరుస్తాం: కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేక్‌గౌడ్

**టీపీఎన్, జూబ్లీహిల్స్:**

దివంగత మాగంటి గోపినాథ్ సంతాప సభకు సంబంధించి బోరబండ డివిజన్ నాయకులతో మంగళవారం యూసఫ్‌గూడా క్యాంపు కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. జులై 27న సైట్ 4,5 కాలనీలోని పీజెఆర్ గ్రౌండ్స్‌లో సంతాప సభ నిర్వహించనున్నట్లు సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేక్‌గౌడ్ మాట్లాడుతూ.. "మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన గోపన్న గారు నాకు అత్యంత సన్నిహితుడు. ఆయన పట్ల నా వ్యక్తిగత నిబద్ధత ఉంది. ఆయన ఆశయాలను నెరవేర్చే దిశగా ముందుకెళ్తాం. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేస్తాం," అని అన్నారు. గోపినాథ్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి తెచ్చిన మెజారిటీ గుర్తుండేలా బీఆర్ఎస్‌ను మరింత చురుగ్గా పనిచేసేలా మారుస్తామని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాగంటి గోపినాథ్ సతీమణి మాగంటి సునీతతో పాటు యూసఫ్‌గూడా కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్, బోరబండ డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## సికింద్రాబాద్ డీసీగా బాధ్యతలు చేపట్టిన ఆంజనేయులు: డిప్యూటీ మేయర్‌ను కలిసి అభివృద్ధిపై చర్చ

**టీపీఎన్, హైదరాబాద్:**

సికింద్రాబాద్ సర్కిల్ జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్‌గా ఆంజనేయులు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి, టిటియుసి రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిశారు. డిప్యూటీ మేయర్ ఆంజనేయులుకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ స్థానిక అభివృద్ధి కార్యక్రమాలపై ఆయనతో డిప్యూటీ మేయర్ చర్చించారు. ముఖ్యంగా సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల పురోగతి, పలు కాలనీల్లో డ్రైనేజీ, రోడ్లు, కాంతి వెలుగు సమస్యల పరిష్కారంపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. సమన్వయంతో పనిచేస్తే ప్రజలకు మెరుగైన సేవలు అందవచ్చని డిప్యూటీ మేయర్ వెల్లడించారు.



## తాండూరులో గంజాయి చాక్లెట్లు పట్టివేత.. యూపీకి చెందిన వ్యక్తి అరెస్ట్

**టీపీఎన్, తాండూరు:**



వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలోని గొల్ల చెరువు ప్రాంతంలో గంజాయి చాక్లెట్లు కలకలం సృష్టించాయి. పోలీసులు ఓ అనుమానితుడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా.. అతని వద్ద నుంచి 45 గంజాయి చాక్లెట్లు లభించాయి. నిందితుడిని ఉత్తరప్రదేశ్‌కు చెందిన దినేష్ నాయక్‌గా పోలీసులు గుర్తించారు. ఈ చాక్లెట్లను యూపీ నుంచి తాండూరుకు తీసుకొచ్చినట్లు విచారణలో వెల్లడైంది. పట్టణంలో గంజాయి చాక్లెట్లు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో అతడిని అరెస్ట్ చేశారు. తాండూరులో మాదకద్రవ్యాల రవాణాపై పోలీసులు కఠినంగా నిఘా పెట్టినప్పటికీ వరుసగా ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. నిందితుడిపై NDPS చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తాండూర్ డీఎస్పీ బాలకృష్ణారెడ్డి తెలిపారు.



## కవ్వంపల్లి నేతృత్వంలో బలపడుతున్న కాంగ్రెస్.. బీఆర్ఎస్‌ను వీడుతున్న స్థానిక నేతలు

**టీపీఎన్, గుర్రం శ్రీకాంత్:**

మానకొండూర్ నియోజకవర్గ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. బీఆర్ఎస్‌కు వరుసగా షాక్‌లు తగులుతున్నాయి. తాజాగా ఇల్లంతకుంట మండలానికి చెందిన పలువురు మాజీ సర్పంచులు, కీలక నాయకులు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మానకొండూర్‌లోని ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్‌లో జరిగిన సమావేశంలో మానకొండూర్ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఈ చేరికలకు నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా నూతనంగా పార్టీలో చేరిన నాయకులకు ఆయన స్వయంగా కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కవ్వంపల్లి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు ప్రజల్లో విశ్వాసాన్ని కల్గిస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో ప్రజాకేంద్రిత పాలన కొనసాగుతోందని తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు, గౌరవం లభిస్తుందని స్పష్టం చేశారు. అంతేకాక పార్టీ అంతర్గత విషయాలను బహిరంగ వేదికలపై కాకుండా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కార్యకర్తలకు సూచించారు. ఈ చేరికలతో మానకొండూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ బలంగా పెరుగుతోందన్నారు. బీఆర్ఎస్ ప్రజల్లో నమ్మకాన్ని కోల్పోతూ, నాయకత్వ లోపం, వర్గపోరు వంటి కారణాలతో అంతర్గతంగా క్షీణిస్తోందని కవ్వంపల్లి ఆరోపించారు.




## నెహ్రూ జూలాజికల్ పార్క్‌లో అవగాహన కార్యక్రమాలు

**టీపీఎన్, హైదరాబాద్:**

ప్రపంచ పాముల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నెహ్రూ జూలాజికల్ పార్క్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రెప్టైల్ హౌస్ యాంఫీథియేటర్ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో దాదాపు 700 మంది పాఠశాల విద్యార్థులు, 600 మంది సందర్శకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ జూలాజికల్ పార్క్ విద్యా అధికారి ఎం. దీపక్ తరుణ్ పాముల జీవన విధానంపై శిక్షణ ఇచ్చారు. ప్రత్యక్షంగా పాములను చూపిస్తూ వాటి నివాస ప్రాంతాలు, విషపూరిత, విషరహిత రకాల మధ్య తేడాలు, పాము కాటు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాములను గుర్తించే పద్ధతులపై విపులంగా వివరించారు. పార్క్‌లో కింగ్ కోబ్రా, స్పెక్టాకిల్డ్ కోబ్రా, బాంబూ పిట్ వైపర్, రస్సెల్స్ వైపర్, క్రైట్, ఇండియన్ రాక్ పైథాన్, ఎలుక పాము, ఇసుక బోవా వంటి దాదాపు 20 రకాల పాములతో పాటు గ్రీన్ ఇగ్వానా, చామెలియన్, బెంగాల్ మానిటర్ బల్లి, తాబేళ్లు వంటి ఇతర సరీసృపాలు కూడా ఉన్నాయి. ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో డైరెక్టర్, క్యూరేటర్, పీఆర్వో, ZEOల పాత్రను ఉపాధ్యాయులు, సందర్శకులు ప్రశంసించారు. ఈ సందర్భంగా తెలంగాణ జూ పార్క్స్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ ఎస్. హిరేమత్ మాట్లాడుతూ.. "దేశంలోనే మొట్టమొదటిగా గాజు అవరోధంతో సరీసృపాల గృహాన్ని ప్రవేశపెట్టిన జూ నెహ్రూ జూలాజికల్ పార్క్. ఇది సందర్శకులకు అత్యుత్తమ వీక్షణ అనుభవాన్ని అందిస్తోంది. ప్రతి పర్యావరణ దినోత్సవం నాడు నిర్వహించే అవగాహన ప్రదర్శనలు జూ సిబ్బంది అంకితభావానికి నిదర్శనం" అని వెల్లడించారు.



## హైదరాబాద్‌లో 24 గంటల డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు ప్రారంభం

టీపీఎన్, హైదరాబాద్: నగరంలో ట్రాఫిక్ పటిష్ఠంగా ఉండేందుకు పోలీసులు నూతన చర్యలు చేపట్టారు. నగర కమిషనర్ సి.వి. ఆనంద్ ఆదేశాల మేరకు పోలీసు శాఖ "డే అండ్ నైట్ డ్రైవ్" ను ప్రారంభించింది. ఈ డ్రైవ్ క్రికెట్ మ్యాచ్ కాదు. నగరంలో ఇకపై రాత్రి పూటే కాదు, పగలు కూడా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించనున్నారు. ట్రాఫిక్ పోలీసులతో పాటు లా అండ్ ఆర్డర్ పోలీసులు కూడా ఈ తనిఖీల్లో భాగంగా వ్యవహరిస్తారు. ప్రత్యేకమైన బ్రీత్ అనలైజర్ మిషన్లను ఉపయోగించి నగరంలోని సిగ్నల్స్, పార్కింగ్ ప్రాంతాలు, చెక్ పోస్టుల వద్ద టెస్టులు నిర్వహించనున్నారు. నిబంధనలు ఉల్లంఘించినవారి వాహనాలు అక్కడికక్కడే సీజ్ చేస్తారు. అనంతరం డ్రైవర్ మద్యం సేవించిన మోతాదును రికార్డు చేసే రసీదు అందించి, కోర్టులో హాజరు కావాల్సిన అవసరం ఉంటుందని పోలీసులు వెల్లడించారు. ఇటీవల నగరంలో పగలు జరిగే ప్రమాదాలలో కూడా మద్యం సేవించడం ప్రధాన కారణంగా బయట పడింది. ఈ నేపథ్యంలోనే పోలీసు శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. కార్యక్రమాన్ని ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ ట్యాంక్ బండ్ మింట్ కాంపౌండ్ వద్ద ప్రారంభించారు. పోలీసులు తనిఖీలు ప్రారంభించగానే పలువురు వాహనదారులు బైక్‌లు, కార్లను వదిలేసి పరుగులు పెట్టడం గమనార్హం. ఇకపై రోజూ 24 గంటల పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తామని, ఇది ఏడాది పొడవునా కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేశారు.

# ముఖ్యమంత్రి జటప్రోలు పర్యటన..

## ఏర్పాట్లపై సమీక్షించిన కలెక్టర్ బాదావత్ సంతోష్

**టీపీఎన్, నవీన్:**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జూలై 18న నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలో జటప్రోలులో పర్యటించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో కలెక్టర్ బాదావత్ సంతోష్ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. జటప్రోలు రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో జిల్లా స్థాయి అధికారులు, విభిన్న శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశంలో కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పర్యటనను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు ప్రణాళికాబద్ధంగా జరగాలని సూచించారు. శాఖల వారీగా బాధ్యతలు కేటాయించామని, ప్రతి విభాగానికి ప్రత్యేక అధికారి నియమించినట్లు తెలిపారు. పర్యటనలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా భద్రత, వసతి, రవాణా, ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలపై పూర్తి ఫోకస్ పెట్టాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని, పోలీస్ బందోబస్తు, హెలిప్యాడ్, వేదిక చుట్టూ అవసరమైన కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని చెప్పారు. రోడ్ల మరమ్మతులు తక్షణమే పూర్తి చేయాలని, స్వాగతానికి రెడ్ కార్పెట్ వేయాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా సభ ప్రాంగణం పుష్పాలంకరణ, సుందరీకరణతో ఆకర్షణీయంగా ఉండేలా చూడాలని తెలిపారు. ప్రజల కోసం తాగునీటి సౌకర్యం, మొబైల్ టాయిలెట్లు, సీటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడేలా వైద్య



శిబిరాలు, అంబులెన్సులు సిద్ధంగా ఉంచాలని, సురక్షిత రద్దీకి సంబంధించి పాస్‌లను సమయానికి అందించాలన్నారు. సభకు ఎక్కువగా మహిళలు, వివిధ గ్రామాల ప్రజలు హాజరవుతారని దృష్టిలో ఉంచుకొని వసతులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ప్రారంభించబోయే అభివృద్ధి పనులను కలెక్టర్ స్వయంగా అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం, కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. టీపీఎన్, నవీన్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జూలై 18న నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలో జటప్రోలులో పర్యటించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో కలెక్టర్ బాదావత్ సంతోష్ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. జటప్రోలు రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో జిల్లా స్థాయి అధికారులు, విభిన్న శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశంలో కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పర్యటనను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు ప్రణాళికాబద్ధంగా జరగాలని సూచించారు. శాఖల వారీగా బాధ్యతలు కేటాయించామని, ప్రతి విభాగానికి ప్రత్యేక అధికారి నియమించినట్లు తెలిపారు.

పర్యటనలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా భద్రత, వసతి, రవాణా, ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలపై పూర్తి ఫోకస్ పెట్టాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని, పోలీస్ బందోబస్తు, హెలిప్యాడ్, వేదిక చుట్టూ అవసరమైన కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని చెప్పారు. రోడ్ల మరమ్మతులు తక్షణమే పూర్తి చేయాలని, స్వాగతానికి రెడ్ కార్పెట్ వేయాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా సభ ప్రాంగణం పుష్పాలంకరణ, సుందరీకరణతో ఆకర్షణీయంగా ఉండేలా చూడాలని తెలిపారు. ప్రజల కోసం తాగునీటి సౌకర్యం, మొబైల్ టాయిలెట్లు, సీటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడేలా వైద్య శిబిరాలు, అంబులెన్సులు సిద్ధంగా ఉంచాలని, సురక్షిత రద్దీకి సంబంధించి పాస్‌లను సమయానికి అందించాలన్నారు. సభకు ఎక్కువగా మహిళలు, వివిధ గ్రామాల ప్రజలు హాజరవుతారని దృష్టిలో ఉంచుకొని వసతులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ప్రారంభించబోయే అభివృద్ధి పనులను కలెక్టర్ స్వయంగా అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం, కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## భద్రాచలంలో భక్తుల సౌకర్యార్థం మరుగుదొడ్లు ప్రారంభం

**టీపీఎన్, భద్రాచలం:**

పవిత్ర క్షేత్రమైన భద్రాచలంలో భక్తుల సౌకర్యార్థంగా నిర్మించిన టాయిలెట్లు బుధవారం ప్రారంభమయ్యాయి. భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్‌ల చేతుల మీదుగా ఈ టాయిలెట్లు ప్రారంభం అయ్యాయి. రెవెన్యూ గెస్ట్ హౌస్ ఎదురుగా, కూనవరం రోడ్డులోని డిగ్రీ కాలేజ్ ఎదురుగా రూ.65 లక్షల వ్యయంతో సి.ఎస్.ఆర్ నిధుల ద్వారా టాయిలెట్లు నిర్మించారని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు తెలిపారు. ప్రతి సంవత్సరం ముక్కోటి ఏకాదశి, శ్రీ సీతారామ కళ్యాణం, తెప్పోత్సవం, పట్టాభిషేకం వంటి ఉత్సవాలకు దేశం నలుమూలల నుంచి భక్తులు తరలివస్తారని అన్నారు. వచ్చిన భక్తులు గోదావరిలో స్నానం చేసిన అనంతరం స్వామివారి దర్శనానికి వెళ్తారని తెలిపారు. ఈ క్రమంలో మహిళలు, పెద్దలకు మరింత సౌకర్యంగా ఉండేందుకు ప్రధాన కూడళ్ళలో, గోదావరి దారి, బస్టాండ్ ఎదురుగా మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. టాయిలెట్ల నిర్వహణపై కూడా ఎమ్మెల్యే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతిరోజూ శుభ్రత తప్పక పాటించాలని, 24 గంటలపాటు సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదని ఆయన స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు, గ్రామ పంచాయతీ ఈవో శ్రీనివాస్, ఐటీసీ సంస్థకు చెందిన శ్యామ్ కిరణ్, చంగల్ రావు, కనకమెడల హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## అబార్షన్ కిట్స్ అక్రమ అమ్మకాలపై డ్రగ్ కంట్రోల్ శాఖ స్పెషల్ డ్రైవ్

అబార్షన్ కిట్స్ (అబార్టిఫేషియంట్ డ్రగ్స్) అక్రమ విక్రయాలను అడ్డుకునే లక్ష్యంతో తెలంగాణ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ప్రత్యేక చర్యలకు పూనుకుంది. ఈ సందర్భంగా బుధవారం రాష్ట్రవ్యాప్తంగా విస్తృత తనిఖీలు చేపట్టింది. మహిళల గర్భసంపర్కాన్ని కట్టడి చేసే ఉద్దేశంతో మాత్రమే ఉపయోగించాల్సిన మిఫెప్రిస్టోన్, మిసోప్రోస్టోల్ వంటి ఔషధాలను అనధికారికంగా విక్రయించే వారిపై దృష్టి సారించారు. అనుమతి లేకుండా అమ్మకాలు జరుపుతున్న మెడికల్ షాపులను లక్ష్యంగా చేసుకుని తనిఖీలు నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో మొత్తం 149 మెడికల్ షాపుల్లో నిబంధనలకు విరుద్ధంగా అబార్షన్ డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించి.... షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు డీసీఏ అధికారులు తెలిపారు. ప్రజారోగ్యానికి ప్రమాదకరంగా మారే ఈ తరహా అక్రమ విక్రయాలను అరికట్టేందుకు మరింత కఠినంగా వ్యవహరిస్తామని డ్రగ్ కంట్రోల్ అధికారులు హెచ్చరించారు. వైద్య నిపుణుల పర్యవేక్షణలోనే ఈ ఔషధాలను వినియోగించాలని సూచించారు. లేకపోతే శారీరక, మానసిక ఆరోగ్యపరమైన హానికర పరిణామాలు ఏర్పడతాయని తెలిపారు.


## ధూల్‌పేటలో ముమ్మర ఎస్‌టిఎఫ్ దాడులు.. కల్లు డిపోలపై ఎక్సైజ్ అధికారుల ఉక్కుపాదం





**టీపీఎన్, హైదరాబాద్:**

తెలంగాణ వ్యాప్తంగా కల్లు డిపోలపై ప్రత్యేక దాడులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం ధూల్‌పేటలో మూడు ఎస్‌టిఎఫ్ బృందాలు ముమ్మర దాడులు నిర్వహించాయి. నాటుసారా, గంజాయి విక్రయాలకు ఆడంబరంగా నిలయంగా మారిన ధూల్‌పేటలో గంజాయి, నాటు సారంపై విజయవంతంగా నియంత్రణ సాధించిన అధికారులు, తాజాగా కల్తీ కల్లు, అనుమతిలేని డిపోలు, అక్రమ రవాణాలపై దృష్టి కేంద్రీకరించారు. ఇటీవల కూకట్‌పల్లిలో కల్తీ కల్లు విషయంలో వెలుగు చూసిన ఘటన రాష్ట్రాన్ని కుదిపేసిన నేపథ్యంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి.హరి కిరణ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం కల్లు కంపౌండ్లపై రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఆదేశాల మేరకు మూడు రోజులుగా కల్లు డిపోలపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. ధూల్‌పేటలో ఎస్‌టిఎఫ్ 'ఏ' టీమ్ లీడర్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో మల్లాకుంట ప్రాంతంలో బైక్‌లో అక్రమంగా తరలిస్తున్న 70 లీటర్ల కల్తీ కల్లును స్వాధీనం చేసుకున్నారు. శాంపిల్ తీసుకొని మిగిలిన కల్లును నేలపాలు చేశారు. ఈ ఘటనలో మల్లప్ప అనే వ్యక్తిని అరెస్ట్ చేయగా, మరో వ్యక్తి బసవరాజ్‌పై కూడా కేసు నమోదైంది. మంగళ్‌హట్ ప్రాంతంలో దాడి సందర్భంగా 247 లీటర్ల కల్లు అనుమతి లేకుండా నిల్వచేసి ఉంచినట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం శాంపిళ్లు తీసుకొని మిగతా కల్లును ధ్వంసం చేశారు. ఈ కేసులో అనిల్‌గౌడ్‌ను అరెస్ట్ చేయగా, రామచంద్రయ్యపై కేసు నమోదైంది. గుడిమల్కాపూర్ హీరానగర్ ప్రాంతంలో మరో డిపోపై దాడిలో అనుమతి లేకుండా నిల్వ ఉంచిన 382 లీటర్ల కల్లును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో గోదా రాఘవేందర్ గౌడ్‌ను అరెస్ట్ చేయగా, రామకృష్ణ గౌడ్‌పై కేసు నమోదు చేశారు. ఈ మూడు కేసులను ధూల్‌పేట ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు. మరోవైపు ఎస్‌టిఎఫ్ 'సి' టీమ్ సీఐ వెంకటేశ్వర్లు బృందం, 'డి' టీమ్ సీఐ నాగరాజు బృందం షేర్‌లింగంపల్లి పరిధిలో కల్లు డిపోలపై దాడులు నిర్వహించాయి. బిన్ రంగారెడ్డినగర్, తర్కముల్ ప్రాంతాల్లో కల్లు డిపోలలో శాంపిళ్లు సేకరించారు. అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు.




| S.No | Details | Designation | Contact Details |
|---|---|---|---|
| 1 | Smt. Sai Geeta –Presiding Officer officer of project Director, Women Development &child Welfare | Presiding Officer | 701-309-6186 |
| 2 | Smt. Jyotsna Facilities at PVP Square Mall. | Member | 897-809-9922 |
| 3 | Smt. Radhika Safekeeping at PVP Square Mall. | Member | 789-359-9100 |
| 4 | Mr. Ajay Babu Chigurupati Manager Operations at PVP Square Mall. | Member | 900-095-9306 |
| 5 | R. Suez, Director Maarpu Trust | Member | 970-105-6808 |
| 6 | Ms. Anupama Darla, High Court Advocate | Member | 988-528-1081 |



# పోష్ చట్టానికి పదేళ్లు..

## ఇంకా గాల్లో దీపంలానే మహిళల భద్రత..!



2013లో ప్రవేశపెట్టిన లైంగిక వేధింపుల నివారణ చట్టం (పోష్ చట్టం) లక్ష్యం, మహిళల కోసం సురక్షితమైన పని వాతావరణాన్ని కల్పించడం. అయితే, ఒక దశాబ్దం గడిచినా ఈ లక్ష్యం ఇంకా నెరవేరలేదు. చట్టం ఉన్నా, దాని అమలులో ఉన్న లోపాలు, యజమానుల ఉదాసీనత, మరియు అవగాహనలో ఉన్న లోపం కారణంగా మహిళల భద్రత అనేది ఇంకా సాధ్యమైన దూరంగా ఉంది. ఇది కేవలం లైంగిక వేధింపుల సమస్య మాత్రమే కాదు — ఇది సమానత్వాన్ని, మహిళల ఆర్థిక భాగస్వామ్యాన్ని, మరియు దేశవ్యాప్త అభివృద్ధిని అడ్డుకుంటున్న నిర్మాణాత్మక లోపాల సంకేతం.

**గణాంకాలు చెబుతున్న వాస్తవాలు..**

వరల్డ్ ఎకనామిక్ ఫోరం 2025 గెండర్ గ్యాప్ నివేదిక ప్రకారం, భారతదేశం 148 దేశాల్లో 131వ స్థానంలో ఉంది. ముఖ్యంగా ఆర్థిక భాగస్వామ్యం మరియు ఆరోగ్య రంగాల్లో భారతదేశం తక్కువ స్కోర్లు సాధించింది. ఇదే సమయంలో, 2024 మెక్‌కిన్సీలీన్ ఇన్ "విమెన్ ఇన్ ది వర్క్‌ప్లేస్" నివేదిక ప్రకారం, సుమారు 50% భారతీయ మహిళలు తమ యజమానులు లైంగిక వేధింపుల ఫిర్యాదులను సమర్థవంతంగా పరిష్కరించలేరనే అభిప్రాయంతో ఉన్నారు — ఈ సంఖ్య 2018 నుండి మారలేదు. ఈ విశ్వాస లోపం మహిళలను ఫిర్యాదులు చేయడంలో వెనక్కి నెట్టుతుంది, అదే సమయంలో పనిస్థలాల్లో నిశ్శబ్ద సంస్కృతిని ప్రోత్సహిస్తుంది.

**చట్టం ఏమంటోంది..? కానీ ఏం జరుగుతోంది..?**

పోష్ చట్టం ప్రకారం, ప్రతి సంస్థ ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ (ICC)ను ఏర్పాటు చేయాలి. అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి, అవసరమైతే క్రిమినల్ ఫిర్యాదులు కూడా సహాయపడాలి. యజమానులు చట్ట సమాచారాన్ని స్పష్టంగా ప్రదర్శించాలి. అయితే, వాస్తవంగా, చాలా సంస్థలు ఈ నిబంధనలను కేవలం ఓ అధికారికతగా మాత్రమే చూస్తున్నాయి. కొన్ని చోట్ల ICCలు సరిగా ఏర్పాటు చేయబడటం లేదు, అవగాహన సెషన్లు నిర్వహించకపోవడం లేదా అర్థవంతంగా డాక్యుమెంటేషన్ చేయకపోవడం వంటివి జరుగుతున్నాయి. కొన్ని సంస్థలు అవసరమైన వార్షిక నివేదికలు సైతం దాఖలు చేయడంలేదు. డేటా లీక్ భయం, మరియు చట్ట పట్ల అర్థం లోపం మరింత అమలులో దౌర్బల్యాన్ని కలిగిస్తోంది.

**న్యాయ వ్యవస్థ జోక్యం..!**

2024 నవంబర్‌లో, ఒడిశా హైకోర్టు ఒక కీలక తీర్పు ఇచ్చింది. సామాజిక కార్యకర్త బియాట్ ప్రజ్ఞా త్రిపాఠి దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంలో, పోష్ చట్టంలోని సెక్షన్ 19 అమలులో విఫలమవుతున్న కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలపై హైకోర్టు విమర్శలు చేసింది. వేధింపులపై స్పష్టమైన బోర్డులు ఏర్పాటు చేయాలని, ICCలు కేవలం నామమాత్రపు వ్యవస్థ కాకుండా చట్టపరమైన బాధ్యతగా ఉండాలన్న అంశాన్ని కోర్టు పునరుద్ఘాటించింది.

**ఆర్థికాభివృద్ధి కోణం..!**


పని ప్రదేశాల్లో భద్రత లేమి మహిళలను కేవలం మనోవేదనలో పడేయడం కాదు — వారు ఉద్యోగాన్ని వదిలేయడం లేదా దూరంగా ఉండేలా చేస్తుంది. ఇది మహిళల శ్రమ శక్తి పాల్గొనడాన్ని తగ్గిస్తుంది. భారతదేశంలో ఇప్పటికే మహిళల లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేటు తగ్గిపోతున్న సమయంలో, ఈ పరిస్థితి దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అంటే మహిళల భద్రత కేవలం నైతికంగా అవసరమైతే సరిపోదు — ఇది ఆర్థికంగా కూడా కీలకం.

**ముందుకెళ్లే మార్గం..!**

భారతదేశం ఇప్పుడు ఉపరితల స్థాయి చట్టాలను అధిగమించాల్సిన అవసరం ఉంది. అంతర్జాతీయ శ్రామిక సంస్థ (ILO) కన్వెన్షన్ C190ను ఆమోదించడం ద్వారా పని ప్రదేశ హింసపై గ్లోబల్ ప్రమాణాలతో చట్టాలను సమన్వయం చేయవచ్చు. గిగ్ వర్కర్లు, అనధికార శ్రమికులు కూడా రక్షణ పరిధిలోకి రావాలి. అమలు వ్యవస్థను పటిష్టంగా మార్చాలి — ఇందులో స్వతంత్ర పర్యవేక్షణ, బాధ్యతా నిర్ణయం, మరియు బాధితుల కేంద్రంగా విధాన రూపకల్పన అవసరం. కేవలం శిక్షలకే పరిమితమయ్యే దృష్టికోణం కాకుండా, నివారణ, పునరావాసం మరియు సాంస్కృతిక మార్పుపై దృష్టిపెట్టాలి.

**విధానాల నుంచి సంస్కృతుల దిశగా..**

చట్టం రావడం సరిపోదు — నిజమైన మార్పు అంటే మనసు మార్చుకోవడం, వ్యవస్థను మార్చడం. పని ప్రదేశ భద్రతను ఒక బాధ్యతగా కాదు, ఒక విలువగా భావించాలి. నిబంధనలు కేవలం పత్రాలపై కాకుండా, ప్రవర్తనలపై ప్రతిబింబించాలి. ప్రతి మహిళ పని ప్రదేశంలో సురక్షితంగా, గౌరవంతో, స్వేచ్ఛతో ఉండగలగినప్పుడే భారతదేశం ఒక సమానతా సమాజంగా పరిగణించబడుతుంది.



**అనుపమ దార్ల,**
**న్యాయవాది, సంఘ సంస్కర్త, గుంటూరు.**





## గ్రేట్ ఇండియన్ ఐటీ క్రాష్.. ఉద్యోగ సాధనలో వెనకబడుతున్న

# యువ ఇంజనీర్లు..!

బెంగళూరు, హైదరాబాద్, మరియు పుణె వంటి నగరాల్లో, అనేకమంది యువ ఇంజనీర్లు పీజీ హాస్టళ్లలో నివసిస్తూ, రోజూ జాబ్ పోర్టల్‌స్‌ను ఆత్రుతగా రిఫ్రెష్ చేస్తున్నారు. విజయవంతమైన ఐటీ కెరీర్ కలలు క్రమంగా కనుమరుగవుతున్నాయి, ఏం తప్పు జరిగిందోనని వారు ఆశ్చర్యపోతున్నారు. రెండు దశాబ్దాల క్రితం లక్షలాది మంది ఆకాంక్షలను రేకెత్తించిన భారతదేశంలోని ఎంట్రీలెవల్ ఐటీ ఉద్యోగ మార్కెట్, ఇప్పుడు అసాధారణమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. 2000ల ప్రారంభంలో, ఇన్ఫోసిస్, టీసీఎస్, లేదా విప్రో వంటి సంస్థల్లో ఉద్యోగం పొందడం ఒక బంగారు టికెట్‌గా పరిగణించబడేది. ప్రాథమిక కోడింగ్ నైపుణ్యాలతో సాయుధమైన ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, బగ్ ఫిక్సింగ్, లేదా టెక్ సపోర్ట్ వంటి లెవల్ 1 రోల్స్ కోసం పెద్ద సంఖ్యలో నియమించబడేవారు. ఈ క్యాంపస్ హైరింగ్ కన్వేయర్ బెల్ట్ ఆర్థిక స్థిరత్వాన్ని మాత్రమే కాకుండా సామాజిక ఆమోదాన్ని కూడా అందించేది. భారతదేశ ఐటీ పరిశ్రమ కేవలం వృద్ధి చెందడమే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా గౌరవించబడే భారతీయ ప్రతిభతో గ్లోబల్ పవర్‌హౌస్‌గా మారింది.

2025కి వచ్చేసరికి, ఈ దృశ్యం గుర్తించలేనంతగా మారిపోయింది. ఎంట్రీలెవల్ ఐటీ ఉద్యోగాలు వేగంగా అదృశ్యమవుతున్నాయి, మరియు దీనికి కారణం ఇకపై ప్రతిభ లేకపోవడం కాదు— ఇది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా రాకపోకలు సాగించే సాంకేతిక విఘటన. చాట్‌జిపిటి మరియు గిట్‌హబ్ కోపైలట్ వంటి ఏఐ సాధనాలు, ఒకప్పుడు జూనియర్ ఇంజనీర్లకు అప్పగించబడిన అనేక పనులను ఆటోమేట్ చేస్తున్నాయి. బాయిలర్‌ప్లేట్ కోడ్ రాయడం, సాధారణ లోపాలను డీబగ్ చేయడం, మరియు రొటీన్ సాఫ్ట్‌వేర్ నిర్వహణ వంటివి ఇప్పుడు ఎక్కువగా ఇంటెలిజెంట్ సాఫ్ట్‌వేర్‌ల ద్వారా నిర్వహించబడుతున్నాయి, ఫ్రెషర్లకు తక్కువ రోల్స్ మిగిల్చాయి. విప్రో వంటి కంపెనీలు ఫ్రెషర్ హైరింగ్‌ను గణనీయంగా తగ్గించాయి—FY23లో 38,000 నుండి FY25లో కేవలం 10,000కి. టిసిఎస్ మరియు ఇన్ఫోసిస్ కూడా కొత్త గ్రాడ్యుయేట్ల ఆన్‌బోర్డింగ్‌ను తగ్గించాయి లేదా ఆలస్యం చేశాయి. గ్లోబల్ సంస్థలు కూడా ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి, యుఎస్ మరియు యుకెలో కంప్యూటర్ సైన్స్ గ్రాడ్యుయేట్ల నిరుద్యోగం పెరుగుతోంది. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ యొక్క 2025 నివేదిక, 2030 నాటికి ఏఐఆధారిత ఆటోమేషన్ ప్రపంచవ్యాప్తంగా 75 మిలియన్ ఉద్యోగాలను తొలగించవచ్చని, అయితే 170 మిలియన్ కొత్త ఉద్యోగాలను సృష్టించవచ్చని హెచ్చరిస్తుంది—కానీ ఈ కొత్త రోల్స్ సాంప్రదాయ కోడింగ్‌కు మించిన నైపుణ్యాలను డిమాండ్ చేస్తాయి.

భారత ఇంజనీరింగ్ కళాశాలలు ఈ మార్పును అందిపుచ్చుకోవడంలో వెనుకబడి ఉన్నాయి. 12%కంటే తక్కువ కళాశాలలు ఏఐ లేదా మెషిన్ లెర్నింగ్ కోర్సులను అందిస్తాయి, మరియు ఫ్యాకల్టీలో చాలా తక్కువ మందికి మాత్రమే జనరేటివ్ ఏఐ సాధనాలతో హ్యాండ్స్‌ఆన్ అనుభవం ఉంది. దీని వలన గ్రాడ్యుయేట్లు తరచుగా కొత్త టెక్ ల్యాండ్‌స్కేప్‌కు సిద్ధంగా లేరు, ఇది పరిశ్రమ డిమాండ్లు మరియు అకడమిక్ శిక్షణ మధ్య అంతరాన్ని విస్తరిస్తుంది. కుటుంబాలు విద్యలో భారీగా పెట్టుబడి పెడతాయి, కానీ చాలా మంది విద్యార్థులు నిరుద్యోగులుగా లేదా సంబంధం లేని ఉద్యోగాలకు మారవలసి వస్తుంది.

అయితే, కథ పూర్తిగా నిరాశాజనకం కాదు. ఏఐ కూడా ఏఐ ట్రైనర్స్, ప్రాంప్ట్ ఇంజనీర్స్, చాట్‌బాట్ టెస్టర్స్, మరియు మోడల్ ఆడిటర్స్ వంటి ఉద్భవిస్తున్న రోల్‌స్‌లో కొత్త అవకాశాలను సృష్టిస్తోంది. ఈ స్థానాలకు ఎలైట్ డిగ్రీల కంటే ఆసక్తి, అనుకూలత, మరియు నేర్చుకోవడానికి సుముఖత అవసరం. ఏఐని ఒక బెదిరింపుగా కాకుండా సహకారిగా స్వీకరించే వారికి భవిష్యత్తు చెందుతుంది. ఈ మార్పును నావిగేట్ చేయడానికి, భారతదేశ విద్యా వ్యవస్థ తన కరిక్యులమ్‌ను పునర్విమర్శించాలి, ఏఐ మరియు మెషిన్ లెర్నింగ్‌ను ప్రధాన సబ్జెక్టులుగా చేర్చాలి. విశ్వవిద్యాలయాలు ఇంటర్న్‌షిప్‌లు మరియు హ్యాండ్స్‌ఆన్ ప్రాజెక్ట్‌లను ప్రోత్సహించాలి, రోట్ పరీక్షలను వాస్తవప్రపంచ సమస్యల పరిష్కారంతో భర్తీ చేయాలి. జాతీయ నైపుణ్య కార్యక్రమాలు విస్తరించాలి, మరియు స్టార్టప్‌లు క్యాంపస్‌లతో భాగస్వామ్యం చేసి ఆవిష్కరణలను పెంపొందించాలి. చివరగా, "ఎంట్రీలెవల్" ఉద్యోగాల భావనను ఈ కొత్త ఏఐఆధారిత రోల్‌స్‌ను చేర్చేలా పునర్నిర్వచించాలి. యువ ఇంజనీర్లకు సందేశం స్పష్టం: ఐటీ విజయానికి పాత మెట్లు బహుశా విరిగిపోయి ఉండవచ్చు, కానీ కొత్త మార్గాలు తెరుచుకుంటున్నాయి. ఏఐని స్వీకరించడం, నిరంతరం నేర్చుకోవడం, మరియు త్వరగా అనుకూలించడం గ్రేట్ ఇండియన్ ఐటీ రీసెట్‌లో వృద్ధి చెందడానికి కీలకం. భవిష్యత్తు అనిశ్చితం, కానీ మూసివేయబడలేదు—మీరు పరిణామం చెందడానికి సిద్ధంగా ఉంటే, మీ కెరీర్ మళ్లీ గాడిన పడుతుంది.



# ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విప్లవాత్మక మార్పులు అవసరం..!



భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు భాగం IIIలో పొందుపరిచిన ఆర్టికల్ 15.. మతం, జాతి, కులం, లింగం లేదా జన్మస్థలం ఆధారంగా వివక్షను ఖచ్చితంగా నిషేధిస్తుంది. ఈ విధానం, ప్రతి పౌరుడికి సమాన అవకాశాలను కల్పించాలన్న దిశగా రాష్ట్రాన్ని నడిపిస్తుంది. కానీ వాస్తవంలో, ఈ రాజ్యాంగపు లక్ష్యాలకు విరుద్ధంగా, ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో సంస్థాగత వివక్ష ఇప్పటికీ కొనసాగుతుంది. భారతదేశవ్యాప్తంగా సుమారు 50,000 ప్రభుత్వ మరియు సంబంధిత విద్యాసంస్థల హాస్టళ్లు పనిచేస్తున్నాయి. ఇవి ప్రధానంగా షెడ్యూల్డ్ కులాలు (SC), షెడ్యూల్డ్ తెగలు (ST), ఇతర వెనుకబడిన తరగతులు (OBC), మరియు మైనారిటీలకు చెందిన విద్యార్థులకు నిబంధనల ప్రకారం వసతి కల్పిస్తున్నాయి. ఈ హాస్టళ్ల లక్ష్యం సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు విద్యలో సమాన అవకాశాలు కల్పించడం. అయితే, ఈ లక్ష్యం సాధన మార్గంలో కనిపిస్తున్న అనేక వైఫల్యాలు ఆందోళన కలిగిస్తున్నాయి.

ఈ హాస్టళ్లు తరచుగా కులం ఆధారంగా వేర్వేరుగా నిర్వహించబడతాయి—ఉదాహరణకు SC హాస్టల్, ST హాస్టల్, BC హాస్టల్ వంటి పేర్లతో. ఫలితంగా, విద్యార్థులు చిన్ననాటి నుంచే ఒక విభజిత వాతావరణంలో పెరుగుతున్నారు. వారు ఎక్కువగా తమ కులం లేదా వర్గానికి చెందిన వారితో మాత్రమే మమేకమై జీవిస్తున్నారు. ఇది ఇతర సముదాయాల వ్యక్తులతో పరస్పర అవగాహన ఏర్పడకుండా చేస్తూ, వారిలో సామాజిక దూరాన్ని బలపరుస్తుంది. ఇలాంటి సంస్థాగతంగా వ్యవస్థీకృతమైన విభజన, రాజ్యాంగ నైతిక విలువలైన సమానత్వం, ఐక్యతకు వ్యతిరేకంగా ఉంటుంది. ఈ విధంగా పెరిగే విద్యార్థులలో భవిష్యత్తులో సహజంగా సంఘ బేధాలు ప్రబలే ప్రమాదం ఉంది, తద్వారా సమాజంలో సామరస్యం దెబ్బతింటుంది. దీంతో పోలిస్తే, ప్రైవేట్ లేదా కార్పొరేట్ రంగంలోని విద్యాసంస్థల హాస్టళ్లు సామాజిక సమ్మిళనాన్ని పెంపొందించేలా రూపొందించబడ్డాయి. వివిధ వర్గాల విద్యార్థులు ఒకచోట నివసించి, ఒకే వాతావరణంలో పెరిగే అవకాశాన్ని పొందుతారు. అటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వ సంస్థలు విభజనను పెంపొందించే పాత నమూనాలను కొనసాగించడం అనర్థం.


**అభ్యున్నతికి మార్గదర్శక సూచనలు:**

1. హాస్టళ్లకు 'సంక్షేమ హాస్టళ్లు' అనే పేరు పెట్టాలి: కులం లేదా వర్గం ఆధారిత హాస్టల్ పేరు తొలగించటం ద్వారా భావితరాల కోసం సమ్మిళనాన్ని సూచించే వాతావరణాన్ని నిర్మించవచ్చు.
2. ఏకీకృత ప్రవేశ విధానం: అన్ని వర్గాల విద్యార్థులు కలిసే జీవించేలా హాస్టల్ వ్యవస్థను పునరుద్ధరించాలి, దీని ద్వారా చిన్న వయస్సు నుండే పరస్పర గౌరవం మరియు సమాజంలో ఐక్యత పెంపొందుతుంది.
3. విభజన లేకుండా రిజర్వేషన్ కొనసాగించాలి: రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు ప్రవేశాల విషయంలో అమలవుతుండగా, వసతి ఏర్పాట్ల విషయంలో కుల ఆధారిత వేర్పాటు ఉండకూడదు.
4. సమాన బడ్జెట్ కేటాయింపులు: హాస్టళ్లు సమ్మిళితంగా ఉన్నప్పటికీ, వర్గాలపై కేంద్రిత మద్దతు కొనసాగించేందుకు వేరుగా బడ్జెట్ కేటాయింపులు ఉండాలి. ఇది సానుకూల చర్యలను బలపరచడంలో సహాయపడుతుంది.

ఈ మార్గదర్శకాలు, యువతలో సామాజిక సమరస్యం, సమానత్వం, మరియు ఐక్యత వంటి విలువలను పెంపొందించడంలో కీలకంగా ఉంటాయి. 2020లో కృష్ణా జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ ఈ అంశంపై గౌరవ గవర్నర్‌కు నివేదిక సమర్పించినా, దానికి గణనీయమైన స్పందన రాలేదు.

అయితే జూన్ 26, 2025న, తమిళనాడు ముఖ్యమంత్రి ఒక కీలక ప్రకటన చేశారు: రాష్ట్రంలోని అన్ని సంక్షేమ హాస్టళ్లను "సామాజిక న్యాయ హాస్టళ్లు"గా పేరు మార్చారు. ఇది ఒక దార్శనిక నిర్ణయంగా మారి, భవిష్యత్ మార్పులకు బీజం వేశింది.

ఇప్పుడు కేంద్రం మరియు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఈ మార్గాన్ని అనుసరించాల్సిన సమయం ఆసన్నమైంది. విధానస్థాయిలో మార్పులు కేవలం చట్టబద్ధంగానే కాకుండా, ప్రజల అనుభవాల్లోనూ రాజ్యాంగ విలువలు ప్రతిఫలించేలా ఉండాలి. సమ్మిళిత సంక్షేమ హాస్టళ్లు భారతదేశం యొక్క "సమాన హక్కులతో కూడిన సమైక్య భవిష్యత్తు" వైపు తీసుకెళ్లే ఒక ప్రాముఖ్యమైన పథంగా నిలుస్తాయి.



**బీవీఎస్ కుమార్,**
**చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మాజీ చైర్మన్, కృష్ణాజిల్లా.**



# కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

**టీపీఎన్, న్యూఢిల్లీ :**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో, దేశ వ్యవసాయం ,ఇంధన రంగానికి కొత్త దిశానిర్దేశం చేసే మూడు ప్రధాన నిర్ణయాలు ఆమోదించబడ్డాయి. ఒక వైపు వ్యవసాయ జిల్లాల సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక ఆమోదించబడింది, మరోవైపు, పునరుత్పాదక ఇంధనంలో పెద్ద ఎత్తున పెట్టుబడులకు మార్గం సుగమం చేయబడింది. కేంద్ర కేబినెట్ పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. 'పీఎం ధన్ ధాన్య కృషి యోజన' పథకానికి ఆమోదం తెలిపినట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. వ్యవసాయం, అనుబంధ రంగాలు అభివృద్ధి లక్ష్యంగా దేశవ్యాప్తంగా 100 జిల్లాల్లో ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. 2025 26 నుంచి ఆరేళ్ల కాలానికి ఈ పథకం 100 జిల్లాలను కవర్ చేసేలా ప్రణాళిక రూపొందించారు. వ్యవసాయ రంగంలో ఉత్పాదకతను పెంచడం, పంటల్లో వైవిధ్యీకరణ, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం, పంట కోత తర్వాత గ్రామస్థాయిల్లో దిగుబడులను నిల్వ చేయడానికి గోదాముల సదుపాయం, నీటి పారుదల సౌకర్యాలను మెరుగుపరచడం, రుణ లభ్యతను సులభతరం చేయడం వంటి లక్ష్యాలతో పీఎం ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని రూపొందించారు. 11 శాఖల్లోని 36 పథకాలు, రాష్ట్రంలోని ఇతర పథకాలు, ప్రైవేటు రంగంతో స్థానిక భాగస్వామ్యం ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తారు. పునరుత్పాదక ఇంధన రంగంలో ఎన్టీపీసీకి రూ. 20 వేల కోట్ల పెట్టుబడులకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అంతరిక్ష కేంద్రంలో 18 రోజులు గడిపి విజయవంతంగా భూమికి తిరిగి వచ్చిన శుభాంశు శుక్లాను అభినందిస్తూ తీర్మానం చేశారు.



# శశి థరూర్ ముఖ్యమంత్రి అవుతారా?

**టీపీఎన్, కేరళ :**

కేరళలో వచ్చే ఏడాది మే నెలలో ఎన్నికలు జరగనున్నాయి. పినరయి విజయన్ నేతృత్వంలోని పాలక ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం వరుసగా మూడోసారి అధికారంలోకి రాకుండా నిరోధించడానికి కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ తన శాయశక్తులా ప్రయత్నిస్తుంది. రాబోయే కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి పదవికి కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్) అభ్యర్థిగా ఉన్నారా? కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఒక సర్వే డేటాను బహిర్గతం చేయడం ద్వారా ఈ విషయాన్ని గుర్తించారు. ఈ సర్వే ఆయనను యుడిఎఫ్ నుంచి ముఖ్యమంత్రి పదవికి ముందు వరుసలో ఉంచింది.

**సర్వేలో శశి థరూర్ అగ్రస్థానంలో ఉన్నారు.**

స్వతంత్ర సంస్థ ఓట్ వైబ్ నిర్వహించిన సర్వేలో రాష్ట్రంలో బలమైన ప్రభుత్వ వ్యతిరేకత ఉందని వెల్లడైంది. సర్వే ప్రకారం 28.3 శాతం మంది ప్రజలు యుడిఎఫ్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా థరూర్‌ను ఇష్టపడ్డారు. ఇటీవలి కాలంలో ఆయన అఖిలపక్ష బృందంలో సభ్యుడిగా ఉండటం.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ప్రశంసించడం వల్ల కాంగ్రెస్ లక్ష్యంగా మారారు. తిరువనంతపురం నుండి నాలుగుసార్లు ఎంపీగా ఎన్నికైన థరూర్‌కు వృద్ధ ఓటర్లు (55 ఏళ్లు పైబడినవారు) 34.2% మద్దతు ఇచ్చారు. సర్వే ప్రకారం, ఆయనకు 1824 ఏళ్ల వయస్సు వారి నుండి 20.3% మద్దతు లభించింది.



# మంత్రి పుట్టినరోజు వేడుకల్లో కలెక్టర్, ఎస్పీ

**టీపీఎన్, రాజ్‌గఢ్ :**

మధ్యప్రదేశ్ మంత్రి నారాయణ్ సింగ్ పవార్ పుట్టినరోజును రాజ్‌గఢ్ జిల్లాలోని బియోరాలోని తన కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ , పోలీసు సూపరింటెండెంట్ హాజరు కావడంపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ కార్యక్రమంలో మత్స్యకారుల సంక్షేమం , మత్స్య అభివృద్ధి మంత్రి బహిరంగంగా కేక్ కట్ చేసి ముందుగా కలెక్టర్‌కు కేక్ తినిపించి, ఆపై తన చేతులతో ఎస్పీకి కేక్ ఇచ్చారు. అనంతరం కలెక్టర్, ఎస్పీలు కూడా మంత్రికి కేక్ తినిపించి అభినందించారు. ఈ దృశ్యం మొత్తం కెమెరాలో రికార్డు అయ్యింది. ఇప్పుడు ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. .దీనిపై ప్రతిపక్ష నాయకులు, సామాజిక సంస్థలు తమ అసంతృప్తిని వ్యక్తం చేశాయి. పరిపాలనా అధికారులు వేదికపై ఉండటం, రాజకీయ నాయకుడి ప్రైవేట్ కార్యక్రమంలో వ్యక్తిగతంగా పాల్గొనడంపై తీవ్ర విమర్శలు చేశారు. అధికార పార్టీ నాయకుల వ్యక్తిగత కార్యక్రమాల్లో ఉన్నతాధికారులు ఈ విధంగా పాల్గొన్నప్పుడు, వారి ప్రవర్తన సాధారణ ప్రజలతో ఎంతవరకు న్యాయంగా ఉంటుందనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి.

# కేజ్రీవాల్ మోడల్‌ని పీకే అవలంభిస్తారా..?

**టీపీఎన్, పాట్నా :**



ఈసారి బీహార్ లో త్రిముఖ పోరు కనిపిస్తోంది. అధికారం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. అక్టోబర్‌నవంబర్ నాటికి అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. తొలిసారి అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగుతున్న ఎన్నికల వ్యూహకర్త, రాజకీయ నాయకుడిగా మారిన ప్రశాంత్ కిషోర్ (పికె) పార్టీ జాన్ సూరజ్ కూడా అధికార నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్డీఏ)ప్రతిపక్ష మహా కూటమి మధ్య ప్రత్యక్ష పోరును ఎదుర్కోవడానికి తన శక్తినంతా ఉపయోగిస్తోంది. తాను ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోనని..రాష్ట్రంలోని 243 స్థానాల్లోనూ అభ్యర్థులను పోటీచేస్తారని పికె ఇప్పటికే స్పష్టం చేశారు. ఇప్పుడు ఎన్నికల సమయం దగ్గర పడుతోంది. రాజకీయ రణక్షేత్రంలో పికె స్వయంగా ఎన్నికల్లో పోటీ చేస్తారా లేదా అనే దానిపై చర్చ జరుగుతోంది?

**ఎన్నికల్లో పోటీ చేయడంపై పీకే వైఖరి ఏమిటి?**

ప్రశాంత్ కిషోర్ ఎన్నికల వ్యూహకర్త నుంచి రాజకీయ నాయకుడిగా మారారు. ఎన్నికల్లో పోటీ చేయడం ఆయన పాత్ర. జన్ సూరజ్ పార్టీతో బీహార్ ఎన్నికల యుద్ధభూమిలోకి ప్రవేశించిన తర్వాత ఇప్పుడు ఆయనపై ఎన్నికల్లో పోటీ చేసే బాధ్యత ఉంది. ముందుండి నడిపించే సవాలు కూడా ఉంది. జన్ సూరజ్ పార్టీకి సూత్రధారిగా, ఆయన ఎన్నికల ప్రచారానికి కేంద్రబిందువుగా కూడా ఉంటారు.

ఇలాంటి పరిస్థితుల్లో పీకే స్వయంగా ఎన్నికల యుద్ధభూమిలోకి ప్రవేశిస్తారా? లేదా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎన్నికల్లో పోటీ చేయడంపై పీకే వైఖరి గురించి మాట్లాడుతూ పార్టీ నిర్ణయిస్తే తాను రఘోపూర్ స్థానం నుంచి పోటీ చేస్తానని మార్చి నెలలో ఆయన అన్నారు. రఘోపూర్ బీహార్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు తేజస్వి యాదవ్ నియోజకవర్గం. మహాఘట్బంధన్ కు నాయకత్వం వహిస్తున్న రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ), జాన్ సూరజ్ ను బీజేపీ బి టీమ్ గా పిలుస్తున్నారనే తమ కథనాన్ని బలోపేతం చేయడానికి, రాఘోపూర్ నుంచి పోటీ చేయాలనే పీకే మాటలను ఉపయోగించడం ప్రారంభించింది. తేజశ్విని పక్కన పెడితే మోడీపై కూడా పోటీ చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని పీకే తరువాత అన్నారు. ప్రశాంత్ కిషోర్ చేసిన ఈ ప్రకటనల వెనుక ఒక ప్రత్యేక వ్యూహం కూడా ఉందని నమ్ముతారు.

**పీకే తొలిసారి కేజ్రీవాల్ మోడల్‌ను అవలంబిస్తారా?**

రఘోపూర్ అసెంబ్లీ స్థానాన్ని లాలూ యాదవ్ కుటుంబానికి చెందిన స్థానంగా పరిగణిస్తారు. తేజస్వి యాదవ్ 2015 నుండి బీహార్ అసెంబ్లీలో ఈ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తేజస్వికి ముందు లాలూ ప్రసాద్ యాదవ్ , రబ్రీ దేవి కూడా రఘోపూర్ స్థానం నుండి ఎమ్మెల్యేలుగా గెలిచారు.. ప్రశాంత్ కిషోర్ లాలూ కుటుంబం యొక్క బలమైన కోటలోకి ప్రవేశించడం గురించి మాట్లాడారు, కాబట్టి దీనిని కేజ్రీవాల్ ఎన్నికల అరంగేట్రం మోడల్ గా కూడా చూస్తున్నారు పలువురు రాజకీయ నిపుణులు.

ఆమ్ ఆద్మీ పార్టీతో కలిసి ఢిల్లీలో ఎన్నికల బరిలోకి దిగిన అరవింద్ కేజ్రీవాల్ అప్పటి ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ సీటు అయిన న్యూఢిల్లీని ఎంచుకున్నారు. షీలా దీక్షిత్ అధికార పార్టీకి అతిపెద్ద ప్రతినిధి. 2014 సార్వత్రిక ఎన్నికల్లో కూడా కేజ్రీవాల్ అదే ఫార్ములాను ఉపయోగించారు. వారణాసి స్థానం నుంచి ఎన్డీఏ ప్రధాన మంత్రి అభ్యర్థి నరేంద్ర మోడీపై పోటీ చేశారు. ఒకవేళ ప్రశాంత్ కిషోర్ రాఘోపూర్ స్థానం నుండి తేజస్వి యాదవ్ పై పోటీ చేస్తే, దీని వెనుక ఉన్న కారణం ఒక పెద్ద వ్యక్తిపై పోటీ చేయడం అనే ఫార్ములా అయి ఉండవచ్చు. నిజానికి, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ శాసన మండలి సభ్యుడు. నితీష్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయరు. అటువంటి పరిస్థితిలో ప్రశాంత్ కిషోర్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు , మహా కూటమి నుండి ముఖ్యమంత్రి పదవికి అతిపెద్ద పోటీదారుడు అయిన తేజస్వి యాదవ్ స్థానాన్ని ఎంచుకున్నారు.

**బక్సర్ స్థానం నుండి పోటీ చేయడంపై ఊహాగానాలు**

ప్రశాంత్ కిషోర్ కు అవకాశం ఉన్న సీట్ల జాబితాలో, బక్సర్ సీటు గురించి కూడా ఊహాగానాలు వస్తున్నాయి. బక్సర్ నుండి 12వ తరగతి వరకు చదువుకున్నాడు. అతనికి ఇక్కడ సొంత ఇల్లు కూడా ఉంది. బక్సర్ సీటు యొక్క కుల సమీకరణం కూడా రోహ్తాస్ జిల్లాలోని కోనార్ గ్రామంలో జన్మించిన ప్రశాంత్ కిషోర్ కు అనుకూలంగా ఉంటుందని చెబుతున్నారు. రాఘోపూర్ లాగే బక్సర్ అసెంబ్లీ స్థానాన్ని కూడా 2020 బీహార్ ఎన్నికల్లో గ్రాండ్ అలయన్స్ గెలుచుకుంది. జనరల్ కేటగిరీ నుండి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి చెందిన మున్నా తివారీ అప్పట్లో ఈ స్థానం నుండి విజయం సాధించారు.

**బీహార్ ఎన్నికలకు జాన్ సూరజ్ వ్యూహం ఏమిటి?**

బీహార్ ఎన్నికలకు ప్రశాంత్ కిషోర్ వ్యూహం ఏమిటంటే, ఎన్డీఏ , మహాఘట్బంధన్ లకు ప్రత్యామ్నాయంగా జాన్ సూరజ్ ను ప్రజల్లోకి తీసుకెళ్లడం. జాన్ సూరజ్ విద్య, ఆరోగ్యం, వలసలు ఉపాధి వంటి అంశాలను లేవనెత్తుతోంది. వాటి పరిష్కారం కోసం తన దార్శనికతను కూడా ప్రదర్శిస్తోంది. క్లీన్ ఇమేజ్ ఉన్న కొత్త ముఖాలను జాన్ సూరజ్ తో అనుసంధానించడం ఎన్నికల్లో వారిని నిలబెట్టడంపై ఫోకస్ చేస్తున్నారు. బీహార్ ఎన్నికల్లో, ఎప్పుడూ ఎన్నికల్లో పోటీ చేయని అలాంటి ముఖాలకు జాన్ సూరజ్ 90 శాతం టిక్కెట్లు ఇస్తానని ప్రశాంత్ కిషోర్ స్వయంగా ప్రకటించారు. త్వరలో జరగబోయే ఎన్నికలు చాలా రసవత్తరంగా మారనున్నాయి.

# మేము ఆ పార్టీతో పొత్తు పెట్టుకోం..!

**టీపీఎన్, బీహార్ :**



అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఆల్ ఇండియా మజ్లిస్‌ఎఇత్తెహాదుల్ ముస్లిమీన్ (AIMIM), ప్రతిపక్ష మహా కూటమిలో చేరాలనే కోరికను వ్యక్తం చేస్తూ రాష్ట్రీయ జనతాదళ్ (RJD)కి లేఖ రాసింది. దీనిపై బీహార్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ అఖిలేష్ ప్రసాద్ సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. AIMIM లాంటి మతతత్వ పార్టీతో పొత్తు ఎలా ఉంటుందని అఖిలేష్ ప్రసాద్ సింగ్ అన్నారు. AIMIM ఎల్లప్పుడూ BJPకి సహాయం చేస్తోందన్నారు. బిజెపి తప్ప ప్రతి పార్టీకీ SIR గురించి భయాలు ఉన్నాయని అఖిలేష్ ప్రసాద్ సింగ్ పేర్కొన్నారు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షమైన తెలుగుదేశం పార్టీ (టీడీపీ) వ్యక్తం చేసిన ఆందోళనను ఆయన ప్రస్తావిస్తూ కొంతమంది బహిరంగంగా మాట్లాడుతున్నారని. కానీ కొంతమంది ఇప్పటికీ భయం నుండి బయటపడలేకపోతున్నారని అన్నారు. మహాఘట్బంధన్‌లో AIMIM ప్రవేశానికి అఖిలేష్ ప్రసాద్ సింగ్ 'నో' చెప్పిన తర్వాత, అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య కొత్త చర్చ ప్రారంభమైంది.

**అఖిలేష్ ప్రసాద్ కు మద్దతు ఇచ్చిన ఆర్జేడీ**

బీహార్‌లో మహాఘట్‌బంధన్‌కు నాయకత్వం వహిస్తున్న ఆర్జేడీ, అఖిలేష్ ప్రసాద్ సింగ్ ప్రకటనకు మద్దతు ఇచ్చింది. ఒవైసీ బీజేపీకి బి టీమ్‌గా మారడం ద్వారా లౌకిక ఓటును విభజించిందని ఆర్జేడీ అధికార ప్రతినిధి మృత్యుంజయ్ తివారీ అన్నారు. మతతత్వ శక్తులకు ప్రయోజనం చేకూర్చడంలో ఆయనకు ట్రాక్ రికార్డ్ ఉందన్నారు.

**ఒవైసీ బీహార్ కు ఎందుకు వస్తాడు- ఆర్జేడీ**

మేము ఎన్నికల్లో పోటీ చేయడానికి హైదరాబాద్ వెళ్లడం లేదని, మరి ఒవైసీ బీహార్‌కు ఎందుకు వస్తున్నారని ప్రశ్నించింది ఆర్జేడి. ఒవైసీ నిజంగా లౌకిక శక్తులకు సహాయం చేయాలనుకుంటే, బీహార్ ఎన్నికల్లో పోటీ చేయబోనని ప్రకటించాలని ప్రసాద్ సింగ్ అన్నారు. మహాఘట్బంధన్‌లో AIMIM ప్రవేశంపై రాజకీయాల మధ్య, ఇప్పుడు JDU కూడా దానిపై విమర్శలు గుప్పించింది.

**జెడియు ఒక విమర్శను ఎదుర్కొని ఎన్డిఎ విజయం సాధించిందని ప్రకటించింది.**

ఒవైసీకి మహాఘట్బంధన్‌లో ప్రవేశం లేకపోవడంతో ప్రతిపక్షాల సంక్షోభం మరింత తీవ్రమైందని జెడియు అధికార ప్రతినిధి రాజీవ్ రంజన్ అన్నారు. ఆర్జేడీ, ఒవైసీల మధ్య దూరం బహిరంగమైందని ఆయన అన్నారు. ఈ వ్యక్తులు ఎన్డీఏతో పోటీ పడలేరని ఆరోపించారు. నితీష్ కుమార్ నాయకత్వంలో ఎన్డీఏ విజయం ఖాయమని పేర్కొన్నారు.



# జమ్మూ కాశ్మీర్ పై ప్రధాని మోదీకి రాహుల్ లేఖ

**టీపీఎన్, న్యూఢిల్లీ :**

జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ రాహుల్ గాంధీ ప్రధాని మోదీకి లేఖ రాశారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర హోదాను పునరుద్ధరించడానికి బిల్లును తీసుకురావాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరణ డిమాండ్ చట్టబద్ధమైనదని , రాజ్యాంగ , ప్రజాస్వామ్య హక్కులపై ఆధారపడి ఉందని రాహుల్ గాంధీ ఈ లేఖలో రాశారు.

# ఢిల్లీలో పాఠశాలలకు వరుస బాంబు బెదిరింపులు

**టీపీఎన్, న్యూఢిల్లీ :**




స్థానిక పాఠశాలలు, కళాశాలలకు నిరంతరం మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వస్తున్నాయి. ఇది మూడు రోజులుగా కొనసాగుతోంది. సెయింట్ థామస్ స్కూల్, సెయింట్ స్టీఫెన్స్ కాలేజ్, రాంజాస్ కాలేజ్ ,సైంటిఫిక్ డిఫెన్స్ కాలేజ్ సహా అనేక సంస్థలకు మెయిల్ ద్వారా బెదిరింపులు వచ్చాయి. పోలీసులు, బాంబ్ స్క్వాడ్ , అగ్నిమాపక బృందం సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్నాయి. ఇప్పటివరకు ఎక్కడా అనుమానాస్పద వస్తువు కనుగొనబడలేదు. జూలై 16న ద్వారకలోని సెయింట్ థామస్ స్కూల్ , మరొక స్కూల్ కు బెదిరింపు మెయిల్ వచ్చింది. జూలై 15న, సెయింట్ థామస్ స్కూల్ తో పాటు, సెయింట్ స్టీఫెన్స్ , రాంజాస్ కాలేజ్ ఆఫ్ ఢిల్లీ యూనివర్సిటీకి కూడా ఇలాంటి బెదిరింపులు వచ్చాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అన్ని సంస్థలను ఖాళీ చేయించి, క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు,

అదేవిధంగా ఢిల్లీ విశ్వవిద్యాలయం యొక్క నార్త్ క్యాంపస్‌లో ఉన్న సైంటిస్ట్ డిఫెన్స్ కాలేజీకి ఉదయం 7:15 గంటలకు కళాశాల లైబ్రరీలో RDX ఉంచబడిందని .. బాంబుతో కళాశాలను పేల్చివేయడానికి ప్రణాళిక ఉందని ఇమెయిల్ ద్వారా బెదిరింపు వచ్చింది. కళాశాల పరిపాలన వెంటనే పోలీసులకు సమాచారం అందించింది. అగ్నిమాపక దళం, బాంబు స్క్వాడ్ , డాగ్ స్క్వాడ్ బృందం సంఘటనా స్థలానికి చేరుకుని మొత్తం కళాశాల క్యాంపస్‌లో శోధన ఆపరేషన్ నిర్వహించింది. ఈనెల 14న కూడా చాణక్యపురిలోని నేవీ స్కూల్, ద్వారకలోని సిఆర్‌పిఎఫ్ స్కూల్‌లకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ప్రతిసారీ మెయిల్ లేదా కాల్స్ ద్వారా బెదిరింపులు వస్తున్నాయి. కానీ ఇప్పటివరకు ఏ ప్రదేశం నుండి పేలుడు లేదా అనుమానాస్పద వస్తువు కనుగొనబడలేదు. బెదిరింపు మెయిల్స్ అన్నీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు .ఈ మెయిల్స్ ఎవరు, ఎందుకు పంపించారో తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. నిరంతర బెదిరింపులు భద్రతా సంస్థలను అప్రమత్తం చేశాయి.

**ఢిల్లీని అడవి రాజ్యంగా మార్చాలని బీజేపీ పట్టుదలతో ఉంది: కేజ్రీవాల్**

ఇంతలో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ పాఠశాలలకు నిరంతరం వస్తున్న బెదిరింపుల గురించి X లో పోస్ట్ చేశారు. 'వరుసగా మూడో రోజు ఢిల్లీ పాఠశాలలకు బాంబు దాడుల బెదిరింపులు వచ్చాయి. హోంమంత్రి అమిత్ షా జీ లేదా ఆయన నాలుగు ఇంజిన్ల ప్రభుత్వాలు ఢిల్లీ ప్రజలు, వారి పిల్లల గురించి పట్టించుకోవు. ఢిల్లీని అడవి రాజ్యంగా మార్చాలని బిజెపి గట్టిగా పట్టుబడుతోంది అని ఆయన అన్నారు.




# మళ్లీ పడగ విప్పుతున్న కరోనా..!

**టీపీఎన్, అమెరికా :**

కరోనా మహమ్మారి అమెరికాలో విజృంభిస్తోంది. గత కొన్ని రోజులుగా అగ్రరాజ్యంలో కరోనా బారిన పడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రస్తుతం అమెరికాలో వేసవి కాలం కావడంతో, సెలవులను ఆస్వాదించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున ప్రయాణాలు చేస్తున్నారు. తీర ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలకు తరలిపోవడం వల్ల వైరస్ వేగంగా వ్యాపిస్తోందని సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సీడీసీ) వెల్లడించింది. ముఖ్యంగా ఫ్లోరిడా, టెక్సాస్, కాలిఫోర్నియా, ఒహియో వంటి రాష్ట్రాల్లో కేసుల సంఖ్య అధికంగా ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సీడీసీ నివేదిక ప్రకారం, ఎన్బీ.1.8.1 , ఎక్స్ఎఫ్ జీ అనే కొత్త వేరియంట్లు ప్రస్తుతం అమెరికాలో వేగంగా వ్యాపిస్తున్నాయి. వేరియంట్ల ప్రభావంతో గొంతు నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, గుండె బరువుగా ఉండటం వంటి లక్షణాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రజలు కరోనా జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు అధికారులు.



# రష్యాతో చమురు కొనుగోలు చేస్తే 100%సుంకాలు

**టీపీఎన్, రష్యా :**

రష్యాతో చమురు , గ్యాస్ వ్యాపారం కొనసాగించే దేశాలపై 100% ఆంక్షలు విధిస్తామని NATO సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టే తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. వ్లాదిమిర్ పుతిన్‌కు ఫోన్ చేసి, శాంతి చర్చల గురించి ఆయన తీవ్రంగా ఆలోచించాలని చెప్పండి... లేకుంటే ఇది బ్రెజిల్, భారతదేశం, చైనాపై భారీ స్థాయిలో ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని రుట్టే అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉక్రెయిన్‌కు కొత్త ఆయుధాలను ప్రకటించిన మరుసటి రోజు, 50 రోజుల్లో శాంతి ఒప్పందం కుదరకపోతే రష్యన్ ఎగుమతుల కొనుగోలుదారులపై 100% సుంకాలను విధిస్తామని వార్నింగ్ ఇచ్చిన మరుసటి రోజు యుఎస్ కాంగ్రెస్‌లో సెనేటర్లతో సమావేశమైనప్పుడు రుట్టే ఈ వ్యాఖ్య చేశారు.



# ఇమ్రాన్ మాజీ భార్య కొత్త పార్టీ

**టీపీఎన్, పాకిస్తాన్ :**

పాకిస్తాన్ రాజకీయాలు కొత్త మలుపు తిరుగుతున్నాయి. రాజకీయ అనిశ్చితి నేపథ్యంలో పీటీఐ వ్యవస్థాపకుడు ఇమ్రాన్ మాజీ భార్య రెహమ్ ఖాన్ కొత్త పార్టీని ప్రకటించారు. పాకిస్తాన్ రిపబ్లిక్ పార్టీ పేరుతో దీన్ని ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. నేను ఇంతకు ముందు ఎప్పుడూ రాజకీయ పదవులను అంగీకరించలేదు. నేను ఒకే వ్యక్తి కోసం ఒకసారి ఒక పార్టీలో చేరాను" అని తన మాజీ భర్తను ఉద్దేశించి అన్నారు. తన పార్టీ పాకిస్తాన్ రిపబ్లిక్ పార్టీ ప్రజల గొంతుకగా ఉంటుందని, పాలక వర్గాలను జవాబుదారీగా ఉంచుతుందని అన్నారు. దేశంలో పెరుగుతున్న అసంతృప్తి నుండి తమ పార్టీ పుట్టిందని ఆమె అన్నారు.

**రెహమ్ ఖాన్ ఎవరు?**

2015లో క్రికెటర్ నుంచి రాజకీయ నాయకుడిగా మారిన ఇమ్రాన్ ఖాన్‌ను వివాహం చేసుకుంది రెహమ్ ఖాన్. అప్పటి పిటిఐ చీఫ్‌తో జరిగిన వివాహం ఆమెకు రెండో పెళ్లి. ఆమె గతంలో మానసిక వైద్యుడు అయిన ఇజాజ్ రెహ్మాన్‌ను వివాహం చేసుకుంది. ఈ జంట 1993లో వివాహం చేసుకుని.. 2005లో విడాకులు తీసుకున్నారు. వారి వివాహ సమయంలో వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. ఇమ్రాన్ ఖాన్‌తో వివాహానికి ముందు, రెహమ్ జర్నలిస్ట్‌గా పనిచేశారు . ఆమె బిబిసిలో పనిచేశారు . ఆమె చిత్ర నిర్మాణంలోకి కూడా అడుగు పెట్టారు. 2016లో ఆమె స్వాత్‌లో సెట్ చేయబడిన రొమాంటిక్ కామెడీ జనాన్‌ను నిర్మించింది.



# ఇరాన్ హైపర్సోనిక్ క్షిపణికి ఇజ్రాయెల్ భయపడిందా?

**టీపీఎన్, ఇరాన్ :**

ఇజ్రాయెల్ రక్షణ రంగంలో మరింత శక్తివంగా తయారవుతోంది,. హైపర్‌సోనిక్ క్షిపణులను కూల్చివేసే యారో 4 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను నిర్మించింది. ఇది వేగవంతమైనది, ఖచ్చితమైనది చౌకైనది కూడా. జర్మనీ దీనిని కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతోంది. ఇజ్రాయెల్ లేటెస్ట్ టెక్నాలజీ ఎప్పటికప్పుడు ప్రపంచానికి పరిచయం చేస్తుంది. ఇజ్రాయెల్ తన కొత్త హైపర్సోనిక్ క్షిపణి రక్షణ వ్యవస్థ యారో 4 అభివృద్ధి చేసింది. ఈ వ్యవస్థ ఏదైనా హైపర్సోనిక్ క్షిపణిని అడ్డగించి నాశనం చేయగలదు.యారో 4 త్వరలో పనిచేయడం ప్రారంభిస్తుందని ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ (IAI) CEO బోజ్ లెవి అన్నారు. ఇది ఇజ్రాయెల్ యొక్క వైమానిక రక్షణలో చేర్చబడుతుంది. ఈ వ్యవస్థను నేటి అతిపెద్ద ముప్పు అయిన హైపర్సోనిక్ క్షిపణులను ఎదుర్కోవడానికి రూపొందించబడింది.

**హైపర్సోనిక్ క్షిపణుల పెరుగుతున్న ముప్పు**

చైనా యొక్క DFZF రష్యా యొక్క అవంగార్డ్ వంటి హైపర్సోనిక్ క్షిపణులు మాక్ 5 కంటే వేగంగా ప్రయాణిస్తాయి (ధ్వని వేగం కంటే ఐదు రెట్లు). ఈ క్షిపణులు గాలిలో దిశను మార్చుకోగలవు. తక్కువ ఎత్తులో ఎగురుతాయి, ఇది సాంప్రదాయ క్షిపణి రక్షణ వ్యవస్థలకు కష్టతరం చేస్తుంది. సాంప్రదాయ బాలిస్టిక్ క్షిపణులు సరళ మార్గంలో ప్రయాణిస్తాయి. కానీ హైపర్సోనిక్ క్షిపణులను అంచనా వేయడం కష్టం. చైనా, రష్యా, ఇరాన్, ఉత్తర కొరియా వంటి దేశాల పెరుగుతున్న సాంకేతికతతో ఈ ముప్పు మరింత తీవ్రంగా మారింది. అమెరికా పేట్రియాట్ PAC3, THAAD, రష్యా యొక్క S400 వంటి మునుపటి వ్యవస్థలు హైపర్సోనిక్ క్షిపణులను ట్రాక్ చేసి నాశనం చేయగల సామర్థ్యాన్ని కలిగి లేవు. వాటి నెమ్మదిగా ప్రతిస్పందన పాత సాఫ్ట్‌వేర్ దీనికి కారణం. హైపర్సోనిక్ క్షిపణులు చాలా వేగంగా ఉంటాయి, ప్రతిస్పందించడానికి సమయం కేవలం సెకన్లకు తగ్గించబడుతుంది. దీని కారణంగా ఉన్న రాడార్లు, ఇంటర్‌సెప్టర్లు విఫలమవుతాయి.

**ఇరాన్ హైపర్‌సోనిక్ క్షిపణిని ఉపయోగించింది**

ఇజ్రాయెల్‌పై ఇటీవలి దాడుల్లో ఇరాన్ ఫతా 1 హైపర్‌సోనిక్ క్షిపణిని ప్రకటించుకుంది . ఇరానియన్ మీడియా మరియు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (IRGC) ప్రకారం ఈ క్షిపణిని 2023లో ప్రవేశపెట్టారు. ఇది మాక్ 5 కంటే ఎక్కువ వేగంతో ప్రయాణిస్తుంది. అయితే, దాని హైపర్‌సోనిక్ సామర్థ్యం ప్రభావం గురించి చర్చ జరుగుతోందని నిపుణులు భావిస్తున్నారు.

**ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి పెరుగుతోంది**

యారో 4 పై అంతర్జాతీయ ఆసక్తి పెరుగుతోంది. ఇప్పటికే యారో 3 ను కొనుగోలు చేసిన జర్మనీ ఇప్పుడు యారో 4 ను పరిశీలిస్తోంది. యూరోపియన్ స్కై షీల్డ్ ఇనిషియేటివ్ కింద వేగవంతమైన రహస్య క్షిపణుల నుండి రక్షించడానికి ఇది అవసరం. దీని మాడ్యులర్ డిజైన్ అనేక దేశాలతో అనుసంధానించడం సులభం చేస్తుంది. హైపర్‌సోనిక్ క్షిపణుల ముప్పు పెరుగుతున్న నేపథ్యంలో యారో 4 ఆధునిక యుద్ధానికి ఒక ముఖ్యమైన ఆయుధంగా మారవచ్చు. ఇజ్రాయెల్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలకు వ్యూహాత్మక సహాయంగా మారుతుంది. ఈ వ్యవస్థ కొత్త సాంకేతికత ..భవిష్యత్ యుద్ధాలలో భద్రతకు ఆధారం అవుతుంది.

# క్యూబాలో బిచ్చగాళ్లపై వ్యాఖ్యలు

- **మంత్రి పదవికి రాజీనామా చేసిన ఫీటో**

**టీపీఎన్, క్యూబా :**






మంత్రి చేసిన ఒక ప్రకటన కారణంగా ఆమె తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. కమ్యూనిస్ట్ పాలిత ద్వీప దేశ కార్మిక , సామాజిక భద్రతా మంత్రి మార్తా ఎలెనా ఫీటోకాబ్రెరా క్యూబాలో ఒక్క బిచ్చగాడు కూడా లేదని పార్లమెంటరీ సమావేశంలో అన్నారు. ఆమె ప్రకటనపై చాలా వివాదం చెలరేగింది. ఆ తర్వాత ఆమె తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. క్యూబాలో 'బిచ్చగాడు' అనే వాడు లేదని మంత్రి అన్నారు . కొంతమంది కష్టపడి పని చేయకుండా డబ్బు సంపాదించడానికి వీధుల్లో తిరుగుతూ చెత్తను ఏరుకుంటారని అన్నారు. ఆర్థిక సంక్షోభం కారణంగా క్యూబాలో సామాజిక అభద్రత పెరిగింది. అక్కడి పేదలు, ముఖ్యంగా వృద్ధులు అడుక్కుంటూ లేదా చెత్తను ఏరుకుంటున్నారు. దేశంలోని ఈ పరిస్థితులను విస్మరించి నేషనల్ అసెంబ్లీ కమిటీ ముందు ఫీటో మాట్లాడుతూ మేము ప్రజలను చూశాము... వారు బిచ్చగాళ్లలా మాత్రమే కనిపిస్తారు. వారి చేతులు, వారి బట్టలు బిచ్చగాళ్లలా ఉన్నాయి. కానీ వారు బిచ్చగాళ్ళు కాదు. క్యూబాలో బిచ్చగాళ్ళు లేరు. ఇక్కడ ప్రజలు సులభంగా డబ్బు సంపాదించడానికి బిచ్చగాళ్లలా నటిస్తారు అని అన్నారు. క్యూబాలో అడగకుండానే కారు అద్దాలు శుభ్రం చేసే బిచ్చగాళ్ళు, ప్రజల నుండి వచ్చే డబ్బుతో మద్యం తాగుతారని ఆయన అన్నారు. చెత్త ప్రదేశాల నుండి వస్తువులను తీసుకునే వ్యక్తులను కూడా ఫిటో లక్ష్యంగా చేసుకుని, చెత్త నుండి వస్తువులను తీసి మళ్ళీ అమ్ముతారని అన్నారు. క్యూబాలోని భిక్షాటనదారులపై మంత్రి ఫీటో చేసిన వ్యాఖ్యలపై క్యూబా నాయకులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


# కెనడాలో లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించాలని డిమాండ్..!

**టీపీఎన్, కెనడా :**

లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించాలని కెనడాలోని ఆల్బెర్టా ప్రభుత్వం డిమాండ్ చేసింది. ఆల్బెర్టా ప్రీమియర్ డేనియల్ స్మిత్ , ప్రజా భద్రత , అత్యవసర సేవల మంత్రి మైక్ ఎల్లిస్ కూడా బిష్ణోయ్ ముఠాను ఉగ్రవాద సంస్థగా ప్రకటించాలన్నారు. ఈ ముఠా కెనడా , ఇతర దేశాలలో నేర కార్యకలాపాలను నిర్వహిస్తోందని.. దీని పరిధి ప్రపంచవ్యాప్తంగా విస్తరించిందని వారు ఆరోపించారు.

కెనడాలోని ఆల్బెర్టా ప్రావిన్స్‌లో కూడా లారెన్స్ బిష్ణోయ్ ముఠాను ఉగ్రవాద సంస్థగా ప్రకటించాలనే డిమాండ్ తీవ్రమైంది. ఈ ముఠా అంతర్జాతీయంగా విస్తరించి ఉండటం.. కెనడాలో దాని ప్రమాదకరమైన కార్యకలాపాలకు పాల్పడుతోందని తెలిపింది. ఈ గ్యాంగ్ కెనడాలో హింస, దోపిడీ, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, హత్యలు వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడుతోందని ప్రభుత్వం చెబుతోంది.

అంతకుముందు బ్రిటిష్ కొలంబియా ప్రభుత్వం కూడా బిష్ణోయ్ గ్యాంగ్‌పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేసింది. దోపిడీ , ఇతర నేరాలను ఎదుర్కోవడంలో దర్యాప్తు సంస్థలకు సహాయం చేయడానికి కెనడాలో బిష్ణోయ్ గ్యాంగ్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించాలని బ్రిటిష్ కొలంబియా చీఫ్ డేవిడ్ ఎబి అన్నారు . దోపిడీ బెదిరింపులతో పాటు, కాల్పులు, హత్యలకు సంబంధించిన సంఘటనలు తెరపైకి వచ్చాయని ఇవి బ్రిటిష్ కొలంబియాలోనే కాకుండా ఎడ్మంటన్ , బ్రాంప్టన్ వంటి ఇతర నగరాల్లో కూడా జరుగుతున్నాయని ఎబి చెప్పారు. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ బ్రిటిష్ కొలంబియా, ఆల్బెర్టా, ఒంటారియోలోని దక్షిణాసియా సమాజ సభ్యులను లక్ష్యంగా చేసుకుందని ఆరోపిస్తున్నారు. ఇప్పుడు ఆల్బెర్టా ప్రీమియర్ డేనియల్ స్మిత్ , ప్రజా భద్రత.. అత్యవసర సేవల మంత్రి మైక్ ఎల్లిస్ కూడా బిష్ణోయ్ ముఠాను ఉగ్రవాద సంస్థగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ ముఠా కెనడా , ఇతర దేశాలలో నేర కార్యకలాపాలను నిర్వహిస్తోందని... దీని పరిధి ప్రపంచవ్యాప్తంగా విస్తరించిందని వారు చెబుతున్నారు.



లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ అనేది కెనడాతో సహా అనేక దేశాలలో హింస, దోపిడీ, హత్యలు , మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి తీవ్రమైన నేరాలలో పాల్గొన్న ఒక అంతర్జాతీయ నేర నెట్‌వర్క్ అని స్మిత్ , ఎల్లిస్ సంయుక్తంగా సోషల్ మీడియాలో తెలిపారు. దీని పరిధి ప్రపంచవ్యాప్తంగా ఉందని.. దీని ఉద్దేశ్యం నేరపూరితం.. హింసాత్మకమైనదిగా అభివర్ణించారు. ఈ ముఠా కార్యకలాపాలకు సరిహద్దులు తెలియవని..ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తోందని ఆల్బెర్టా తెలిపారు.బిష్ణోయ్ ముఠాను ఉగ్రవాద సంస్థగా ప్రకటిస్తే, అటువంటి నెట్‌వర్క్ కార్యకలాపాలను సమర్థవంతంగా ఆపడానికి వీలుంటుంది. లేకపోతే ప్రాంతీయ ప్రభుత్వాల ఆర్థిక వనరులు సమకూర్చుకుని సాధారణ పౌరుల భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించారు.

**దక్షిణాసియా సమాజంపై ప్రభావం**

ఆల్బెర్టా ,కెనడా అంతటా ఉన్న దక్షిణాసియా సమాజం ఈ ముఠా కార్యకలాపాల వల్ల ప్రభావితమైందని కూడా ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఉగ్రవాద సంస్థలు, ముఠాలు హింసాత్మక నేరస్థులని...ప్రజలను లక్ష్యంగా చేసుకుని దోపిడీ చేయకుండా నిరోధించవచ్చని స్మిత్ , ఎల్లిస్ అన్నారు.

# సూచీలను నడిపించిన పీఎస్‌యూ బ్యాంకు, రియాల్టీ షేర్లు!

**టీపీఎన్, ముంబై :**

దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం మోస్తరు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా మిశ్రమ సంకేతాలు రావడంతో ఫ్లాటుగా మొదలైన బెంచ్‌మార్క్ సూచీలు క్రమంగా బలం పుంజుకున్నాయి. మధ్యాహ్నానికి ఇంట్రాడే గరిష్ఠాలకు చేరాయి. ద్రవ్యోల్బణం తక్కువగా ఉండటం, కార్పొరేట్ ఫలితాలు విడుదలవుతుండటంతో ఇన్వెస్టర్లు కొనుగోళ్లు చేపట్టారు. మెటల్స్, డిఫెన్స్ వంటి రంగాల్లో మాత్రం సెలక్టివ్‌గా లాభాలు స్వీకరించారు. పీఎస్‌యూ బ్యాంకు, రియాల్టి రంగాల షేర్లు అదరగొట్టాయి. మొత్తంగా నిఫ్టీ 16, సెన్సెక్స్ 63 పాయింట్ల మేర ఎగిశాయి.

క్రితం సెషన్లో 82,570 వద్ద ముగిసిన బీఎస్ఈ సెన్సెక్స్ బుధవారం 82,534 వద్ద మొదలైంది. 82,342 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని తాకింది. 82,784 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని అందుకుంది. చివరికి 63 పాయింట్ల లాభంతో 82,634 వద్ద ముగిసింది. 25,196 వద్ద ఓపెనైన ఎన్ఎస్ఈ నిఫ్టీ 25,121 వద్ద కనిష్ఠ, 25,255 వద్ద గరిష్ఠ స్థాయుల్ని అందుకుంది. మొత్తంగా 16 పాయింట్ల లాభంతో 25,212 వద్ద క్లోజైంది. నిఫ్టీ బ్యాంకు 162 పాయింట్లు పెరిగి 57,168 వద్ద స్థిరపడింది.

నిఫ్టీ50లో 20 కంపెనీలు లాభపడగా 29 నష్టపోయాయి. ఎంఅండ్ఎం, విప్రో, టెక్ మహీంద్రా, నెస్లే ఇండియా, ఎస్బీఐ టాప్ గెయినర్స్. శ్రీరామ్ ఫైనాన్స్, ఎటర్నల్, సన్ ఫార్మా, సిప్లా, టాటా స్టీల్ అత్యధికంగా నష్టపోయాయి.



పీఎస్‌యూ బ్యాంకు, మీడియా, ఐటీ, రియాల్టి, ఎఫ్ఎంసీజీ, ఆటో, బ్యాంకు, చమురు రంగాల సూచీలు కళకళలాడాయి. మెటల్, హెల్త్‌కేర్, ఫార్మా, తయారీ, కమోడిటీస్, ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాల సూచీలు ఎరుపెక్కాయి. ఎన్ఎస్ఈలో నేడు మార్కెట్ బ్రెడ్త్ బయ్యర్లకు అనుకూలంగా ఉంది. మొత్తం 3018 షేర్లు ట్రేడవ్వగా 1660 లాభపడ్డాయి. 1269 నష్టపోయాయి. 52వారాల గరిష్ఠాన్ని 78 షేర్లు, 52వారాల కనిష్ఠాన్ని 22 షేర్లు తాకాయి. అప్పర్ సర్క్యూటును 96, లోయర్ సర్క్యూటును 60 తాకాయి.

డాలరుతో పోలిస్తే రూపాయి 13 పైసలు బలహీనపడి 85.94 వద్ద స్థిరపడింది. రైట్స్ ఇష్యూ ద్వారా ఈఐఎల్ఈఎల్ హోటల్స్‌లో ఇండియన్ హోటల్స్ రూ.165 కోట్ల విలువైన 3.30 లక్షల షేర్లను కైవసం చేసుకుంది. రామిన్ఫో కంపెనీకి సుమారు రూ. 14.14 కోట్ల విలువైన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ లభించింది. ట్రెంట్ స్టాక్‌కు మోతీలాల్ ఓస్వాల్ బ్రోకరేజ్ బయ్ రేటింగ్‌ను కొనసాగించింది. టార్గెట్ ధరను రూ. 6,650గా నిర్ణయించింది. ఈ ఆర్థిక ఏడాది తొలి త్రైమాసికంలో హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ నికర లాభం రూ. 568 కోట్లుగా నమోదైంది. నిరుడు ఇదే సమయంతో పోలిస్తే ఇది 2.4% తగ్గుదల. బజాజ్ ఫైనాన్స్ నికర లాభం 10% పెరిగి రూ. 4,614 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఇది రూ. 4,196 కోట్లుగా ఉంది. FY26లో బాసెల్ III కంప్లైంట్ అడిషనల్ టైర్ 1, టైర్ 2 బాండ్ల ద్వారా రూ. 20,000 కోట్ల నిధుల సమీకరణకు ఎస్బీఐ బోర్డు ఆమోదం తెలిపింది. మూవీ టికెట్ ధరలను రూ. 200కి పరిమితం చేయాలన్న కర్ణాటక ప్రభుత్వ ప్రతిపాదనతో PVR ఐనాక్స్ షేర్లు 1% కంటే ఎక్కువ పడిపోయాయి.

మూర్తి నాయుడు పాదం



**మూర్తి నాయుడు పాదం**
**నిఫ్ట్ మాస్టర్**
**స్టాక్ మార్కెట్ అనలిస్ట్**
**+91 988 555 9709**



## 24 గంటల్లో ఐటీఆర్ రీఫండ్

**టీపీఎన్, న్యూఢిల్లీ :**

202425 ఆర్థిక సంవత్సరానికి ఆదాయపు పన్ను రిటర్నుల దాఖలు ప్రారంభమైంది. అదే సమయంలో ఆదాయపు పన్ను వెబ్‌సైట్‌లో ITR2, ITR3 ఫారమ్‌లు కూడా యాక్టివేట్ చేయబడ్డాయి. దీని కారణంగా ITR దాఖలు చేసేవారి సంఖ్య వేగంగా పెరుగుతోంది. ఆదాయపు పన్ను దాఖలు చేసేవారి సంఖ్య పెరుగుతున్న వేగంతో రీఫండ్ కూడా జారీ చేయబడుతోంది. ఈసారి ఆదాయపు పన్ను శాఖ ప్రజలకు వేగంగా రీఫండ్‌లను పంపుతోంది. జీతం పొందే ఉద్యోగులు, వ్యాపారవేత్తల రీఫండ్‌లు వారి ఖాతాలకు వేగంగా జమ అవుతున్నాయి. గతంలో రీఫండ్ రావడానికి 20 రోజుల నుంచి 1 నెల లేదా కొన్నిసార్లు 3 నుండి 4 నెలల సమయం పట్టేది. కానీ ఇప్పుడు రీఫండ్‌లు 24 గంటల్లోపు లేదా గరిష్టంగా 5 నుండి 10 రోజులలోపు వస్తున్నాయి. ఈసారి ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు చేయడానికి చివరి తేదీ సెప్టెంబర్ 15. మీరు దీనికి ముందు మీ ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు చేయాల్సి ఉంటుంది.

## వేగంగా విస్తరిస్తున్న ఈవీ కార్ల మార్కెట్

**టీపీఎన్, ముంబై :**



భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాల (EV) మార్కెట్ వేగంగా విస్తరిస్తున్నది. సరఫరా గొలుసులోని, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్‌కు సంబంధించిన సమస్యలు సకాలంలో పరిష్కరించగలిగితే 2028 ఆర్థిక సంవత్సరానికి భారత్‌లో ఎలక్ట్రిక్ కార్ల వాటా 7శాతాన్ని దాటుతుందని ఓ నివేదిక పేర్కొంది. అమెరికన్ ఈవీ కంపెనీ టెస్లా భారత్లోకి ప్రవేశించినట్లు అధికారికంగా ప్రకటించిన కేర్ ఏజ్ అడ్వైజరీ ఈ నివేదికను విడుదల చేసింది. గత కొద్దిరోజులుగా భారత్‌లోని ఎలక్ట్రికల్ కార్ల అమ్మకాల్లో విపరీతంగా పెరుగుతున్నది. 2021 ఆర్థిక సంవత్సరంలో 5వేల యూనిట్లు మాత్రమే అమ్ముడయ్యాయి. ఈ సంఖ్య 2025 ఆర్థిక సంవత్సరం నాటికి ఈ సంఖ్య 1.07లక్షలు దాటింది.

## ఇన్వెస్టర్స్ అలర్ట్: డిఫెన్స్ షేర్లలో పెట్టుబళ్లు ఉపసంహరించిన MFs




టీపీఎన్, ముంబై : కొన్ని నెలలపాటు దూకుడు కనబర్చిన డిఫెన్స్ కంపెనీల షేర్లు ప్రస్తుతం డీలాపడ్డాయి. గరిష్ఠ స్థాయుల నుంచి పతనమవుతున్నాయి. దిద్దుబాటుకు లోనవుతున్నాయి. జూన్‌లో మ్యూచువల్ ఫండ్స్ తొమ్మిది డిఫెన్స్ స్టాక్స్‌లో మొత్తం రూ. 1,713 కోట్ల విలువైన షేర్లను విక్రయించడం ఇందుకు దోహదం చేసింది. ఇందులో సోలార్ ఇండస్ట్రీస్, జెన్ టెక్నాలజీస్, భారత్ ఫోర్జ్ కంపెనీల షేర్ల అమ్మకాలే ఎక్కువ. ఆపరేషన్ సిందూర్ తర్వాత డిఫెన్స్ రంగంపై ఆశావాదం, నాటో దేశాల డిఫెన్స్ ఖర్చుల పెరుగుదల వల్ల ఈ స్టాక్స్ ఇంతకు ముందే గరిష్ఠాలకు చేరాయి. అధిక వాల్యుయేషన్లు, నష్టభయం కారణంగా సంస్థాగత పెట్టుబడిదారులు వీటి నిష్క్రమిస్తున్నారని తెలిసింది.

**తగ్గిన దూకుడు**

కొన్ని నెలలుగా డిఫెన్స్ స్టాక్స్ బాగా పెరిగాయి. ఇందుకు ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత ప్రభుత్వం డిఫెన్స్ ఖర్చులను పెంచడం, అలాగే నాటో దేశాల డిఫెన్స్ బడ్జెట్‌లు పెరగడం ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు. ఈ రెండు అంశాలు దేశీయ, విదేశీ మార్కెట్‌లలో అవకాశాలను సృష్టించాయి. అయితే ఈ ర్యాలీ వల్ల స్టాక్స్ వాల్యుయేషన్లు చారిత్రక సగటు కన్నా ఎక్కువగా ఉన్నాయని, ఇది పెట్టుబడిదారులకు రిస్క్‌ను సూచిస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ అధిక విలువల కారణంగా మ్యూచువల్ ఫండ్‌లు తమ హోల్డింగ్‌లను తగ్గించి, లాభాలను సొంతం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నాయని అంటున్నారు.

**అమ్మిన స్టాక్స్ షేర్ల తగ్గుదల**

**సోలార్ ఇండస్ట్రీస్:**
ఈ కంపెనీ షేర్లు 3.3% తగ్గాయి.

**జెన్ టెక్నాలజీస్:**
షేర్లు 2.9% పడిపోయాయి.

**భారత్ ఫోర్జ్:**
ఈ స్టాక్ కూడా గణనీయమైన విక్రయాలను చూసింది.

**భారత్ డైనమిక్స్:**
మోతీలాల్ ఓస్వాల్ ఈ స్టాక్‌పై 'న్యూట్రల్' రేటింగ్ ఇచ్చింది. దీని ధర రూ.1,893కి పడిపోయింది.

**డేటా ప్యాటర్న్స్, ఆస్ట్రా మైక్రోవేవ్, గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్:**
ఈ స్టాక్స్ 2.5% కంటే ఎక్కువ తగ్గాయి.

**హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ :**
ఈ షేర్లు 1.9% పడిపోయాయి.

**BEML, పరాస్ డిఫెన్స్ అండ్ స్పేస్ టెక్నాలజీస్:**
ఈ రెండు స్టాక్స్ 1.4% చొప్పున తగ్గాయి.

కొంతమంది నిపుణులు డిఫెన్స్ రంగం దీర్ఘకాలంలో ఆకర్షణీయంగా ఉంటుందని, ప్రస్తుత ధరల వద్ద కొత్తగా పెట్టుబడులు పెట్టడంపై జాగ్రత్తగా ఉండాలని సలహా ఇస్తున్నారు. ఏకమొత్తంలో పెట్టుబడుల కంటే సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (SIP) ద్వారా క్రమంగా పెట్టుబడి పెట్టడం మంచిదని సూచిస్తున్నారు. భారత ప్రభుత్వం డిఫెన్స్ రంగంలో స్వదేశీ తయారీని ప్రోత్సహిస్తూ రూ. 1.05 లక్షల కోట్ల విలువైన ఆర్డర్‌లను ఆమోదించడం ఈ రంగానికి దీర్ఘకాలంలో ఊతమిస్తుందని అంటున్నారు.

## విమానయాన రంగంలోకి జొమాటో సీఈవో

**టీపీఎన్, న్యూఢిల్లీ :**

ఫుడ్ డెలివరీ రంగంలో దూసుకెళ్తున్న జొమాటో సీఈఓ దీపిందర్ గోయల్ ఇప్పుడు పౌర విమానయాన రంగంలోకి అడుగుపెడుతున్నారు. ఇప్పటికే 'ఎల్ఏటీ ఏరోస్పేస్ పేరుతో ఏవియేషన్ వ్యాపారాన్ని ప్రారంభించిన ఆయన, తాజాగా బాంబర్డియర్ గ్లోబల్ సిరీస్‌కు చెందిన లగ్జరీ ప్రైవేట్ జెట్‌ను కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఈ జెట్ జూన్ నెల నుంచి ఢిల్లీ ఎయిర్‌పోర్టులోని




వీఐపీ బే వద్ద కనిపిస్తోంది. జులై 16 నుంచి దీని కార్యకలాపాలు ప్రారంభం కానున్నట్లు సమాచారం.

## జియో బ్లాక్‌రాక్ పాసివ్ ఫండ్స్‌కు సెబీ ఆమోదం

**టీపీఎన్, ముంబై :**

పాసివ్ ఫండ్లను ఆవిష్కరించేందుకు జియో బ్లాక్‌రాక్ మ్యూచువల్ ఫండ్‌కు సెబీ అనుమతినిచ్చింది. నాలుగు కొత్త పాసివ్ ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్‌లను ప్రవేశపెట్టడానికి జియో సిద్ధమవుతోంది. ఇప్పటికే కంపెనీ ఈక్విటీ ఫండ్ల ద్వారా భారీగా నిధులు సమీకరించిన సంగతి తెలిసిందే.

**జియో బ్లాక్‌రాక్ పాసివ్ ఫండ్స్**

1.జియో బ్లాక్‌రాక్ నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 ఇండెక్స్ ఫండ్: ఈ ఫండ్ నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 ఇండెక్స్‌ను ట్రాక్ చేస్తుంది. ఇది మిడ్‌క్యాప్ కంపెనీలలో పెట్టుబడులు పెట్టనుంది.

2.జియో బ్లాక్‌రాక్ నిఫ్టీ నెక్స్ట్ 50 ఇండెక్స్ ఫండ్: ఈ ఫండ్ నిఫ్టీ నెక్స్ట్ 50 ఇండెక్స్‌ను అనుసరిస్తుంది. ఎన్ఎస్ఈలో టాప్ 50 కంపెనీ తర్వాత ఉన్న 50 కంపెనీల్లో పెట్టుబడికి వీలు కల్పిస్తుంది.

3. జియో బ్లాక్‌రాక్ నిఫ్టీ స్మాల్‌క్యాప్ 250 ఇండెక్స్ ఫండ్: ఈ ఫండ్ నిఫ్టీ స్మాల్‌క్యాప్ 250 ఇండెక్స్‌ను ట్రాక్ చేస్తుంది. ఇది చిన్న కంపెనీలలో పెట్టుబడులను లక్ష్యంగా చేసుకుంటుంది.

4. జియో బ్లాక్‌రాక్ నిఫ్టీ 813 ఇయర్ జిసెక్ ఇండెక్స్ ఫండ్: ఈ ఫండ్ భారత ప్రభుత్వ బాండ్లను ట్రాక్ చేస్తుంది. ఇవి 8 నుంచి 13 సంవత్సరాల మెచ్యూరిటీ కలిగి ఉంటాయి. ఇది డెట్ విభాగంలో స్థిరమైన ఆదాయాన్ని అందిస్తుంది.

**జియో బ్లాక్‌రాక్ వ్యూహం**

భారత్‌లోని రూ.72.2 లక్షల మ్యూచువల్ ఫండ్ మార్కెట్లో గణనీయమైన వాటా చేజిక్కించుకోవాలని జియో బ్లాక్‌రాక్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు ఒక ప్రత్యేకమైన వ్యూహాన్ని అనుసరిస్తోంది. ఈ సంస్థ తమ డిజిటల్‌ఫస్ట్ విధానంతో, జియో భారీ డిజిటల్ నెట్‌వర్క్, బ్లాక్‌రాక్ అలాడిన్ టెక్నాలజీ ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించి తక్కువ ఖర్చుతో కూడిన పెట్టుబడి ఎంపికలను అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

జియో బ్లాక్‌రాక్ ఫండ్‌ల ఎక్స్‌పెన్స్ రేషియో ఇండస్ట్రీ సగటు కన్నా తక్కువగా ఉంటుందని, కొన్ని సందర్భాల్లో 0.05% వరకు తగ్గవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇది సంప్రదాయ మ్యూచువల్ ఫండ్‌లతో పోలిస్తే చాలా తక్కువ. రిటైల్ ఇన్వెస్టర్లను ఇది ఆకర్షించే అవకాశాలు ఉన్నాయి

జియో బ్లాక్‌రాక్ ఇప్పటికే జూన్ 30 నుంచి జులై 2, 2025 వరకు ఓపెన్ చేసిన మూడు డెట్ ఆధారిత న్యూ ఫండ్ ఆఫర్‌ల (NFOs) ద్వారా 17,800 కోట్ల రూపాయలను సేకరించింది. ఇవి జియో బ్లాక్‌రాక్ లిక్విడ్ ఫండ్, జియో బ్లాక్‌రాక్ మనీ మార్కెట్ ఫండ్, మరియు జియో



## ఈ స్టాక్స్ కొంటే సేఫ్ జోన్!

**టీపీఎన్, ముంబై :**

భారత స్టాక్ మార్కెట్లు బుధవారం మోస్తరుగా లాభపడ్డాయి. నిఫ్టీ 16, సెన్సెక్స్ 63 పాయింట్ల మేర ఎగిశాయి. పీఎస్‌యూ బ్యాంకింగ్ రంగ షేర్లు అదరగొట్టాయి. మార్కెట్ పరిస్థితులను అనుసరించి ఈ స్టాక్స్‌ను ఇన్వెస్టర్లు పరిశీలించొచ్చు.

**స్టాక్ రికమెండేషన్స్**

**ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్:**

ఈ స్టాక్ హౌసింగ్ ఫైనాన్స్ రంగంలో బలమైన పనితీరును కనబరుస్తోంది. ఇటీవలి కన్సాలిడేషన్ ఫేజ్ తర్వాత బలమైన బ్రేకౌట్ సంకేతాలను చూపుతోంది. బుధవారం 2.9% లాభంతో రూ.637 వద్ద ముగిసింది. ఇన్వెస్టర్లు రూ.655 ₹665 టార్గెట్ ధరతో రూ. 630 శ్రేణిలో పొజిషన్ తీసుకోవాలి. రూ.610 వద్ద స్టాప్‌లాస్ ఉంచుకోవాలి.

**స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్:**

హెల్త్‌కేర్ రంగంలో డిమాండ్ పెరుగుదల, కంపెనీ బలమైన పోర్ట్‌ఫోలియో ఈ స్టాక్‌ను ఆకర్షణీయంగా మారుస్తోంది. బుధవారం రూ.439 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.440 శ్రేణిలో అక్యూములేట్ చేసుకోవాలి. రూ.475500 వరకు టార్గెట్ పెట్టుకోవచ్చు. మీ నష్టభయానికి అనుగుణంగా స్టాప్‌లాస్ ఎంచుకోవచ్చు.

**యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్:**

మున్ముందు ఫెస్టివ్ సీజన్ మొదలవుతుండటం, మెరుగైన ఫలితాలు ఉంటాయన్న ఉద్దేశంతో ఇన్వెస్టర్లు దీనిపై ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. ఈ షేర్లు బుధవారం రూ.2009 వద్ద ముగిశాయి. ఈ కౌంటర్లో రూ.2250 టార్గెట్ ధరతో రూ.2000 శ్రేణిలో పొజిషన్ తీసుకోవాలి. కొన్ని రోజుల వరకు హోల్డ్ చేయాలి. రూ.1920 వద్ద దీనికి కీలక మద్దతు ఉంది.

**ఎన్ఎల్‌సీ ఇండియా:**

బుధవారం రూ.238 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో రూ.230 శ్రేణిలో ప్రవేశించాలి. బయ్ ఆన్ డిప్స్ మెథడ్ అనుసరించాలి. ఎనర్జీ రంగంలో బలమైన డిమాండ్, కొత్త బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ ప్రాజెక్టులు (250 MW/500 MWh) ఈ స్టాక్‌ను ఆసక్తికరంగా మార్చాయి. టార్గెట్ ధర ₹265 ₹270. స్టాప్‌లాస్: ₹220.

**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా:**



ఇందులో వీసీపీ ప్యాటర్న్ కనిపిస్తోంది. రూ.20వేల కోట్లు సమీకరించాలన్న నిర్ణయం, పీఎస్‌యూ బ్యాంకింగ్ షేర్లకు డిమాండ్ పెరుగుతుండటం సానకూల అంశాలు. బుధవారం రూ.831 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.880 టార్గెట్ ధరతో రూ.800/820 శ్రేణిలో పొజిషన్ తీసుకోవాలి.



**మూర్తి నాయుడు పాదం**
**నిఫ్ట్ మాస్టర్**
**స్టాక్ మార్కెట్ అనలిస్ట్**
**+91 988 555 9709**

# ఇలాంటి మెసేజ్, కాల్స్ వస్తున్నాయా?


ప్రజంట్ ఉన్న పరిస్థితుల్లో టెక్నాలజీ ఎంతగా పెరిగిందో.. దానికి తగ్గట్లుగా డిజిటల్ క్రైమ్స్ కూడా పెరిగాయి. ఈ క్రమంలో ఎంతోమంది అమాయకులు సైబర్ క్రైమ్స్ చేసే వ్యక్తుల వలలో చిక్కుకుని బాధపడుతున్నారు. ఈ డిజిటల్ రంగం విస్తరిస్తున్న కొద్దీ సైబర్ నేరాలూ అంతే స్థాయిలో పెరుగుతున్నాయి. అమాయకులే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త మోసంతో లూటీకి తెగబడుతున్నారు. ఆఫర్ల పేరుతో ఆశచూపించో, డిజిటల్ అరెస్టుల పేరుతో కాల్స్ అండ్ మెసేజ్‌లతో బెదిరించో రూ.కోట్ల రూపాయల్లో కొల్లగొడుతున్నారు. ఈ మధ్యన కేవైసీ ఎక్స్ పైర్, గ్యాస్, విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి అనుమానాస్పద కాల్ గానీ మెసేజ్ గానీ వస్తే గనక వెంటనే చక్షు పోర్టల్ లో కంప్లైంట్ చేయాలి. ఎందుకంటే మీకొచ్చిన మోసపూరిత కాల్, మెసేజ్ లేదా వాట్సప్ మెసేజ్‌లు ఇందులో కంప్లైంట్ చేయడం ద్వారా ఈ తరహా నేరాలను అడ్డుకోవచ్చు. కాబట్టి KYC గడువు ముగిసింది.. అప్‌డేట్ చేసుకోవాలనో, బ్యాంకు ఖాతా, సిమ్ అప్‌డేట్ పేరుతోనో, గ్యాస్ లేదా విద్యుత్తు కనెక్షన్ల పేరుతోనో, ప్రభుత్వ అధికారుల్లా నటించో, లైంగిక వేధింపుల పేరుతో మోసాలకు పాల్పడుతున్న సైబర్ కేటుగాళ్లపై ఈ పోర్టల్ లో ఫిర్యాదు చేయవచ్చని కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టింది. సంబంధిత వెబ్‌సైట్ లో మూడు అంచెల్లో ఈ తరహా మోసాలపై ఫిర్యాదు చేయొచ్చని సూచించింది. కాగా ఈ క్రమంలో మీరు



చేయాల్సి మొట్టమొదటి పని సంచార్ సాథీ పోర్టల్ https://sancharsaathi.gov.in/sfc/ ను విజిట్ చేయాలి. సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలపై కాల్, ఎస్సెమ్మెస్, వాట్సప్ ద్వారా అనుమానిత మోసపూరిత మెసేజ్ లపై ఇక్కడ రివ్యూ చేయొచ్చు. ఒకవేళ ఇప్పటికే సైబర్ మాయగాళ్ల వలకు చిక్కి డబ్బు కోల్పోయినట్లయితే.. హెల్ప్‌లైన్ నంబర్ 1930 లేదా వెబ్‌సైట్ https://www.cybercrime.gov.in ద్వారా ఫిర్యాదు చేయాలి. ఆర్థిక మోసాలు, సైబర్ క్రైమ్ కేసులు చక్షు పరిధిలోకి రావు. ఇక మరోక ముఖ్యమైన స్టెప్ ఏంటంటే.. మీకు వచ్చిన మోసపూరిత ఫోన్‌కాల్, వాట్సప్ మెసేజ్ వంటి వివరాలు, వచ్చిన తేదీ, సమయాన్ని పోర్టల్‌లో నమోదు చేయాలి. వాటిని స్క్రీన్‌షాట్ తీసి ఆ ఫైల్‌ని అప్‌లోడ్ చేయాలి. ఇక చివరగా మీ పేరు, ఫేక్ మెసేజ్ వచ్చిన ఫోన్ నంబర్ ఎంటర్ చేస్తే మీకు ఒక ఓటీపీ వస్తుంది. చివరగా క్యాప్చా కోడ్ ని ఎంటర్ చేస్తే కంప్లైంట్ ఫైల్ అవుతుంది. ఈ విధంగా సైబర్ నేరాలను అరికట్టవచ్చు. అయితే మీరు ఏమాత్రం అప్రమత్తంగా ఉన్నా కూడా సైబర్ నేరగాళ్లు మిమ్మల్ని బెదరించి డబ్బును మాయం చేసే విధంగా ప్రవర్తిస్తారు. కాబట్టి అలాంటి వారికి మీరు ఎట్టి పరిస్థితుల్లోనూ భయపడకుండా ధైర్యంగా ఈ విధంగా కంప్లైంట్ చేయండి. అంతేకాకుండా ఇంకా ఎక్కువగా బెదిరింపు కాల్స్, మెసేజ్‌లు వస్తే కనుక వెంటనే మీ దగ్గర్లోని పోలిస్ స్టేషన్ లో సైబర్ డిపార్ట్ మెంట్ లో కంప్లైంట్ చేయండి.

# అమ్మాయితో పాటు ఆనందం వచ్చింది: కియారా






అమ్మవడం ప్రతి అమ్మాయి జీవితంలో ఓ మధురమైన ఘట్టం. తమకు బిడ్డ పుట్టిన ఆ క్షణం ప్రపంచాన్నే జయించినంతగా ఆనందపడిపోతారు తల్లిదండ్రులు. ఈ లిస్ట్ లోకి బాలీవుడ్ క్యూట్ కపుల్ కియారా అద్వానీసిద్ధార్థ్ మల్హోత్రా కపుల్స్ కూడా యాడ్ అయ్యారు. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తోన్న ఈ జంటకు ఆడపిల్ల పుట్టింది. ఇలా తమ లిటిల్ ఏంజెల్ రాకను ఓ ప్రత్యేక పోస్ట్ రూపంలో సోషల్ మీడియాలో షేర్ చేయగా.. అది వైరలవుతోంది. బాలీవుడ్ మోస్ట్ వాంటెడ్ కపుల్‌గా పిలుచుకునే కియారాసిద్ధార్థ్ ఈ ఏడాది ఫిబ్రవరిలో తమ ప్రెగ్నెన్సీ విషయాన్ని బయటపెట్టారు. అప్పట్నుంచి వీలైనంత వరకు కెమెరా కంటికి దూరంగా ఉంటూ ప్రైవసీని కొనసాగిస్తోన్న ఈ జంట.. రీసెంట్ గా పేరెంట్స్ అయ్యారు. కియారాకు పండంటి ఆడపిల్ల పుట్టింది. అంతేకాదు నార్మల్ డెలివరీ ద్వారా బిడ్డను ప్రసవించిందట. ఈ పోస్ట్ లో మా హృదయాలు సంతోషంతో నిండిపోయాయి.. మా ప్రపంచం మారిపోయింది.. మాకు ఆడపిల్ల పుట్టింది.. మా ఇంట్లో ఆనందం తెచ్చింది.. అంటూ పింక్ థీమ్‌తో కూడిన గ్రీటింగ్ కార్డుపై రాసి.. ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో ఇటు సెలబ్రిటీలు, అటు నెటిజన్లు ఈ న్యూ పేరెంట్స్‌కు విషెస్ చెబుతున్నారు. ఇక కియారా తనకు కవలలు పుట్టాలనుంది అంటూ ఓ సందర్భంలో తన మనసులోని ఇష్టాన్ని బయటపెట్టింది. నాకు కవల పిల్లలంటే చాలా ఇష్టం. ఒకే కాన్పులో ఓ పాప, బాబు ఇద్దరూ పుట్టాలనుంది. ఇలా ఇద్దరు పిల్లలతో మా కుటుంబం పరిపూర్ణమవుతుంది. అలాగని మనం అనుకున్నది జరగాలనీ లేదు. కాబట్టి ఎవరు పుట్టినా సరే.. ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నా.. అందీ కియారా. అయితే సిద్ధార్థ్ తల్లి రిమ్మా మల్హోత్రా మాత్రం తమ కొడుకు, కోడలికి ఆడపిల్లే పుట్టాలని బలంగా అనుకుందట. అమ్మను కదా.. కుటుంబంలో ఓ ఆడపిల్ల ఉంటే ఆ కళే వేరు. అందుకే నా కొడుకుకోడలికి అమ్మాయే పుట్టాలని ఉంది.. అంటూ తన మనసులోని మాటను రీసెంట్ గా ఓ సందర్భంలో బయటపెట్టారామె. అనుకున్నట్లుగానే తమ ఇంటికి మహాలక్ష్మి రావడంతో పట్టలేనంత సంతోషంలో మునిగిపోయారు రిమ్మా. బంధువులు, స్నేహితులను పిలిచి పార్టీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారామె. ఇక ప్రెగ్నెన్సీ డైట్, మెటర్నిటీ ఫొటోషూట్.. విషయంలో కూడా కియారా చాలా క్లియర్ గా ఉన్నారు. తాను గర్భం ధరించానని, త్వరలోనే అమ్మను కాబోతున్నానని ప్రకటించిన మరుక్షణం నుంచే ఈ విషయంలో ఎంతో ప్రైవసీని మెయింటెయిన్ చేసింది. అయితే ఈ ఏడాది మెట్ గాలా ఈవెంట్‌లో తొలిసారి పాల్గొన్న కియారా.. ఆ వేదికపై అమ్మతనాన్ని ప్రతిబింబించే అవుట్ ఫిట్ లో మెరిసిపోయింది. గర్భంలో ఎలాగైతే తల్లీబిడ్డలు బొడ్డుతాడుతో అనుసంధానమై ఉంటారో.. అదే థీమ్‌ను కియారా తన డ్రెస్ తో ప్రజంట్ చేసింది. ప్రముఖ డిజైనర్ గౌరవ్ గుప్తా రూపొందించిన ఈ మోడ్రన్ డ్రెస్.. మెట్‌గాలాలోనే సెంటరాఫ్ అట్రాక్షన్‌గా నిలిచింది.



# వైరల్.. రోడ్డు మధ్య కరెంట్ పోల్స్

మీరెప్పుడైనా రోడ్డు మధ్యలో కరెంట్ పోల్స్ ని చూశారా.. సాధారణంగా ఎక్కడైనా సరే రోడ్డుకు ఇరువైపులా కరెంట్ పోల్స్ ఉండటం చూస్తాం. కానీ ఈ వీడియోలో మాత్రం కరెంట్ పోల్స్ సరిగ్గా రోడ్డు మధ్యలో ఉన్నాయి. మరెందుకు ఇలా ఉన్నాయి అంటారు ఇప్పుడు తెలుసుకుందాం.. సరైన రోడ్డు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అక్కడి ప్రభుత్వం రోడ్డు మంజూరు చేసింది. అధికారులు పనులు చేపట్టారు. కొన్ని రోజులకు రోడ్డు పూర్తి అయ్యింది. అయితే నిర్మాణాన్ని చూసిన వారంతా షాకయ్యారు. ఇదేంటి రోడ్డు ఇలా కూడా వేస్తారా అని ముక్కున వేలేసుకున్నారు. ఎందుకంటే కరెంట్ పోల్స్ మధ్యలో రోడ్డు వేసినట్లుగా ఉంది అది. రోడ్డు మధ్యలో కరెంట్ పోల్స్ ఉంటే ఎలా వెళ్తారని స్థానికులు ప్రశ్నించినా స్పందించేవారే లేరు. ఈ ఘటన హిమాచల్ ప్రదేశ్‌లో జరిగింది. సిర్మౌర్ జిల్లాలోని బద్రీపూర్, కిషన్‌పురా, సంతోఖ్‌గఢ్ పురువాలాల గ్రామాలను కలుపుతూ ఈ రోడ్డు వేశారు. రోడ్డు వేసేటప్పుడు కరెంట్ పోల్స్ తియ్యకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ఠగా నిలుస్తుంది. ఓ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ దీన్ని వీడియో తీసి పోస్ట్ చేయడంతో వైరల్‌గా మారింది. ఆ వీడియోలో వారెవ్వా.. ఏం తెలివి.. రోడ్డు సూపర్ వేశారు. మందు తాగిన వ్యక్తులు రోడ్డును చూడకపోయిన కరెంట్ పోల్స్‌ను చూస్తారు. నిజంగా అద్భుతం. ఈ రోడ్డు హిమాచల్ టూరిజాన్ని పెంచుతుంది అంటూ సెటైర్లు వేశాడు. ఈ అంశంపై మాజీ మంత్రి, బీజేపీ ఎమ్మెల్యే సుఖ్ రామ్ చౌదరి స్పందించారు. విద్యుత్ లైన్ కనీసం 25 ఏళ్ల పాతదని.. రోడ్డు విస్తరణ ప్రాజెక్టు ప్లాన్ చేసినప్పుడు.. అధికారులు విద్యుత్ లైన్‌ను కూల్చివేయాలని ఆలోచించలేదని తెలిపారు. అధికారులు పోల్స్ మధ్య నుంచే రోడ్డు వేసుకుంటూ వెళ్లారు. ఈ స్తంభాలను మార్చమని నేను సంబంధిత శాఖను అభ్యర్థించాను. అయితే దీన్ని తీయడానికి నిధులు లేవని అధికారులు చెప్పినట్లు వివరించారు. ఈ వీడియో చూసిన నెటిజన్లు రకరకాల కామెంట్లు చేస్తున్నారు. ఇంజినీర్ల అద్భుతం, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం, ఇండియన్ ఇంజినీర్లు అంటేనే ఇలా ఉంటారు, శిమ్లా తర్వాత ఈ రోడ్డు టూరిస్ట్ స్పాట్‌గా మారుతుంది అంటూ నెటిజన్లు ఫన్నీ కామెంట్స్ చేస్తున్నారు. గతంలో బీహార్‌లోనూ ఇటువంటి ఘటనే జరిగింది. పాట్నా నుండి 50 కి.మీ దూరంలో ఉన్న జెహానాబాద్ లో జిల్లా యంత్రాంగం రూ. 100కోట్ల రోడ్డు విస్తరణ ప్రాజెక్టును చేపట్టింది. చెట్లను తొలగించడానికి అటవీ శాఖను సంప్రదించగా.. వాళ్లు ఒప్పుకోలేదు. చెట్లను కొట్టేసే భూమికి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసింది. దీంతో అధికారులు చెట్ల మధ్య నుంచే రోడ్డు వేసి చేతులు దులుపుకున్నారు. అప్పట్లో ఇది దేశవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పుడు హిమాచల్‌లోనూ అటువంటి ఘటనే చోటుచేసుకోవడం గమనార్హం.


# ఐఫోన్ పై 16 పై బిగ్గెస్ట్ డిస్కౌంట్



యాపిల్ ఐఫోన్ 16 స్మార్ట్ ఫోన్ కొనాలని వెయిట్ చేస్తున్న వారికి ఫ్లిప్ కార్ట్ గోట్ సేల్ సూపర్ గుడ్ న్యూస్ చెబుతుంది. యాపిల్ లేటెస్ట్ ఫోన్ సిరీస్ ఐఫోన్ 16 సిరీస్ సెండ్ బేసిక్ ఫోన్ ఐఫోన్ 16 ఫోన్ గొప్ప కెమెరా అండ్ లేటెస్ట్ A18 బయోనిక్ చిప్ వంటి ప్రీమియం ఫీచర్స్ కలిగి ఉంటుంది. ఈ ఫోన్ ను ఫ్లిప్ కార్ట్ నుంచి డిస్కౌంట్ ధరకే అందుకోవచ్చు. యాపిల్ ఐఫోన్ 16 ఫోన్ యొక్క మూడు వేరియంట్స్ పై కూడా ఈ బిగ్ డిస్కౌంట్ ఆఫర్ అందించింది. ఐఫోన్ 16 ఫోన్ కంపెనీ వెబ్సైట్ నుంచి రూ. 79,990 ధరతో సేల్ అవుతుంటే, ఫ్లిప్ కార్ట్ నుంచి రూ. 10,000 రూపాయల భారీ డిస్కౌంట్ తో కేవలం రూ. 69,990 ధరతో సేల్ అవుతోంది. ఈ ఫోన్ యొక్క 256 జీబీ వేరియంట్ రూ. 79,999 ధరతో అండ్ హై ఎండ్ 512 జీబీ వేరియంట్ రూ. 99,999 ధరలో లభిస్తుంది. అంటే, అన్ని వేరియంట్స్ పైన కూడా 10 వేల రూపాయల తగ్గింపు అందించింది. ఇది కాకుండా ఈ ఫోన్ పై రూ. 2,000 అదనపు డిస్కౌంట్ కూపన్ లేదా క్యాష్ బ్యాక్ డిస్కౌంట్ కూడా ఫ్లిప్ కార్ట్ ఆఫర్ చేస్తోంది. అదనంగా, ఈ ఫోన్ స్టార్టింగ్ 128 జీబీ వేరియంట్ పై రూ. 3000 రూపాయల అదనపు బ్యాంక్ డిస్కౌంట్ ఆఫర్ కూడా అందించింది. ఈ ఫోన్ ను యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డ్ నాన్ ఈఎంఐ ఆప్షన్ తో తీసుకునే వారికి ఈ అదనపు డిస్కౌంట్ లభిస్తుంది. అంటే, ఈ ఫోన్ పై టోటల్ 15,000 రూపాయల తగ్గింపు లభిస్తుంది. ఈ ఆఫర్ తో ఈ ఫోన్ ను కేవలం రూ. 64,990 రూపాయల అతి తక్కువ ధరకు అందుకోవచ్చు. యాపిల్ ఈ ఫోన్ ను A18 చిప్ తో అందించింది అండ్ ఈ ఫోన్ 128 జీబీ, 256 జీబీ మరియు 512 జీబీ స్టోరేజ్ తో లభిస్తుంది. ఈ ఫోన్ iOS 18 తో నడుస్తుంది అండ్ యాపిల్ ఇంటెలిజెన్స్ తో వస్తుంది. ఈ ఫోన్ 6.1 ఇంచ్ సూపర్ రెటినా XDR డిస్ప్లే కలిగి ఉంటుంది. ఈ డిస్ప్లే డైనమిక్ ఐల్యాండ్, హ్యాప్టిక్ టచ్, 2000 నిట్స్ పీక్ బ్రైట్నెస్ తో పాటు రిజల్యూషన్ కలిగి ఉంటుంది. ఈ ఫోన్ లో గొప్ప కెమెరా సిస్టం మరియు ప్రత్యేకమైన యాక్షన్ బటన్ కూడా కలిగి ఉంటుంది. ఈ ఫోన్ లో 48MP ఫ్యూజన్ మరియు 12MP అల్ట్రా వైడ్ కెమెరాలు కలిగిన డ్యూయల్ రియర్ మరియు ముందు 12MP ట్రూ డెప్త్ సెల్ఫీ కెమెరా కలిగి ఉంటుంది. ఈ ఫోన్ 4x ఆప్టికల్ జూమ్ రేంజ్, స్మార్ట్ HDR 5 మరియు 60 FPS వద్ద 4K Dolby Vision వీడియో రికార్డ్ సపోర్ట్ కలిగి ఉంటుంది. యాపిల్ ఐఫోన్ 16 లో 27 వీడియో ప్లే బ్యాక్ అందించే పవర్ ఫుల్ బ్యాటరీ ఉంటుంది. ఈ ఫోన్ ఎమర్జెన్సీ SOS మరియు క్రాష్ డిటెక్షన్ వంటి స్పెషల్ ఫీచర్ కూడా కలిగి ఉంటుంది.

# రోబోలకు ఫిజికల్ టచ్?

రోబోలకు కూడా మనుషుల్లాగే స్పర్శ అనుభూతి వస్తే ఎలా ఉంటుందో ఒక్కసారి ఊహించండి. ఊహించడం ఎందుకు రోబో సినిమాలో చిట్టి రోబో విషయంలో డైరెక్టర్ శంకర్ కళ్లకు కట్టినట్లు చూపించారు. అది సినిమా కాబట్టి సరిపోయింది. మరి రియల్ లైఫ్ లో నిజంగానే రోబోస్ కి ఫిజికల్ టచ్ అండ్ ఎమోషన్స్ వస్తే ఇంకేమైనా ఉందా.. అది ఈరోజు కాకున్నా.. రేపైనా ఖచ్చితంగా మానవ జాతికి ప్రమాదమే కదా. అయితే ఇప్పుడు టెక్నాలజీ విపరీతంగా పెరుగుతున్న క్రమంలో సైంటిస్టులు మరిన్ని టెక్నాలజీ డెవెలప్ మెంట్ ప్రోగ్రామ్స్ ను చేపడుతున్నారు. ఈ క్రమంలోనే యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జి అండ్ యూనివర్సిటీ కాలేజ్ లండన్ శాస్త్రవేత్తలు కలిసి రూపొందించిన కొత్త ఎలక్ట్రానిక్ చర్మం రోబోలకు ఫిజికల్ టచ్ కలను సాకారం చేస్తోంది. జెలటిన్ ఆధారిత పదార్థంతో తయారైన ఈ చర్మం చాలా మృదువుగా ఉంటుంది. ఇది విద్యుత్ ను వాహకంగా ఉపయోగించుకుంటూ బయటి ప్రేరేపకాలను గుర్తించగలదు. దీనిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎలక్ట్రోడ్లు అనుసంధాన మార్గాల ద్వారా స్పర్శల్ని, ఉష్ణోగ్రత మార్పులను, తట్టడాన్ని, మరియు చివరికి నొప్పిని కూడా గుర్తించగలవు. ఈ ఎలక్ట్రానిక్ చర్మంలో అమర్చిన గ్రాహకాలు భౌతిక సంకేతాలను సేకరించి, వాటిని విద్యుత్ సంకేతాలుగా మార్చుతాయి. ప్రయోగాల్లో ఇది 8.6 లక్షల విద్యుత్ మార్గాల ద్వారా వచ్చిన 17 లక్షల సమాచార భాగాలను సరిగ్గా గుర్తించి ప్రాసెస్ చేసింది. ఈ ఆధారంగా శాస్త్రవేత్తలు ఒక ప్రత్యేకమైన మెషిన్ లెర్నింగ్ మోడల్‌ను అభివృద్ధి చేశారు. ఈ మోడల్ సహాయంతో రోబోలు తమపై జరిగిన స్పర్శలను అర్థం చేసుకుని, తగిన చర్యలు తీసుకునే సామర్థ్యాన్ని పొందాయి. ఇది కేవలం రోబోలకు అనుభూతిని ఇచ్చే పరిధిలో మాత్రమే కాకుండా, ఆర్టిఫియల్ అవయవాల అభివృద్ధిలోనూ కీలకపాత్ర పోషించనుంది. ఈ చర్మాన్ని కృత్రిమ చేతులపై అమర్చడం ద్వారా అవయవాలు పొందిన వ్యక్తులు తిరిగి స్పర్శను అనుభవించే అవకాశముంది. ఇది నూతన ఆశలకూ, జీవన నాణ్యత పెంపుకూ దారితీసే పరిణామం. భవిష్యత్తులో ఈ టెక్నాలజీ మానవ యాంత్రిక సంబంధాలలో కొత్త పరిణామాన్ని అందించనుంది.





# మాంచెస్టర్ టెస్టు ముందు టీమిండియా ఛాలెంజెస్

ఇంగ్లాండ్ పర్యటనలో థర్డ్ టెస్టుకి అసలైన ట్విస్టులు ఏంటో అభిమానులు రుచి చూశారు. ఇంగ్లాండ్, భారత్ టీమ్ ప్లేయర్స్ ఎమోషన్స్ తీవ్రస్థాయికి చేరాయి. ఇదే సీరియస్ నెస్ సిరీస్ ఆసాంతం కంటిన్యూ అవుతుందని అనడంలో సందేహం లేదు. సరిగ్గా వారం రోజుల తర్వాత మాంచెస్టర్ వేదికగా నాలుగో టెస్టు జరగనుంది. టీమిండియా సిరీస్ రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిందే. మరి మన జట్టు ముందున్న ఛాలెంజెస్ ఏంటో చూద్దాం. ఫైనల్ టీమ్ వషయంలో భారత్ కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. మరీ ముఖ్యంగా కరుణ్ నాయర్‌ను కంటిన్యూ చేయడంపై మళ్లీ ఆలోచించాల్సిందే. క్రికెట్ లో అదరగొట్టాడని తీసుకొచ్చి మరీ అవకాశాలు ఇచ్చినా.. అతడు మాత్రం వాటిని నిలబెట్టుకోవడంలో తడబాటుకు గురవుతున్నాడు. స్టార్టింగ్ లో కాన్ఫిడెంట్ గానే ఇన్నింగ్స్ ను ప్రారంభిస్తున్నప్పటికీ దానిని కొనసాగించలేక పెవిలియన్ కు చేరిన సందర్భాలను చూశాం. సాయి సుదర్శన్ విషయంలో ఒక్క మ్యాచ్‌తోనే పక్కనపెట్టిన మేనేజ్‌మెంట్.. మూడు మ్యాచుల్లోనూ కనీసం హాఫ్ సెంచరీ కూడా చేయలేకపోయిన కరుణ్ పై వేటు వేయడం ఖాయమనే వాదనా ఉంది. మూడో టెస్టులో టీమిండియా ఓటమికి మెయిన్ రీజన్.. ఇంగ్లాండ్ బ్యాటర్లు ఎనిమిదో వికెట్ కు ఏకంగా 84 పరుగులను యాడ్ చేయడమే. టాప్, మిడిలార్డర్‌ను త్వరగానే పెవిలియన్ కు చేరుస్తున్నప్పటికీ లోయర్ ఆర్డర్ పై ఇండియన్ బౌలర్లు కాస్త కనికరం చూపిస్తున్నట్లుంది. మాంచెస్టర్ లో ఇంగ్లాండ్ లోయర్ ఆర్డర్ పని పడితేనే విజయం టీమిండియా సొంతమవుతుంది. ఆ బాధ్యతను స్పిన్ ఆల్ రౌండర్లు తీసుకోవడం బెటర్. స్పిన్ బౌలింగ్ లో షాట్లు కొట్టేందుకు ప్రయత్నించి వికెట్లు సమర్పించే అవకాశం లేకపోలేదు. భారత జట్టు బ్యాటర్లు మొదటి ఇన్నింగ్స్ లో బాగా ఆడతారు. అదేంటో రెండో ఇన్నింగ్స్‌కు వచ్చేసరికి మాత్రం ఒత్తిడికి గురికావడం తరచూ చూస్తున్నాం. ఫస్ట్ టెస్టులో అలానే ఓటమి పాలైన సంగతి తెలిసిందే. ఇప్పుడు మూడో టెస్టులోనూ సేమ్ రిజల్ట్. కానీ, టాప్ ఆర్డర్ లో మరొక బ్యాటర్ నిలిచినా ఫలితం మనకు అనుకూలంగా వచ్చేది. దారుణమైన షాట్ కు గిల్ ఔట్ కాగా.. మంచి బంతికే గిల్ పెవిలియన్‌కు చేరాడు. రిషభ్ పంత్ గాయపడటం నష్టం చేసింది. ఇక్కడే భారత మేనేజ్‌మెంట్ కాస్త తెలివిగా వ్యవహరించి ఉంటే బాగుండేది. లార్డ్స్ లో భారత్ లక్ష్య ఛేదనకు దిగినప్పటినుంచి ఇంగ్లాండ్ క్రికెటర్స్ బాడీ లాంగ్వేజ్ మారిపోయింది. నాలుగో రోజు ఆఖర్లో ఆకాశ్‌దీప్‌పై కార్స్ మాటల యుద్ధం.. దానికి ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ వత్తాసు పలుకుతూ చప్పట్లు కొట్టడం ఇలాంటి ఘటనలు మొదలయ్యాయి. ఇక ఐదోరోజు భారత్ ముందు కేవలం 135 పరుగులు ఉండటంతో ఇంగ్లాండ్ ప్లేయర్లు మరింత చెలరేగిపోయారు. పంత్ విషయంలో ఆర్చర్, తెలుగు కుర్రాడు నితీశ్‌కుమార్ రెడ్డి విషయంలో హ్యారీ బ్రూక్, బెన్ స్టోక్స్ ఐపీఎల్ కామెంట్స్ తో రెచ్చగొట్టారు. రవీంద్ర జడేజాను ఇంగ్లాండ్ ఆటగాళ్లు నిన్ను భారత మేనేజ్‌మెంట్ సరిగ్గా చూసుకోవడం లేదు. నువ్వు ఎన్ని చేసినా వృథా. నీకు విలువ లేదు అని ఊరించారు. ఇలాంటప్పుడే భారత జట్టులో విరాట్ కోహ్లీ ఉండుంటే బాగుండని చాలామందికి అనిపించింది. ప్రత్యర్థిపై మాటల యుద్ధం చేయడంలో అతడెప్పుడూ ముందుంటాడు. ఈ విషయంలో ప్రస్తుతం గిల్ సేన కూడా మెరుగుకావాల్సిందే. మాటకు మాట సంధిస్తేనే ప్రత్యర్థి ఇంగ్లాండ్ ప్లేయర్లు వెనక్కి తగ్గుతారు. అదే సమయంలో బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో అద్భుత ప్రదర్శన చేయాలి. మూడో టెస్టులో భారత్ ఓటమి అంతరం 22 పరుగులు. తొలి ఇన్నింగ్స్‌లో టీమ్‌ఇండియా, ఇంగ్లాండ్ సమంగా స్కోరు చేశాయి. కానీ, భారత్ ఇచ్చిన ఎక్స్‌ట్రాలు 31. అదే ఇంగ్లాండ్ కేవలం 12 మాత్రమే ఇచ్చింది. ఇక రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 192 పరుగులు చేయగా.. ఇందులో 32 అదనపు పరుగుల రూపంలోనే వచ్చాయి. ఇక మాంచెస్టర్ టెస్టులో మరోసారి ఆ తప్పుల్ని రిపీట్ చేయకుండా ఉంటేనే సిరీస్ రేసులో టీమిండియా నిలిచేది.

# సీక్రెట్ గా గిల్ డ్రెస్సింగ్ రూమ్ లోకి సారా








టీమిండియా యంగ్ బ్యాటర్, నయా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ప్రజంట్ ఇంగ్లాండ్ తో జరుగుతున్న సిరీస్ లో రన్స్ టాలెంట్ చూపిస్తున్నారు. మొదటి రెండు సిరీస్ లలో తన హవా చూపించాడు. ఇందులో రెండు సెంచరీలు, ఓ డబుల్ సెంచరీలు ఉన్నాయి. లీడ్స్ లో సెంచరీ, బర్మింగ్ హమ్ లో సెంచరీ, డబుల్ సెంచరీ బాదాడు. దీంతో రాహుల్ ద్రావిడ్ 23 ఏళ్ల రికార్డ్ బ్రేక్ అయ్యింది. ఇంగ్లాండ్ లో ఒక టెస్ట్ సిరీస్ లో అత్యధిక పరుగులు సాధించిన భారత ఆటగాడిగా గిల్ రికార్డులకెక్కాడు. కానీ లార్డ్స్ వేదికగా జరిగిన మూడవ టెస్ట్ లో మాత్రం డిజాస్టర్ ప్రజంటేషన్ చేశాడు. అయితే ఇంగ్లాండ్ సిరీస్ నేపథ్యంలో ప్రస్తుతం గిల్ లండన్ లో ఉన్నాడు. మూడవ టెస్ట్ కి ముందు మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ లండన్ లో ఓ పార్టీ ఇచ్చాడు. ఈ పార్టీకి టీమిండియా క్రికెటర్లతో పాటు మాజీలు కూడా హాజరయ్యారు. క్రికెట్ గాడ్ సచిన్ టెండుల్కర్ ఈ పార్టీకి ప్రత్యేకంగా హాజరయ్యాడు. సచిన్ తో పాటు ఆయన భార్య అంజలి, కూతురు సారా కూడా వచ్చారు. అదే పార్టీలో గిల్ కూడా ఉండడంతో ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. అయితే చాలాకాలంగా సచిన్ టెండూల్కర్ కూతురు సారా టెండూల్కర్ తో గిల్ లవ్ స్టోరీ నడిపిస్తున్నాడని రూమర్స్ స్ప్రెడ్ అవుతున్న విషయం తెలిసిందే. గిల్ ఆడే మ్యాచ్ లకు స్టేడియంలో సారా హాజరు కావడం, అతడి బ్యాటింగ్ టైం లో చెప్పట్లు కొడుతూ ఆమె ఎంకరేజ్ చేయడం అప్పట్లో వైరల్ గా మారింది. అలాగే ప్రైవేట్ ప్రోగ్రామ్స్ లో వీరిద్దరూ సీక్రెట్ గా కలుసుకోవడం, గిల్ సోదరితో సారా టెండూల్కర్ నైట్ పార్టీలకు వెళ్లిన వీడియోలు.. గిల్, సారా టెండూల్కర్ డేటింగ్ రూమర్స్ కి బలం చేకూర్చాయి. అయితే ఈ రూమర్స్ పై ఇప్పటివరకు అటు టెండూల్కర్ ఫ్యామిలీ కానీ.. గిల్ కుటుంబం కాని రెస్పాండ్ కాలేదు. రీసెంట్ గా యువరాజ్ సింగ్ ఇచ్చిన పార్టీకి హాజరైన టీమిండియా క్రికెటర్లు రవీంద్ర జడేజా, కేఎల్ రాహుల్, గిల్, రిషబ్ పంత్.. పక్క పక్కనే కూర్చున్నారు. వీరు కూర్చున్న టేబుల్ కి కొంత దూరంలోనే సచిన్ టెండూల్కర్ ఆయన కుటుంబంతో కూర్చున్నాడు. అదే సమయంలో గిల్ అటువైపుగా చూసి నవ్వాడు. దీంతో రవీంద్ర జడేజా కళ్ళు ఎగరేస్తూ ఓ రకమైన ఎక్స్ప్రెషన్స్ ఇస్తూ ఏదో అనడంతో.. గిల్, అతడి పక్కనే ఉన్న కే.ఎల్ రాహుల్ కూడా నవ్వారు. దీంతో ఈ వీడియోని సోషల్ మీడియాలో షేర్ చేస్తూ నెటిజెన్లు రచ్చ రచ్చ చేశారు. తాజాగా సారా టెండూల్కర్ కి సంబంధించిన మరో వీడియోని సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. ఈ వీడియోలో ఓ క్రికెటర్ కి సంబంధించిన డ్రెస్సింగ్ రూమ్ లోకి వెళ్ళింది సారా టెండూల్కర్. సీక్రెట్ గా డ్రెస్సింగ్ రూమ్ లోకి వెళ్లి హెల్మెట్, బ్యాట్ పక్కన కూర్చుని ఫోటో దిగింది. అయితే ఈ వీడియోని వైరల్ చేస్తూ.. సారా, గిల్ డ్రెస్సింగ్ రూమ్ లోకి వెళ్లిందని వైరల్ చేస్తున్నారు.

# ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్ రిలీజ్.. జస్ప్రీత్ బుమ్రా..



లేటెస్ట్ గా ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్ ను రిలీజ్ చేసింది. ఇంగ్లండ్ స్టార్ బ్యాట్స్‌మెన్ జో రూట్ ఐసీసీ నెంబర్ వన్ బ్యాట్స్‌మెన్ గా నిలిచాడు. ఇక టాప్ టెన్ లో ముగ్గురు భారత ఆటగాళ్లు ఉన్నారు. లార్డ్స్ టెస్టులో పోరాటం చేసిన ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా 34వ ప్లేస్ కు చేరుకున్నాడు. లార్డ్స్ లో భారత్ తో జరిగిన మూడో మ్యాచ్‌లో ఇంగ్లండ్ 22 పరుగుల తేడాతో గెలిచింది. ఈ మ్యాచ్‌లో ఇంగ్లిష్ ప్లేయర్ జో రూట్ ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 104, రెండో ఇన్నింగ్స్‌లో 40 పరుగులు చేయడంతో టెస్ట్ ర్యాంకింగ్స్ లో టాప్ ప్లేస్ కు చేరుకున్నాడు. ప్రజంట్ అతని ఖాతాలో 888 పాయింట్లు ఉన్నారు. ఇక మరో ఇంగ్లండ్ ప్లేయర్ హ్యారీ బ్రూక్ రెండుస్థానాలు దిగజారి మూడోస్థానానికి పడిపోయాడు. న్యూజిలాండ్ సీనియర్ ప్లేయర్ కేన్ విలియమ్సన్ రెండోస్థానంలో ఉన్నాడు. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్ నాలుగో స్థానంలో ఉన్నాడు. ఇక టీమిండియా యువ ఆటగాడు యశస్వి జైస్వాల్ ఒక స్థానం దిగజారి ఐదోస్థానానికి చేరుకున్నాడు. సౌతాఫ్రికా కెప్టెన్ టెంబా బావుమా ఆరు, శ్రీలంక ప్లేయర్ కమిందు మెండిస్ ఏడు, టీమిండియా వైస్ కెప్టెన్ రిషబ్ పంత్ ఎనిమిది, కెప్టెన్ శుభ్ మన్ గిల్ తొమ్మిదో స్థానాల్లో ఉన్నారు. పంత్ ఒక స్థానం, గిల్ మూడుస్థానాలు దిగజారాడు. ఇక పదో స్థానంలో ఇంగ్లండ్ ప్లేయర్ జేమీ స్మిత్ పదో స్థానంలో నిలిచాడు. అయితే, లార్డ్స్‌లో 72 పరుగులు, 61 నాటౌట్ గా నిలిచిన జడేజా ఐదు స్థానాలు ఎగబాకి 34వ స్థానానికి చేరుకున్నాడు. ఇదే మ్యాచ్ లో ఫస్ట్ ఇన్నింగ్స్ లో 100, సెకండ్ ఇన్నింగ్స్ లో 39 పరుగులు చేసిన కేఎల్ రాహుల్ కూడా ఐదు స్థానాలు ఎగబాకి 35వ స్థానంలో ఉన్నాడు. లార్డ్స్ లో ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ 77 పరుగులకు ఐదు వికెట్లు సాధించి, బ్యాట్స్‌మెన్ లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గెలువడంతో రెండుస్థానాలు ఎగబాకి 42వ స్థానానికి చేరుకున్నాడు. ఇక బౌలర్ల ర్యాంకింగ్స్ టీమిండియా మిస్టరీ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా నెంబర్ వన్ బౌలర్‌గా కొనసాగుతున్నాడు. ప్రస్తుతం బుమ్రా ఖాతాలో 901 పాయింట్లు ఉన్నాయి. ఇక దక్షిణాఫ్రికాకు చెందిన కగిసో రబాడా సెకండ్ ప్లేస్ కంటిన్యూ అవుతున్నాడు. ఆస్ట్రేలియన్ ఫాస్ట్ బౌలర్ స్కాట్ బోలాండ్ ఎగబాకి ఆరు స్థానాలు క్రాస్ చేసుకుని కెరీర్‌లో అత్యుత్తమంగా ఆరో స్థానానికి చేరుకున్నాడు. టెస్ట్ క్రికెట్‌లో 62 వికెట్లు 16.53 సగటుతో వికెట్లు తీసిన బోలాండ్.. ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమర్స్ జార్జ్ లోహ్మాన్, సిడ్నీ బార్న్స్ మాత్రమే మెరుగైన సగటుతో వికెట్లు పడగొట్టారు. ఇప్పటికే టాప్10లో ఆస్ట్రేలియా ప్లేయర్లు పాట్ కమ్మిన్స్, జోష్ హాజిల్‌వుడ్, నాథన్ లియాన్, మిచెల్ స్టార్క్‌లతో ఐసీసీ ర్యాంకింగ్స్ టాప్ టెన్‌లో ప్లేస్ సాధించుకున్నాడు. 1958లో ఇంగ్లండ్ జట్టు టాప్ 12లో ఆరుగురు బౌలర్లు ఉండగా.. తాజాగా ఐదుగురు ఆస్ట్రేలియా బౌలర్లు ఐసీసీ ర్యాంకింగ్స్ లో చోటు దక్కించుకున్నారు. ఇక టీమిండియా ఆల్ రౌండర్ వాషింగ్టన్ సుందర్ 58వ స్థానం నుంచి 46వ స్థానానికి చేరుకున్నాడు.

# ధోని ఏం చేసినా ట్రెండ్ సెట్టరే..



టీమిండియా క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనీ గురించి స్పెషల్ గా చెప్పాల్సిన అవసరం లేదు. ధోనీ క్రికెట్ ఆడితే అది ఒక ట్రెండే.. క్రికెట్ ఆడినన్ని రోజులు పలు రికార్డులు క్రియేట్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా ధోనీ తన సొంత రాష్ట్రం జార్ఖండ్ కి సరికొత్త దిశా నిర్దేశం చేయడానికి రెడీ అయ్యారు. స్పోర్ట్స్, టూరిజం డిపార్ట్ మెంట్స్ ని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ధోనీ సలహాలు, సహకారం తీసుకోవాలని చూస్తోంది. ఈ నేపథ్యంలో ధోనీ ఓ ప్రోగ్రామ్ లో కనిపించాడు. ఇందులో ధోనీ ఎర్ర కండువా కప్పుకొని ఫొటోకి పోజులిచ్చాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటో వైరల్ అవుతోంది. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా ఎర్ర కండువా కప్పుకొని ఇలాగే పలు సందర్భాల్లో కనిపించిన విషయం తెలిసిందే. సోషల్ మీడియాలో అందరూ ఎర్ర కండువా కప్పుకోండి అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డిజిటల్ గవర్నెన్స్ వంటి ఆడ్వాన్స్ డ్ టెక్నాలజీ ఉపయోగిస్తూ.. రాష్ట్రంలో సమగ్ర అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. జార్ఖండ్ తీసుకుంటున్న ఈ కీలక నిర్ణయాలు.. రాష్ట్ర భవిష్యత్ ను పూర్తి గా మార్చబోతున్నాయి. ముఖ్యంగా జార్ఖండ్ క్రీడలు, పర్యాటక రంగాలను కొత్త శిఖరాలను తీసుకెళ్లడానికి ఆ రాష్ట్ర ప్రభుత్వం మాజీ భారత క్రికెట్ కెప్టెన్ ఎం.ఎస్. ధోనీ సహకారం కోరుతోంది. ఇందుకోసం ఆ రాష్ట్ర పర్యాటక, కళలు, సంస్కృతి క్రీడా శాఖ మంత్రి సుదివ్య కుమార్ తో మీటింగ్ లో పార్టిసిపేట్ చేశారు. స్పోర్ట్స్ రిలేటెడ్ మౌలిక సదుపాయలు, పర్యాటక సామర్థ్యాన్ని పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ధోనీ అనుభవం.. నిబద్ధతతో రాష్ట్రాభివృద్ధి పథంలో దూసుకుపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విషయం పై ధోనీ ఇంకా ఎలాంటి అఫిషియల్ అనౌన్స్ మెంట్ మాత్రం రిలీజ్ చేయలేదు. జార్ఖండ్ లోని దేవ్‌ఘర్ జిల్లా టీమ్ ఓ కొత్త టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చింది. ముఖ్యంగా మేళా ప్రాంతంలో రద్దీని నియంత్రించడానికి భద్రతను పెంచేందుకు ఫేషియల్ రికగ్నిషన్, హెడ్ కౌంటర్ కెమెరాలను కూడా ఏర్పాటు చేసారు. ముఖ్యంగా జార్ఖండ్ ప్రభుత్వం తమ అన్ని కార్యాలయాలను 2026 నాటికి పూర్తిగా డిజిటలైజేషన్ చేయాలని నిర్ణయించింది. ఇక ప్రజంట్ ధోని స్టైల్ ను ఆయన ఫ్యాన్స్ కాపీ చేస్తూ వైరల్ చేస్తున్నారు.

# థర్డ్ టెస్ట్ ఓటమికి జడేజానే కారణం.. పుజారా స్ట్రాంగ్ రిప్లై



ఇంగ్లండ్‌తో లార్డ్స్ వేదికగా జరిగిన మూడో టెస్ట్ మ్యాచ్ లో టీమిండియా ఎంతో పోరాడి చాలా తక్కువ తేడాతో ఓటమి పాలైంది. 22 పరుగుల తేడాతో ఇంగ్లండ్ చేతిలో ఓడిపోయింది. దీనికి గానూ ఫ్యాన్స్ తో పాటు టీమిండియా కూడా చాలా బాధపడింది. అయితే ఆ మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా అద్భుత పోరాడారు. 181 బంతులు ఆడి 61 పరుగులు చేసి నాటౌట్ గా నిలిచాడు. టీమిండియాను గెలిపించేందుకు చివరి వరకు ప్రయత్నించాడు. అయితే దురదృష్టం వెంటాడడంతో టీమిండియా ఓటమి పాలైంది. ఈ క్రమంలో టీమిండియా ఓటమి పాలవడానికి జడేజానే కారణమని కొందరు మాజీలు విమర్శిస్తున్నారు. జడేజా మొదటి నుంచే కాస్త వేగంగా ఆడి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని కొందరు కామెంట్ చేశారు. జడేజా డిఫెన్సివ్ మైండ్ సెట్ కారణంగానే టీమిండియా ఓడిపోయిందని విమర్శిస్తున్నారు. టీమిండియా మాజీ క్రికెటర్లు గంగూలీ, అనిల్ కుంబ్లే, సునీల్ గవాస్కర్, అశ్విన్ ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. వీరిపై మరో మాజీ క్రికెటర్ ఛతేశ్వర్ పూజారా ఆగ్రహం వ్యక్తం చేశాడు. వారి కామెంట్స్ కి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చాడు. చివరి రోజు లార్డ్స్ పిచ్ చాలా మందకొడిగా ఉంది. బంతి కూడా సాఫ్ట్ గా మారిపోయింది. అలాంటి పరిస్థితుల్లో వేగంగా ఆడడం కుదిరే పని కాదు. ఈ సిరీస్‌లో జడేజా బ్యాటింగ్ బాగుంది. నాలుగో ఇన్నింగ్స్‌లో అలా బ్యాటింగ్ చేయడం ఈజీ టాస్క్ అయితే కాదు. టెయిలెండర్ల అండతో మ్యాచ్ ను ముగించాలని జడేజా అనుకుని ఉండవచ్చు. అనవసరంగా వికెట్ పారేసుకోకూడదని జడేజా పట్టుదలగా ఆడాడు. అయితే అదృష్టం కలిసి రాలేదు అని ఛతేశ్వర్ పూజారా అభిప్రాయపడ్డాడు. కాగా ప్రస్తుతం టీమిండియా ఇంగ్లండ్ పర్యటనలో ఉండగా.. సరిగ్గా మరో వారం రోజుల్లో మాంచెస్టర్ లో 4 వ టెస్ట్ సిరీస్ కు సన్నద్ధం అవుతున్నారు.

# నాగార్జున జానర్ ఛేంజ్ తో ట్రెండ్ సెట్?





టాలీవుడ్‌లో కింగ్ నాగార్జున స్టైల్ స్పెషల్ గానే ఉంటుంది. న్యూ టాలెంట్ ని ఇండస్ట్రీకి పరిచయం చేయడంలో ముందుండి ఎంతో మంది టాలెంటెడ్ డైరెక్టర్లని పరిచయం చేసిన రికార్డ్ ఆయనదే. కొత్త టాలెంట్ ని ఆయన ఎంకరేజ్ చేసి ఉండకపోతే ట్రెండ్ సెట్టర్ లాంటి శివ లాంటి ఓ యాక్షన్ సెట్టర్ వచ్చేదే కాదు. రామ్ గోపాల్ వర్మ లాంటి దర్శకుడు ఇండస్ట్రీకి పరిచయమయ్యేవాడు కాదు. ఇలా ఎంతో మంది డైరెక్టర్లని, టెక్నీషియన్ లని నాగ్ ఇండస్ట్రీకి పరిచయం చేసి ఎన్నో కొత్త ప్రయోగాలు చేశారు. ఓ స్టేజ్ లో సెల్యూలాయిడ్ సైంటిస్ట్ అనిపించుకున్నారు. అయితే గత రెండు.. మూడేళ్లుగా నాగార్జున వరుస ఫ్లాపులతో ఏం చేయాలో తెలియని స్థితికి వెళ్లిపోయారు. ఇండస్ట్రీ స్టార్ హీరోలైన చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్ హిట్లు, బ్లాక్ బస్టర్లు ఇస్తుంటే నాగ్ మాత్రం ఫ్లాపులతో షాకులిచ్చారు. ఈ క్రమంలోనే ఆయన తన స్టైల్ మార్చుకుని కేవలం హీరో క్యారెక్టర్లు మాత్రమే చేస్తానని భీష్మించుకు కూర్చోకుండా కథకు కీలకంగా ఉండే పాత్రలకు సై అంటూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు. ఈ క్రమంలో ఆయన రీసెంట్ గా యాక్ట్ చేసిన కుబేర మంచి హిట్ అనిపించుకుని బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లని రాబట్టి ఔరా అనిపించింది. ఈ మూవీతో పాటు నాగార్జున మరో క్రేజీ సినిమాలోనూ కీ రోల్ ని ప్లే చేశారు. అదే సూపర్ స్టార్ రజనీకాంత్ కూలీ. లోకేష్ కనగరాజ్ డైరెక్ట్ చేసిన ఈ సినిమా ఆగస్టు 14న భారీ స్థాయిలో పాన్ ఇండియా మూవీగా రిలీజ్ కాబోతోంది. ఇందులో కింగ్ సిమోన్ అనే పవర్ ఫుల్ డాన్ గా కనిపించి ఫ్యాన్స్‌తో పాటు సినీ లవర్స్ ని సర్ ప్రైజ్ చేయబోతున్నారు. ఇంత వరకు ఎన్నడూ చేయని క్యారెక్టర్‌లో కింగ్ నాగ్ కనిపించబోతున్నారు. ఇదే విషయాన్ని రీసెంట్ గా దర్శకుడు లోకేష్ కనగరాజ్ తెలిపారు. ఎనిమిది సార్లు ఈ క్యారెక్టర్ కోసం నాగార్జునకు నరేషన్ ఇచ్చానని, ఆ తరువాతే ఆయన ఓకే చేశారని తెలిపాడు. నాగార్జున కోసం నాలుగు నెలలు ఎదురు చూశామని, తనతో పాటు రజనీకాంత్ కూడా ఆయన కోసం ఎదురు చూశారని చెప్పుకొచ్చాడు. ఇక ఈ క్యారెక్టర్ చేస్తున్నప్పుడు నాగార్జున తన 40ఏళ్ల కెరీర్‌లో వాడని పదాలని వాడారని, ఈ క్యారెక్టర్ లో ఆయనని ప్రేక్షకులు యాక్సెప్ట్ చేస్తారా లేదా అని నాగార్జునకు కొంత అనుమానంగా ఉందని చెప్పాడు. కింగ్ నాగ్ ని ఈ మూవీలో లోకేష్ కనగరాజ్ సరికొత్త తరహాలో స్టైలిష్‌గా ప్రజెంట్ చేసినట్టుగా తెలుస్తోంది. తనదైన మార్కు నటనతో నాగ్ ఖచ్చితంగా అందరిని డామినేట్ చేస్తాడని ఫ్యాన్స్‌తో పాటు టీమ్ అంతా ఆసక్తిగా ఎదురు చూస్తోంది. ఈ సినిమా బ్లాక్ బస్టర్ అయితే నాగార్జున కూలీతో ట్రెండ్ సెట్ చేస్తాడనిడంలో ఎలాంటి సందేహం లేదని ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తోంది.



# ఈ క్షణం ఎంతో సంతోషం: కమల్, రజనీకాంత్


సూపర్ స్టార్ రజినీకాంత్, లోక నాయకుడు కమల్ హాసన్ ఇద్దరూ మంచి ఫ్రెండ్స్ అనే సంగతి తెలిసిందే. వీరిద్దరి మధ్య ఉన్న స్నేహం ఈనాటిది కాదు, గత 50 ఏళ్లుగా వీరిద్దరూ మంచి ఫ్రెండ్స్. ఆ అనుబంధంతోనే రాజ్యసభ సభ్యుడిగా సెలెక్ట్ అయిన సందర్భంగా తన చిరకాల మిత్రుడు రజినీకాంత్ ను కమల్ హాసన్ కలిశారు. ఈ సందర్భంగా రజినీ, కమల్ ను అభినందించగా, ప్రస్తుతం దానికి సంబంధించిన ఫోటోలను కమల్ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ కొత్త ప్రయాణాన్ని మొదలుపెట్టేముందు నాకెంతో ఇష్టమైన ఫ్రెండ్ తో నా ఆనందాన్ని పంచుకున్నా.. ఈ క్షణం నాకెంతో సంతోషంగా ఉందంటూ రాసుకొచ్చారు. రజినీ, కమల్ బాండింగ్ కు మెయిన్ రీజన్ వీరి గురువు కె. బాలచందర్. ఆయన దర్శకత్వంలో వచ్చిన అపూర్వ రాగంగళ్ తో రజినీకాంత్ హీరోగా పరిచయమవగా అదే సినిమా తెలుగులో తూర్పు పడమరగా రీమేకైంది. ఆ సినిమాతో మొదలైన వారి అనుబంధం 1985లో గిరఫ్తార్ వరకూ కంటిన్యూ అయింది. వారిద్దరూ కలిసి దాదాపు 20 సినిమాల్లో నటించారు. అందులో ఎత్తుకు పై ఎత్తు, అంతులేని కథ, వయసు పిలిచింది, అందమైన అనుభవం, అల్లావుద్దీన్ అద్భుతద్వీపం, పదనారు వయదినిలె, మూంద్రు ముడిచ్, అవర్ గళ్ లాంటివి ఉన్నాయి. వీరిద్దరూ కలిసి చేసిన ఓ సినిమా రిలీజైన సందర్భంగా ఫ్యాన్స్ మధ్య ఏర్పడిన గొడవ చాలా పెద్దదిగా మారి తమిళనాడులోని ఓ థియేటర్ కు భారీ నష్టం వాటిల్లగా ఆ తర్వాత వీరిద్దరూ కలిసి నటించడం మానేశారు. కలిసి సినిమాలు చేయడమైతే మానేశారు కానీ వారిద్దరి మధ్య స్నేహం మాత్రం అలానే చెక్కు చెదరకుండా ఉంది. ఒకరి సినిమాలను మరొకరు ప్రశంసించుకోవడం, ఒకరి పనుల్ని మరొకరు సమర్థించుకోవడం మాత్రం ఎప్పుడూ మానలేదు. కమల్ కంటే ముందు రజనినే పాలిటిక్స్ లోకి వస్తారని కూడా అంతా అనుకున్నారు. రజినీ కూడా ఆ దిశగా ప్రయత్నాలు చేశారు కానీ తర్వాత మనసు మార్చుకున్నారు. కానీ కమల్ మాత్రం మాటపై నిలబడి తమిళ ప్రజలకు, అభిమానులకు ఇచ్చిన మాట ప్రకారం మక్కల్ నీది మయ్యం అనే పార్టీ పెట్టారు. గత ఎన్నికల్లో డీఎంకేకు మద్దతు పలుకుతూ ఆ పార్టీతో పొత్తు పెట్టుకోగా, పొత్తులో భాగంగా ఆ పార్టీ కమల్ ను రాజ్యసభకు నామినేట్ చేసింది. దీంతో మొదటిసారి చట్టసభల్లోకి వెళ్లబోతున్న కమల్, దానికంటే ముందు రజనీను కలిసి, ఆయన విషెస్ అందుకున్నారు. జులై 25న కమల్ రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేయనుండగా, సీనియర్ హీరోలిద్దరూ ఇలా కలుసుకోవడం వారి ఫ్యాన్స్ లో ఆనందాన్ని నింపింది. ఇక అటు కమల్, ఇటు రజనీకాంత్ ఇద్దరూ ప్రజంట్ తమ సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు.




# హరిహర వీరమల్లు సెన్సార్ కట్స్?

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా చేసిన ఒక స్ట్రైట్ సినిమా చాలా కాలం తర్వాత రిలీజ్ కి వస్తుంది. పైగా ఈ మూవీ పవన్ కళ్యాణ్ కెరీర్ లో ఫస్ట్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ గా రావడంతో ఆడియన్స్ కి మరిన్ని అంచనాలు క్రియేట్ అయ్యాయి. ఆ సినిమానే హరిహర వీరమల్లు. దర్శకుడు క్రిష్ జాగర్లమూడి నుంచి మొదలై ఇపుడు జ్యోతికృష్ణతో ముగిసిన ఈ సినిమా సెన్సార్ ని ముగించుకొని గ్రాండ్ గా రిలీజ్ కి రాబోతుంది. అయితే కొన్ని రోజులు కితమే సెన్సార్ పూర్తి చేసుకున్న వీరమల్లు జీరో కట్స్ తో యూ/ఏ సర్టిఫికెట్ ని అందుకున్నట్టు తెలిసింది. కానీ ఇప్పుడు సెన్సార్ సర్టిఫికెట్ బయటకి వచ్చింది. దీనితో వీరమల్లు సినిమా మొత్తం 162 నిమిషాలు రాబోతుండగా ఇందులో కొన్ని మైనర్ కట్స్ ని సెన్సార్ యూనిట్ చెప్పింది. మొత్తం 5 కట్స్, రీప్లేస్ మెంట్స్ హరిహర వీరమల్లుకి పడ్డాయి. స్టార్టింగ్ వాయిస్ ఓవర్ తో కూడిన నిరాకరణ నుంచి కుళి కుతుబ్ షాహ్, కొన్ని విగ్రహాల కరిగింపు అలాగే ఒక గర్భస్థ స్త్రీని హింసించే సీన్ అలాగే ఆలయ ద్వారాన్ని కాలితో తన్నే సీన్స్ వంటివి సెన్సార్ వారు ఆబ్జెక్ట్ చేశారట. వీటికి వేరే మార్గాలు సెట్ చేయాలని సూచించారు. సో వీటికి కొత్త మార్పులతో వీరమల్లు జూలై 24న థియేటర్స్ లో పడనుంది. ఇక ఈ సినిమాలో పవన్ కళ్యాణ్ యాక్షన్ సీక్వెన్సులతో అదరగొట్టనున్నారు. అంతేకాకుండా బ్రో మూవీ తర్వాత పవన్ కళ్యాణ్ కంప్లీట్ గా రాజకీయాలకు పరిమితం కావడంతో ఆయన యాక్టింగ్ ను ఫ్యాన్స్ మిస్ అవుతున్నారు. అందుకే ఇన్ని రోజుల తర్వాత రానున్న ఈ సినిమా కోసం ఫ్యాన్స్ తో పాటు ఆడియన్స్ కూడా వెయ్యి కళ్లతో వెయిట్ చేస్తున్నారు.

# రాజమౌళి సినిమా..మహేష్ రిస్క్ కు రెడీనా?



టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు రాజమౌళి కాంబినేషన్ లో SSMB29 ప్లాన్ చేస్తున్న సంగతి తెలిసిందే. బాలీవుడ్ కమ్ హాలీవుడ్ స్టార్ హీరోయిన్ ప్రియాంక చోప్రా, మాలీవుడ్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఆర్. మాధవన్ మహేష్ తండ్రిగా కనిపించనున్నట్లు టాక్. భారీ బడ్జెట్ తో ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతున్న సినిమా కోసం ఇప్పటి వరకు ఎలాంటి అప్డేట్ ఇవ్వని రాజమౌళి.. షూటింగ్ మాత్రం చాలా స్పీడ్ గా జరుపుతున్నారు. ఇప్పటికే రెండు షెడ్యూల్స్ ను పూర్తి చేసిన రాజమౌళి.. త్వరలో మూవీ టీమ్ కెన్యా వెళ్లనున్నట్లు తెలుస్తోంది. అక్కడ కీలక సీన్స్ షూట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. తర్వాత హైదరాబాద్ సిటీ అవుట్ స్కట్స్ లో వేసిన వారణాసి సెట్ లో షూట్ చేయనున్నారని సమాచారం. అయితే ఫారెస్ట్ అడ్వెంచర్ జోనర్ లో రూపొందుతున్న సినిమాపై ఇప్పటికే ఆడియన్స్ లో వేరే లెవెల్ అంచనాలు నెలకొన్నాయి. బ్లాక్ బస్టర్ హిట్ పక్కా అని ప్రతీ ఒక్క సినీ ప్రియుడు, ఫ్యాన్ ఫిక్స్ అయిపోయారని చెప్పాలి. అయితే సినిమాలో యాక్షన్ సీన్స్ ఫుల్ గా ఉన్నట్లు ఇప్పటికే అందరికీ అర్థమైపోయింది. ఫారెస్ట్ అడ్వెంచర్ కాబట్టి అనేక స్టంట్స్ ఉంటాయి. నెవ్వర్ బిఫోర్ అనేలా మహేష్ బాబు.. యాక్షన్ సీక్వెన్స్ లో కనిపించనున్నట్టు తెలుస్తోంది. దీంతో అంతా వాటిని చూసేందుకు ఎంతో ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు. అదే సమయంలో ఇప్పుడు మరో వార్త వైరల్ అవుతోంది. సాధారణంగా చాలా మంది హీరోలకు డూప్స్ ఉంటారు. కొన్ని యాక్షన్ సీన్స్ లో వారే నటిస్తారు. కానీ ఇప్పుడు డూప్స్ కు మహేష్ నో చెప్పేశారని జోరుగా ప్రచారం జరుగుతోంది. తానే స్వయంగా యాక్షన్ మోడ్ లో దిగుతున్నారని టాక్. డూప్స్ బదులు హార్డ్ వర్క్ చేయాలని మహేష్ డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. అందుకు గాను ఇప్పటికే కసరత్తులు మొదలు పెట్టారని సమాచారం. ఇందులో నిజమెంతో తెలియదు. ఒకవేళ నిజమైతే మాత్రం.. ఇప్పటి వరకు మహేష్ కెరీర్ లో భారీ యాక్షన్ సీన్స్ లో నటించడం ఇదే ఫస్ట్ టైమ్. సో మహేష్ బాబు రిస్క్ కూడా సిద్ధమైనట్లే. మరి ఈ సినిమాతో మహేష్ బాబు రేంజ్ ఎక్కడి వరకు వెళ్తుందో అనేది చూడాలి.

# ఉపాసన: 150 అనాథ ఆశ్రమాల దత్తత



మెగా కోడలు ఉపాసన సోషల్ యాక్టివిటీస్ లో చాలా యాక్టివ్ గా ఉంటారని అనడంలో సందేహం లేదు. సోషల్ మీడియా వేదికగా వీలైనంత వరకూ అవేర్ నేస్ తీసుకొచ్చే ప్రయత్నం చేస్తుంటారు. ఆరోగ్యానికి సంబంధించిన విషయాలతో పాటు పర్సనాలిటీ డెవెలెప్ మెంట్ కు సంబంధించిన టాపిక్స్ గురించి మాట్లాడుతుంటారు. అలాగే అనేక సేవా కార్యక్రమాలు చేస్తుంటారు. ఈ మధ్య కాలంలో ఇలాంటి విషయాల పట్ల మరింత చురుకుగా పనిచేస్తున్నారు. లేటెస్ట్ గా ఉపాసన ఏకంగా 150 అనాథ ఆశ్రమాలను దత్తత తీసుకున్నారు. ఇక నుంచి వాటి బాధ్యత మొత్తం ఉపాసన చూసుకుంటారు. అనాథ బాలలు, వృద్ధులు పట్ల సహృదయంతో ఉపాసన ముందుకు కదలడం అన్నది ఎంతో గొప్ప విషయం. వాళ్లతో ఉపాసన కలిసి వర్క్ చేస్తున్న తీరు చూస్తుంటే? ఉపాసన మనసు ఎంత గొప్పదన్నది హైలైట్ అవుతుంది. 150 అనాథ శ్రమాల్లో వాళ్లకు కావాల్సిన అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నారు. అలాగే పండగలు, పబ్బాలు సమయంలో కూడా ఉపాసన స్పెషల్ గా ఇకపై పర్యటించే అవకాశం ఉంది. అనాథలంటే ఎవరూ లేని వారు కాబట్టి తమకు తోడుగా తాను ఉన్నానని భరోసా అన్ని రకాలుగా కల్పిస్తున్నారు. ఇప్పటికే అపోలా సంస్థ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయి. తాజాగా 150 ఆశ్రమాలు కూడా తోడవ్వడంతో ఉపాసన మరింత బిజీగా ఉండనున్నారు. ఈ మధ్య కాలంలో సోషల్ మీడియాలో యాక్టివిటీ కూడా తగ్గించారు. చరణ్ కుసంబంధించిన విషయమో.. అత్తమ్మకు సంబంధించిన విషయాలు అప్పుడప్పుడు పంచుకునేవారు. కానీ ఇప్పుడు అవి కూడా తగ్గాయి. అపోలా సహా సేవా కార్యక్రమాల్లో మరింత బిజీ అవ్వడంతోనే ఇంటి విషయాలకు ప్రాధాన్యత తగ్గించినట్లు కనిపిస్తుంది. ఉపాసన చేస్తోన్న ఈ సేవా కార్యక్రమాల విషయంలో రామ్ చరణ్ ఎంతో గర్విస్తున్నారు. ఇప్పటికే చిరంజీవి బ్లడ్ బ్యాక్ పేరిట పలు సేవా కార్యక్రమాలు జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఇక మరోపక్క రామ్ చరణ్ తన బ్యాక్ టు బ్యాక్ మూవీస్ తో ఫుల్ బిజీగా మారారు.